www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



14

స్కిల్ యూనివర్సిటీ చైర్మన్‌గా

ఆనంద్ మహీంద్ర

కో-చైర్మన్‌గా శ్రీనిరాజు.. ఏడాదిపాటు పదవుల్లో నియమిస్తూ రాష్ట్ర సర్కార్ ఉత్తర్వులు జారీ

శుక్రవారం | 16-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 139 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి ఉ. 9.40 తదుపరి ద్వాదశి; నక్షత్రం: మూల మ. 12.44 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: ఉ. 11.08-12.44, రా. 9.58-11.30; దుర్ముహూర్తం: ఉ. 8.32-9.23, మ. 12.44-1.34; అమృతఘడియలు: ఉ. 6.22-7.57; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.01; సూర్యాస్తమయం: 6.36 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

చేసి చూపించాం

2 లక్షల మాఫీ హామీ నెరవేర్చాం.. హరీశ్! సిగ్గుంటే రాజీనామా చెయ్



ఖమ్మం జిల్లా వైరా బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- ప్రాజెక్టులపై ఎక్కడైనా చర్చకు మేం సిద్ధం.. మరి మీరు?
- బీఆర్‌ఎస్ నుంచి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌లలో ఎవరొస్తారు?
- గోదావరి, కృష్ణా జలాలతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తాం
- 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని త్వరలో ప్రారంభిస్తాం
- ప్రజలు అండగా నిలిస్తే బీఆర్‌ఎస్, బీజేపీని బొందపెడతాం
- ఖమ్మం జిల్లా వైరా బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- భద్రాద్రి జిల్లా పూసుగూడెంలో సీతారామ పంప్‌హౌజ్ ప్రారంభం
- పాల్గొన్న భట్టి విక్రమార్క, తుమ్మల, ఉత్తమ్, పొంగులేటి

ఖమ్మం, కొత్తగూడెం, ఆగస్టు 15 (ఆంధ్ర జ్యోతి ప్రతినిధి)/వైరా: 'రుణ మాఫీతో తెలంగాణలో రైతులు రుణ విముక్తులై స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో ఖమ్మం జిల్లా గడ్డపై నుంచి ఆగస్టు 15 నాటికి రూ.2 లక్షల రుణమాఫీ చేసి చూపుతామని మేం చెబితే.. చేయలేరని మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ చేసిండు. మేము మాట నిలబెట్టుకుంటే రాజీనామా చేస్తానని చెప్పిండు. ఇప్పుడు మేం పూర్తిగా మాఫీ చేశాం.. వెంటనే హరీశ్ రాజీనామా చేయాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిగ్గు, శరం లేకుండా విమర్శలు చేస్తున్న హరీశ్.. చీము, నెత్తురు ఉంటే రాజీనామా చేయాలన్నారు. సిద్దిపేటలో మళ్లీ ఎలా గెలుస్తాడో చూస్తామన్నారు. రాజీనామా చేయకపోతే ఏట్లో దూకాలని.. అప్పుడు సిద్దిపేటకు పట్టిన చీడ, పీడ వదులుతుందని రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, బీజేపీలను బొందపెట్టడం ఖాయమని.. ఆ సంగతి తాను చూసుకుంటానని, ప్రభుత్వానికి అండగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీతారామ పంప్‌హౌజ్ మోటార్ల ప్రారంభోత్సవం సందర్భంగా ఖమ్మం జిల్లా వైరాలో గురువారం 'సాగుకు జీవం.. రైతుకు ఊతం' బహిరంగ సభలో సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంతకుముందు భద్రాద్రి జిల్లా పూసుగూడెంలో సీతారామ పంప్‌హౌజ్‌ను ఆయన ప్రారంభించారు. వైరాలో మాట్లాడుతూ.. ఈ సభలో మొత్తం 2 లక్షలలోపు రుణాలున్న రైతులకు రూ.31 వేల కోట్లు మాఫీ చేసినట్లు

మిగతా 13వ పేజీలో...

రుణమాఫీ రైతులు 22 లక్షల మందేనా?

- 17,869 కోట్లు సరిపోతాయా?
- మీ రుణమాఫీ పచ్చి అబద్ధం
- రైతు ద్రోహమే కాదు.. దైవ ద్రోహానికీ పాల్పడ్డ రేవంత్: హరీశ్‌రావు

14

ఫ్యూచర్ స్టేట్‌గా తెలంగాణ

- సకల జనులు సుఖశాంతులతో శోభిల్లే రాష్ట్రంగా మార్చుతాం
- విశ్వవేదికపై తెలంగాణ బ్రాండ్
- రైతు కూలీలకు త్వరలో 12 వేలు
- గోల్కొండలో స్వాతంత్ర్య వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి

3

ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

- నేడు సోనియా, రాహుల్‌తోపాటు కాంగ్రెస్ అగ్ర నేతలతో భేటీ
- పీసీసీ చీఫ్, మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవులపై చర్చ

13

లౌకిక పౌరస్మృతి



ఎర్రకోట నుంచి జాతినుద్దేశించి ప్రసంగిస్తున్న మోదీ

రాజ్యాంగకర్తల నుంచి సుప్రీంకోర్టు వరకు 78 ఏళ్లుగా కోరుతున్నదిదే

- ఇప్పటి మతపర సివిల్ కోడ్‌ను మార్చాలి
- 'ఒక దేశం-ఒకే ఎన్నికలు' నేటి అవసరం
- బంగ్లా హిందువులకోసం భారతీయుల్లో కలత
- మహిళలపై అఘాయిత్యాలు బాధిస్తున్నాయి
- వేగంగా జరిపే దర్యాప్తుతోనే జనంలో నమ్మకం
- వచ్చే ఐదేళ్లలో కొత్తగా 75 వేల మెడికల్ సీట్లు
- వైద్య విద్య కోసం ఇక విదేశాలకు వెళ్లక్కర్లేదు
- స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో ప్రధాని

న్యూఢిల్లీ, ఆగస్టు 15 : దేశానికి లౌకిక పౌరస్మృతి అవసరమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. ఇప్పుడున్న సివిల్ కోడ్ మతపరమైనదీ, వివక్షాపూరితమైందని ఆక్షేపించారు. దీనిపై విస్తృతస్థాయిలో చర్చ జరగాలని మోదీ అభిప్రాయపడ్డారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం దేశ రాజధానిలోని ఎర్రకోట బురుజుపై జాతీయ జెండాను ఎగురవేసి, ప్రధాని ప్రసంగించారు. కాషాయం, ఆకుపచ్చ, పసుపు కలగలిసిన రాజస్థానీ (లెహెరియా) తలపాగా, తెల్ల కుర్తా, చుడీదార్‌తో మోదీ కనిపించారు. తన ప్రసంగంలో ఆయన వికసిత భారత్ భావనను మరింత ప్రస్ఫుటంగా ఆవిష్కరించారు. బంగ్లాదేశ్‌లో హిందువుల రక్షణ, దేశంలో మహిళలపై పెరిగిన అఘాయిత్యాల నుంచి ఒక దేశం- ఒకే ఎన్నికలు, సెబీ ఛైర్మన్-అదానీ వివాదంలో విపక్షాల తీరు, ప్రపంచ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను నిలపడం వరకు అనేక అంశాలను తన ప్రసంగంలో ఆయన ప్రస్తావించారు. ప్రధానిగా ఎర్రకోట బురుజు నుంచి ఆయన ప్రసంగించడం ఇది 11వ సారి. 98 నిమిషాలపాటు సుదీర్ఘంగా ప్రసంగించి.. రికార్డు

మిగతా 2వ పేజీలో...

ఆర్‌ఆర్‌ఆర్‌లో మరో కీలక అడుగు

- అటవీ భూములకు బదులు అటవీయేతర భూములు

14

- మహబూబాబాద్‌లో.. రాష్ట్రం 160 ఎకరాలు కేటాయింపు
- ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం నిర్మాణానికి మార్గం సుగమం
- త్వరలో కేంద్ర అటవీ శాఖ అనుమతులకు అవకాశం

వైద్య విద్యార్థులకు అధిక శ్రమ వద్దు

2

- వారంలో గరిష్ఠం 74గంటలు పని
- వారాంతపు సెలవు ఇవ్వాల్సిందే
- రోగులు పెరిగితే అదనంగా వైద్యులను నియమించుకోవాలి
- ఎన్‌ఎంసీ టాస్క్‌ఫోర్స్ నివేదిక



13

డ్రగ్స్ దొరికితే.. అడ్మిషన్ రద్దు!

- వర్సిటీలు, కాలేజీల్లో నియంత్రణపై సర్కారు దృష్టి
- రేపు కీలక సమావేశం

ఎడారి బతుకులు!

ఉపాధి కోసం నిరుద్యోగులు, కార్మికుల గల్ఫ్ బాట

- మంచి ఉద్యోగాల పేరుతో వారిని అక్కడికి పంపి కూలిపనుల్లోకి దింపుతున్న ఏజెంట్లు
- అప్పులు తీర్చే దారి లేక కొందరి ఆత్మహత్య.. ప్రమాదాల్లో చనిపోతున్న వారు మరికొందరు
- ఆర్నెల్లలో 21మంది కామారెడ్డి జిల్లా వాసుల మృతి.. ఆదుకోవాలంటున్న బాధిత కుటుంబాలు

కామారెడ్డి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం సౌదీకి వెళ్లి.. తనను అక్కడికి పంపిన ఏజెంట్ చేసిన మోసం కారణంగా ఎడారిపాలైన ఓ వ్యక్తి కథతో ఇటీవల వచ్చిన సినిమా.. 'ఆడు జీవితం'! అది కథ కాదు. తెలంగాణ నుంచి సైతం.. బతుకు వేటలో భాగంగా అలా గల్ఫ్ బాట పడుతున్న ఎందరో నిరుద్యోగులు, కార్మికులు ఏజెంట్ల మోసాలకు బలైపోతున్నారు. వారి పేదరికం, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు ఏజెంట్లు.. 'మంచి జీతంతో ఉద్యోగం' అంటూ రంగుల కలను చూపించి వలలో వేసుకుంటున్నారు! ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షల దాకా వసూలు చేసి.. చివరికి అక్కడికి పంపాక కూలిపనిలోకి దింపుతున్నారు. ఇంకొందరిని.. వర్క్ వీసాతో కాకుండా విజిట్ వీసాపై పంపి మోసగిస్తున్నారు. అలా మోసపోయినవారిలో కొందరు.. అక్కడికి చేరుకోవడానికి తాము చేసిన అప్పు తీర్చే దారి లేక.. వెనక్కి తిరిగి రాలేక.. ఆత్మహత్య చేసుకుంటున్నారు. మరికొందరు ప్రమాదాల్లో, అనారోగ్యానికి గురై మరణిస్తున్నారు. గడిచిన ఆరునెలల్లో ఇలా ఒక్క కామారెడ్డి జిల్లాకు చెందినవారే 21మంది గల్ఫ్ దేశాల్లో చనిపోవడం గమనార్హం. రాష్ట్రం నుంచి గల్ఫ్ బాట పడుతున్న వారిలో.. ఉత్తర తెలంగాణ జిల్లాలైన నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల, కరీంనగర్, సిద్దిపేట, మెదక్ జిల్లాల వారే ఎక్కువ. ఇక్కడ ఉపాధి అవకాశాల్లేక, వ్యవసాయం గిట్టుబాటు కాక.. ఈ జిల్లాలకు చెందిన సుమారు 3లక్షల మంది గల్ఫ్ దేశాలకు

మిగతా 12వ పేజీలో...

వైద్య విద్యార్థులకు అధిక శ్రమ వద్దు

వారంలో 74 గంటల కంటే ఎక్కువ పని వద్దు.. వారాంతపు సెలవులు ఇవ్వాల్సిందే

» ఎన్ఎంసీ టాస్క్‌ఫోర్స్ నివేదిక

న్యూఢిల్లీ, ఆగస్టు 15: వైద్య విద్యార్థులతో ఎక్కువ గంటలు ఆస్పత్రుల్లో పనిచేయించడం వారి భౌతిక, మానసిక ఆరోగ్యం పాలిట ముప్పు అని జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) టాస్క్‌ఫోర్స్ స్పష్టం చేసింది. వారికి వారంలో 74 గంటల కంటే ఎక్కువ పని అప్పగించకూడదని సూచించింది. వైద్య విద్యార్థులకు రోజులో 7 నుంచి 8 గంటల మేర కనీస నిద్ర అవసరమని పేర్కొంది. కంటినిండా నిద్ర లేకుంటే.. వారు భౌతిక, మానసిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటారని హెచ్చరించింది. వైద్య విద్యార్థులు సెలవులు అడిగితే.. భేషరతుగా ఇవ్వాలని తెలిపింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి ఓ నివేదికను సమర్పించింది. పీజీ విద్యార్థులు, ఇంటర్న్‌షిప్‌లో ఉన్నవారు విద్యను అభ్యసించే క్రమంలో ఆస్పత్రుల్లో పనిచేస్తారని, వైద్యుల కొరతను తీర్చడానికి కాదని ఆ నివేదికలో తేల్చిచెప్పింది. వైద్య విద్యార్థులు మానసిక ఆరోగ్యంపై ఏర్పాటైన ఎన్ఎంసీ టాస్క్‌ఫోర్స్ నివేదికలోని కీలకాంశాలు..

- రోగుల సంఖ్య పెరిగినప్పుడు విద్యార్థులపై ఒత్తిడి పెంచడం, వారితో అదనపు గంటలు పనిచేయించడం కాకుండా.. సీనియర్ రెసిడెంట్లు, వైద్యాధికారులను నియమించుకోవాలి. అందుకు తగ్గట్లుగా విభాగాధిపతులు, ఫ్యాకల్టీ, సీనియర్ రెసిడెంట్లు, రెసిడెంట్లు ప్రణాళికలను రూపొందించుకోవాలి
- పీజీ విద్యార్థులకు రెండు వారాలు, ఎంబీబీఎస్ విద్యార్థులకు నాలుగు వారాల చొప్పున ఓరియెంటేషన్ కార్యక్రమాలను నిర్వహించాలి
- మానసిక ఆరోగ్యం కోసం యోగాలో శిక్షణనివ్వాలి
- విద్యార్థులకు ఉచితవైద్య చికిత్సలను అందజేయాలి
- ర్యాగింగ్ నిర్మూలన విషయంలో ఎన్ఎంసీ నిబంధనలను కఠినంగా పాటించాలి
- బ్యాక్‌లాగ్‌ల ఒత్తిడి లేకుండా సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించాలి. విద్యార్థుల ఫలితాలను రోల్ నంబర్ల ద్వారా ప్రకటించాలి
- స్పెషలిస్టుల డిమాండ్ ఉన్న విభాగాల్లో పీజీ సీట్లను పెంచాలి
- 24 గంటలూ విద్యార్థులకోసం సపోర్ట్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి
- ప్రతి 500 మంది విద్యార్థులకు కనీసం ఇద్దరు కౌన్సెలర్లను నియమించాలి
- వైద్య విద్యార్థుల సమస్యలపై ఫిర్యాదులకు ఒక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావాలి.

లోకం తీరు





ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ప్రధాన కార్యాలయంలో.. ఘనంగా స్వాతంత్ర్య దిన వేడుకలు

» జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ప్రధాన కార్యాలయంలో స్వాతంత్ర్య దిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఫిలింనగర్‌లోని 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ప్రధాన కార్యాలయంలో 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. వేడుకల్లో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి డైరెక్టర్లు వేమూరి ఆదిత్య, కోగంటి భానుప్రకాష్, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, పలు విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మూకశ్మీర్ ప్రత్యేక డీజీపీగా నళిన్ ప్రభాత్



» ఆయన ఏపీ క్యాడర్ అధికారి

న్యూఢిల్లీ, ఆగస్టు 15: సమర్థుడైన ఐపీఎస్ అధికారిగా గుర్తింపు పొందిన నళిన్ ప్రభాత్ (55)ను జమ్మూకశ్మీర్ ప్రత్యేక పోలీసు డైరెక్టర్ జనరల్‌గా నియమిస్తూ కేంద్ర హోం శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. తక్షణమే ఆ బాధ్యతలను చేపట్టాలని ఆదేశించింది. ప్రస్తుత డీజీపీ ఆర్ఆర్ స్వెయిన్ సెప్టెంబరు 30న పదవీ విరమణ చేసిన వెంటనే ఆయన డీజీపీగా బాధ్యతలు చేపట్టనున్నారు. 1992 బ్యాచ్ ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన ఆయనను హోంశాఖ కేంద్రపాలిత ప్రాంతాల కేడర్‌కు మూడేళ్లపాటు డిప్యుటేషన్‌పై పంపింది. జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతం కావడంతో ఈ ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఉమ్మడి ఏపీలో నక్సలైట్ల సమస్యను ఎదుర్కోవడంలో సమర్థంగా వ్యవహరించారు. గ్రేహౌండ్స్, సెంట్రల్ రిజర్వు పోలీసు ఫోర్స్‌లో పనిచేశారు. ప్రస్తుతం నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జీ) డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్న ఆయనను కాలపరిమితి ముగియకుండానే జమ్మూకశ్మీర్‌కు పంపింది. ఆయనకు 3 పోలీసు గ్యాలెంటరీ మెడల్స్, పరాక్రమ్ పతకం, ఇతర మెడల్స్ లభించాయి. సవాళ్లను ఎదుర్కోవడంలో ధైర్య సాహసాలను ప్రదర్శించడంతోపాటు అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తారన్న పేరు ఆయనకు ఉంది. ప్రస్తుతం జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం ప్రబలడంతో దాన్ని అణచివేతకు నళిన్ ప్రభాత్‌ను కేంద్రం ప్రత్యేకంగా ఎంపిక చేసినట్టు పరిశీలకులు భావిస్తున్నారు.

ఇక ప్రతి నెలా 'కిసాన్ కీ బాత్': శివరాజ్ సింగ్

న్యూఢిల్లీ, ఆగస్టు 15: రైతులకు శాస్త్రీయ పరిజ్ఞానం అందించేందుకు ఇకపై ప్రతి నెలా రేడియోలో కిసాన్ కీ బాత్ కార్యక్రమం నిర్వహిస్తామని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు. గురువారం ఇక్కడ జాతీయ తెగుళ్ల నిఘా వ్యవస్థ (నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టం-ఎన్‌పీఎస్ఎస్)ను ప్రారంభించిన సందర్భంగా ఆయన ప్రసంగించారు. కిసాన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా వ్యవసాయ మంత్రి, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులకు వివరిస్తారని తెలిపారు. తగు అవగాహన లేకపోవడంతో రైతులు ఇష్టం వచ్చినట్టు క్రిమిసంహారక మందులు వాడుతున్నారని, దీనిపై చైతన్యం కలిగించాల్సి ఉందని చెప్పారు. కృషి విజ్ఞాన్ కేంద్రాల నిర్వహణను మరింత మెరుగుపరిచి రైతులకు అందుబాటులోకి తేవాల్సి ఉందన్నారు.

ఇజ్రాయెల్‌పై వెనకడుగు వేస్తే 'దైవాగ్రహం' తప్పదు

» ఇరాన్ సుప్రీం లీడర్ ఖమెనెయ్ హెచ్చరిక

న్యూఢిల్లీ, ఆగస్టు 15: ఇజ్రాయెల్‌పై చర్యలు తీసుకోవడంలో ఇరాన్ వెనకడుగు వేస్తే దైవాగ్రహానికి గురికావాల్సి ఉంటుందని ఆ దేశ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమెనెయ్ (86) హెచ్చరించారు. ఇజ్రాయెల్‌తో మిలటరీ, రాజకీయం, ఆర్థికపరంగా రాజీ పడడంగానీ, వెనక్కి తిరిగి రావడంగానీ జరగకూడదన్నారు. హమాస్ రాజకీయ విభాగం చీఫ్ ఇస్మాయిల్ హనియెహ్ గత నెలలో టెహ్రాన్‌లో హత్యకు గురైన దగ్గర నుంచి ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో సుప్రీం లీడర్ చేసిన హెచ్చరిక ప్రాధాన్యం సంతరించుకొంది. ఎలాంటి దాడులు చేయకుండా ఇరాన్‌పై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఇజ్రాయెల్ చేస్తున్న ప్రయత్నాలను ఆయన 'శత్రువు చేసే మానసిక యుద్ధం'గా అభివర్ణించారు.

అగ్నిక్షిపణి పితామహుడు రామ్‌నారాయణ్ ఇకలేరు



» బాలిస్టిక్ క్షిపణుల తయారీలో కీలక భూమిక

అల్వాల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): అగ్నిక్షిపణి పితామహుడు, డీఆర్‌డీవో మాజీ శాస్త్రవేత్త డాక్టర్ రామ్‌నారాయణ్ అగర్వాల్(84) ఇకలేరు. గురువారం ఆయన హైదరాబాద్‌లో కన్నుమూశారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో జన్మించిన రామ్‌నారాయణ్.. బెంగళూరులోని ఐఐఎస్సీ నుంచి ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ పూర్తిచేశారు. డీఆర్‌డీవోలో శాస్త్రవేత్తగా సేవలందించిన ఆయన అగ్ని మిసైల్స్‌కు మొదటి ప్రోగ్రామ్ డైరెక్టర్. 1983లో అగ్ని-1ను విజయవంతంగా పరీక్షించారు. అంతా ఆయనను అగర్వాల్ అని కాకుండా.. ముద్దుగా 'అగ్నివాల్' అని పిలిచేవారు. రామ్‌నారాయణ్ బాలిస్టిక్ క్షిపణుల తయారీలో కీలక పాత్ర పోషించారు. ఆయన సేవలకుగాను భారత ప్రభుత్వం ఆయనను పద్మభూషణ్‌తో సత్కరించింది. ఆయన హైదరాబాద్‌లోని అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ల్యాబొరేటరీ(ఏఎస్ఎల్)కు వ్యవస్థాపక డైరెక్టర్‌గా సేవలందించారు. 2005లో డీఆర్‌డీవో నుంచి రిటైర్ అయ్యారు. రామ్‌నారాయణ్ మృతిపట్ల సీనియర్ సైంటిస్టులు, అధికారులు, డీఆర్‌డీవో మాజీ శాస్త్రవేత్తలు సంతాపం తెలిపారు. డీఆర్‌డీవో మాజీ చీఫ్ సతీశ్‌రెడ్డి రామ్‌నారాయణ్ మరణంతో దేశం ఓ లెజెండ్‌ను కోల్పోయిందన్నారు.

మహిళా ఉద్యోగులకు ఒక రోజు రుతుకాల సెలవు

» ప్రైవేటు ఉద్యోగినిలకూ వర్తింపు: ఒడిశా ప్రభుత్వం

భువనేశ్వర్, ఆగస్టు 15: ఒడిశాలో మహిళా ఉద్యోగులకు ఒక రోజు వేతనం కూడిన రుతు క్రమ సెలవు ఇవ్వనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇది ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని ఉద్యోగినిలకూ వర్తిస్తుంది. అయితే ఇది ఐచ్ఛికం మాత్రమేనని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని మహిళా, శిశు సంక్షేమ శాఖను నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి ప్రవతి పరిడా వెల్లడించారు. గురువారం కటక్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో ఈ విషయాన్ని ప్రకటించారు. రుతు క్రమంలోని మొదటి రోజుగానీ, రెండో రోజుగానీ ఈ సెలవు తీసుకోవచ్చన్నారు.

మణిపూర్‌ను సందర్శించండి: ప్రధానికి రాహుల్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 15: అల్లర్లతో అతలాకుతలమవుతున్న మణిపూర్‌ను సందర్శించాలని ప్రధాని మోదీకి విపక్షనేత రాహుల్ గాంధీ మరోమారు విజ్ఞప్తి చేశారు. సాధ్యమైనంత త్వరగా శాంతియుత పరిష్కారానికి కృషి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఢిల్లీలో నివసిస్తున్న మణిపూర్ రాష్ట్ర వాసులు కొందరు గురువారం రాహుల్‌తో భేటీ అయ్యారు. ఘర్షణల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను ఆయనకు వివరించారు. ఈ సమావేశం వివరాలను రాహుల్ గాంధీ ఎక్స్ ద్వారా వెల్లడించారు.

లౌకిక పౌరస్మృతి

(మొదటి పేజీ తరువాయి)

సృష్టించారు. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో 2016లో అత్యధిక సమయం ప్రసంగించిన తన రికార్డును (94 నిమిషాలు) తానే బద్దలుకొట్టడం విశేషం. దాదాపు ఆరువేలమంది పాల్గొన్న ఈ కార్యక్రమానికి ఈసారి ఒలింపిక్ పతక విజేతలను ప్రత్యేకంగా ఆహ్వానించారు. వారికి కేటాయించిన సీట్ల వరుసలో, వారితోపాటు ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ కూర్చున్నారు. ఆ తర్వాతి వరుసలను కాంగ్రెస్ పార్టీ ఎంపీలకు కేటాయించారు.

మహిళల రక్షణకు ప్రభుత్వాలు కదలాలి

ప్రధానమంత్రి తన ప్రసంగంలో సుప్రీంకోర్టు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చిన సివిల్ కోడ్ అంశాన్ని ప్రస్తావించారు. "మన సమాజంలోని ఒక పెద్ద సమూహం ఇప్పటి సివిల్ కోడ్ మతపరంగా ఉన్నదని నమ్ముతోంది. అది నిజం కూడా. మతపర సివిల్ కోడ్ నీడన మనం ఉన్నాం. ఈ కోడ్ వివక్షాపూరితమైంది. అది మత ప్రాతిపదికన దేశాన్ని ముక్కలు చేసి, అసమానత్వాన్ని ప్రోత్సహిస్తుంది. ఇప్పుడు మనమంతా సెక్యులర్ సివిల్ కోడ్‌కు మారాలి. ఇది ఇప్పటి అవసరం. రాజ్యాంగ స్ఫూర్తి కూడా ఇదే. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు పలుమార్లు నొక్కిచెప్పింది. ఈ విషయంలో రాజ్యాంగ నిర్మాతల స్వప్నాన్ని సాకారం చేసి తీరాలి" అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. బంగ్లాదేశ్‌లోని హిందువులు, ఇతర మైనారిటీల రక్షణ విషయంలో 140 కోట్లమంది భారతీయులు కలత చెందుతున్నారని ప్రధాని మోదీ అన్నారు. పొరుగుదేశంలో పరిస్థితులు త్వరలోనే కుదురుకుంటాయన్న ఆశాభావాన్ని ఆయన వెలిబుచ్చారు. కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై హత్యాచారం ఘటనను ప్రధాని పరోక్షంగా ప్రస్తావించారు. " ప్రతిరంగంలో మహిళలు దూసుకుపోతున్నారు. కానీ, వారిపై జరుగుతున్న దాడుల ఘటనలు బాధిస్తున్నాయి. ఇలాంటి ఘటనల్లో మహిళలకు భరోసా ఇచ్చే చర్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాలి. వేగంగా దర్యాప్తు జరిపించడం వల్ల ప్రజల్లో నమ్మకం కలిగించగలుగుతాం" అని ఆయన అభిప్రాయపడ్డారు.



యువతే రాజకీయాలను మార్చాలి

2047 నాటికి 'వికసిత్ భారత్‌ను ఆవిష్కరిస్తామని, ప్రపంచ మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించి తీరుతామని మోదీ పునరుద్ఘాటించారు. భారత్‌కు ఇది స్వర్ణ శకమని అభివర్ణించారు. రాజకీయాల నుంచి కులతత్వం, బంధుప్రీతిని పారదోలాలన్నారు.

భారత్‌పై జరిగే కుట్రల్లో భాగం కావద్దు

బీజేపీ మేనిఫెస్టోలో యూనిఫామ్ సివిల్ కోడ్‌తోపాటు 'ఒక దేశం- ఒకే ఎన్నికలు' అనేదీ ముఖ్యమైనదే. ఈ ప్రతిపాదన సాధ్యాసాధ్యాల పరిశీలనకు గత ఏడాది లా కమిషన్ ఏర్పడింది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఈ కమిటీ రాజకీయ పార్టీలను సంప్రదించి తయారుచేసిన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ ప్రతిపాదనను ఎక్కువ పార్టీలు వ్యతిరేకించడాన్ని మోదీ ప్రస్తావిస్తూ.. అభివృద్ధిని చూసి ఓర్వలేని వారిని, దేశ సంక్షేమం పట్టనివారిని ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ఇలాంటి వారిని అనుమతిస్తే ప్రతిదాన్నీ ధ్వంసం చేసేస్తారనీ, అంతిమంగా దేశాన్ని అరాచకం దిశగా నడిపిస్తారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సెబీ చైర్‌పర్సన్- అదానీ వ్యవహారంపై హిండెన్‌బర్గ్ నివేదికను పరోక్షంగా మోదీ ప్రస్తావిస్తూ.. భారత్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న కుట్రల్లో విదేశీ శక్తులు భాగస్వాములు కావొద్దని, భారత్ అభివృద్ధి చెందితే, అది ఆ ఒక్క దేశానికే కాకుండా మొత్తం మానవాళి సంక్షేమానికి దోహదకారి అవుతుందనేది గుర్తించాలని ఆయన ఘాటుగా హితవు పలికారు.

దీనికోసం రాజకీయ కుటుంబాలకు చెందని కనీసం లక్ష మంది యువత ప్రజాజీవితంలోకి రావడానికి సిద్ధపడాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లోకి కొత్త రక్తం వచ్చి చేరడం ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. వైద్యవిద్య కోసం రూ.లక్షలు, రూ.కోట్లు ఖర్చుపెట్టి విదేశాలకు విద్యార్థులు ఏటా వెళుతుండటాన్ని మోదీ ప్రస్తావిస్తూ.. ఎక్కడికో వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితిని తప్పించడానికి వచ్చే ఐదేళ్లలో కొత్తగా 75 వేల మెడికల్ సీట్లను అందుబాటులోకి తేనున్నామని తెలిపారు.

నవంబరులో గగన్‌యాన్

» శ్రీహరికోట నుంచే ప్రయోగం

» సెప్టెంబరులో అంతరిక్షంలోకి ప్రోబ్ ఉపగ్రహం

» ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ వెల్లడి

సూళ్లూరుపేట, ఆగస్టు 15: గగన్‌యాన్ ప్రయోగం నవంబరు నెలాఖరులో ఉంటుందని ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్‌లో ఆయన జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే గగన్‌యాన్‌కు సంబంధించి తుది దశ పరీక్షలు విజయవంతంగా నిర్వహించామన్నారు. నవంబరులో గగన్‌యాన్ ప్రయోగం శ్రీహరికోట నుంచే ఉంటుందని చెప్పారు. కాగా, శుక్రవారం షార్ నుంచి ప్రయోగించే ఎస్ఎస్ఎల్వీ-డీ3 ప్రయోగానికి సర్వం సిద్ధం చేశామన్నారు. ఎస్ఎస్ఎల్వీ ప్రాజెక్టులో ఇది మూడో ప్రయోగమని తెలిపారు. సెప్టెంబరులో పీఎస్ఎల్వీ రాకెట్ ద్వారా ప్రోబ్ ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపనున్నట్లు తెలిపారు. నావిక్ ఉపగ్రహ ప్రయోగం కూడా ఈ ఏడాది చివరిలోపు ఉంటుందన్నారు. ఇవే కాకుండా జీఎస్ఎల్వీ-మార్క్ ప్రయోగాల ద్వారా విభిన్న ఉపగ్రహాలను పంపేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. నాసాతో కుదుర్చుకున్న నిషా ఉపగ్రహ ప్రయోగం వాయిదా పడిందన్నారు. ఇస్రో ప్రయోగించే ఉపగ్రహాలు దేశ అవసరాలకే కాకుండా సామాన్యులందరికీ ఉపయోగపడేలా చూస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా రాడార్ ఇమేజ్, టెక్నాలజీ డెవలప్‌మెంట్ శాటిలైట్స్‌ను ప్రయోగిస్తామన్నారు.



అసోంలో బాంబుల కలకలం

» 24 చోట్ల బాంబులు అమర్చినట్టు ఉల్ఫా (ఐ) ప్రకటన

» సాంకేతిక వైఫల్యంతో పేలని వైనం

గువాహతి, ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అసోంవ్యాప్తంగా బాంబు పేలుళ్లకు నిషేధిత ఉగ్రవాద సంస్థ యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోమ్ (ఇండిపెండెంట్) చేసిన ప్రయత్నం ఫలించలేదు. 24 చోట్ల బాంబులను అమర్చినట్టు ఉల్ఫా (ఐ) గురువారం చేసిన ప్రకటన కలకలం రేపింది. అయితే సాంకేతిక వైఫల్యం కారణంగా ఈ బాంబులు పేలలేదని మీడియా సంస్థలకు ఈమెయిల్ ద్వారా సమాచారమిచ్చింది. గురువారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఈ బాంబుపేలుళ్లు జరగాల్సి ఉందని పేర్కొంది. అయితే ఈ ప్రణాళిక అమల్లో విఫలమైనట్టు తెలిపింది. ఈ నేపథ్యంలో పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేయడంలో ప్రజలు సహకరించాలని కోరింది. 19 బాంబులను అమర్చిన ప్రదేశాల చిత్రాలను వెల్లడించిన ఉల్ఫా..మిగతా ఐదు ప్రదేశాల వివరాలను మాత్రం తెలియజేయలేదు. బాంబులు అమర్చినట్టు ప్రకటించడంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఎనిమిది ప్రదేశాల్లో బాంబులాంటి పదార్థాలను వెలికితీసినట్టు అధికారులు తెలిపారు.

రాహుల్‌కు ఐదో వరుసలో సీటు

» వేడుకల్లో ప్రతిపక్ష నేతను గౌరవించరా?

» ప్రజాస్వామ్య సంప్రదాయాలపై మోదీకి గౌరవం లేదు: కాంగ్రెస్ ధ్వజం

న్యూఢిల్లీ, ఆగస్టు 15: స్వాతంత్ర దినోత్సవాల్లో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఐదో వరుసలో సీటు కేటాయించడంపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్య సంప్రదాయాలపై ప్రధాని మోదీకి గౌరవం లేదని దీన్నిబట్టి అర్థమవుతుందని కాంగ్రెస్ మండిపడింది. కుచించుకుపోయిన మనస్తత్వం కలిగిన వ్యక్తుల నుంచి పెద్ద పెద్ద విషయాలను ఆశించడం వృథా అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా వ్యాఖ్యానించారు. రాహుల్‌కి ఐదో వరుసలో సీటు కేటాయించి తన అసహనాన్ని ప్రధాని మోదీ ప్రదర్శించుకున్నారని అయితే, ఈ పరిణామం ప్రజా సమస్యలపై రాహుల్ చేసే పోరాటంలో ఏ మార్పునూ తీసుకురాలేదని ఆమె పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతకు క్యాబినెట్ మంత్రి హోదా ఉంటుందని ఆ స్థానంలో ఉన్నవారికి మొదటి వరుసలో సీటు కేటాయించాలని, రాహుల్ ఒక్కరికే కాదని, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు కూడా ఐదో వరుసలోనే సీటు కేటాయించారని సుప్రియా మండిపడ్డారు.



ఇక, పారిస్ ఒలింపిక్స్ పతాక విజేతలను గౌరవించుకోవడం కోసమే వారికి మొదటి వరుసలో సీట్లు కేటాయించామంటూ రక్షణశాఖ విడుదల చేసిన ప్రకటన అర్థం లేనిదని ఆమె ధ్వజమెత్తారు. అలాంటప్పుడు కేంద్ర మంత్రులు అమిత్ షా, నడ్డా, జైశంకర్, నిర్మలా సీతారామన్‌లకు మొదటి వరుసలో సీట్లు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. రాహుల్‌కు ఐదో వరుసలో సీటు ఇచ్చినా, 55వ వరుసలో సీటు కేటాయించినా ప్రజా నేతగా ఆయనకున్న గుర్తింపునకు ఏ ఇబ్బంది లేదని సుప్రియా స్పష్టం చేశారు.

పదేళ్ల తర్వాత వేడుకలకు విపక్ష నేత!

దశాబ్ద కాలం తర్వాత ఎర్రకోట వద్ద జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకలకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హాజరయ్యారు. పదేళ్లుగా లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత హోదా ఎవరికీ ఇవ్వని విషయం తెలిసిందే. ఇక, రాహుల్ గాంధీకి ఐదో వరుసలో సీటు కేటాయించారన్న విమర్శల నేపథ్యంలో రెండో వరుసలో రాహుల్ కూర్చున్న వీడియోలు బయటకు వచ్చాయి. హాకీ టీమ్‌లోని గుర్జాంత్ సింగ్ పక్కన రాహుల్ కూర్చుని ఉన్న వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

రాష్ట్రపతి ప్రసంగంలో నెహ్రూ పేరు లేదేం?

స్వేచ్ఛ అనేది మన అతి పెద్ద రక్షణ కవచమని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. స్వేచ్ఛ అనేది ఒక పదం మాత్రమే కాదని, రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలతో కూడిన అతిపెద్ద రక్షణ కవచమని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇచ్చిన సందేశంలో రాహుల్ పేర్కొన్నారు. ఎర్రకోట వద్ద జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న రాహుల్ ఆ తర్వాత ఏఐసీసీ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఇక, రాష్ట్రపతి ప్రసంగంలో మాజీ ప్రధాని నెహ్రూ పేరు కూడా ప్రస్తావించకపోవడంపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. చరిత్ర నుంచి భారత దేశ మొదటి ప్రధాని పేరును చెరిపేయడమే లక్ష్యంగా సాగుతున్న కార్యక్రమంలో భాగంగానే ఆయన పేరును కూడా ప్రస్తావించడం లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు.

కోల్‌కతా ఆర్జీ కర్ ఆస్పత్రిపై దాడి!

నిరసనకారుల ముసుగులో చొచ్చుకెళ్లిన 40మంది దుండగులు.. ఆస్పత్రి ఆస్తుల ధ్వంసం

» ఎమర్జెన్సీ విభాగం, నర్సింగ్ సెక్షన్ మెడిసిన్ స్టోర్‌లో విధ్వంసకాండ

» పోలీసు వాహనం.. పలు బైక్‌ల ధ్వంసం

» బాష్పవాయువు, లాఠీచార్జితో పరిస్థితిని అదుపులోకి తెచ్చిన పోలీసులు

కోల్‌కతా, ఆగస్టు 15: జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం జరిగిన కోల్‌కతా ఆర్జీ కర్ వైద్యకళాశాల ఆస్పత్రిలో బుధవారం అర్ధరాత్రి భయానక వాతావరణం నెలకొంది. గుర్తుతెలియని దుండగులు ఆస్పత్రిలో పెను విధ్వంసం సృష్టించారు. ఆందోళనకారుల ముసుగులో ఆ పరిసరాల్లోకి వచ్చిన గూండాలు ఆస్పత్రిలోకి చొచ్చుకెళ్లారు. దవాఖానా ఆస్తులు, విలువైన వైద్యపరికరాలను ధ్వంసం చేశారు. హత్యాచార ఘటనపై నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ డాక్టర్లపైనా దాడికి పాల్పడ్డారు. బుధవారం రాత్రి 11:55 నిమిషాలకు ఈ ఘటన జరిగింది. జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటన నేపథ్యంలో మహిళల భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ 'స్వాతంత్ర్యం సిద్ధించిన ఆ అర్ధరాత్రిని తిరిగి పొందుదాం' (రీక్లెయిమ్ ది నైట్) అనే పేరుతో పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా ముఖ్య ప్రాంతాల్లో బుధవారం రాత్రి ప్రదర్శనలు జరిగాయి. ఈ క్రమంలో కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆస్పత్రి వద్దకు నిరసనకారుల ముసుగులో 40మంది దాకా గుర్తుతెలియని దుండగులు చేరుకున్నారు. వచ్చీరావడంతోనే పోలీసులపై రాళ్లు రువ్వుతూ ఆస్పత్రిలోకి దూసుకెళ్లి బీభత్సం సృష్టించారు. ఎమర్జెన్సీ విభాగం, నర్సింగ్ సెక్షన్, మెడిసిన్ స్టోర్‌లో విధ్వంసం సృష్టించారు. సీసీ కెమెరాలనూ పగులగొట్టారు. జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం ఘటనకు నిరసనగా ఆగస్టు 9 నుంచి అక్కడి వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్న వేదిక వద్దకొచ్చి భయానక వాతావరణాన్ని సృష్టించారు. గూండాల దాడిలో కొందరు వైద్యసిబ్బంది, పోలీసులకు గాయాలయ్యాయి. ఆస్పత్రి ప్రాంగణంలోని పోలీసు వాహనం, కొన్ని ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు బాష్పవాయువును ప్రయోగించి.. లాఠీ చార్జి చేసి ఆ మూకను చెదరగొట్టడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. గూండాల దాడిలో ఆస్పత్రి ఆస్తులకు తీవ్ర నష్టం జరిగిందని పోలీసులు చెప్పారు. ప్రణయ్ దాస్ అనే ఆస్పత్రి సెక్యూరిటీ గార్డు మాత్రం దుండగులు 500 నుంచి 1000 మంది దాకా ఉన్నారని చెప్పడం విశేషం. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటిదాకా తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. కాగా జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం ఘటన తాలూకు ఆధారాలను చెరిపివేసేందుకే ఓ వర్గం ఈ దాడికి పాల్పడినట్లుగా ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో కోల్‌కతా పోలీసులు కీలక ప్రకటన చేశారు. 'వైద్య కళాశాలలోని సెమినార్ రూంలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం జరిగింది. ఘటనాస్థలి చెక్కుచెదరకుండా ఉంది. అక్కడికెవ్వరూ రాలేదు' అని స్పష్టం చేశారు. తప్పుడు వార్తలను ప్రచారం చేయొద్దని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరోవైపు.. ఆస్పత్రిపై దుండగుల దాడిపై అక్కడి నర్సులు గురువారం ఉదయం తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఆర్జీ కార్ ఆస్పత్రిపై దుండగల విధ్వంసాన్ని బెంగాల్ గవర్నర్ సీజీ ఆనంద బోస్ తీవ్రంగా ఖండించారు. ఆస్పత్రిపై దాడి ఘటన సభ్య సమాజానికి సిగ్గుచేటు అని పేర్కొన్నారు. గురువారం ఆయన ఆర్జీ కర్ ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిపై గూండాల దాడిని భారత వైద్య మండలి (ఐఎంఏ) తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనపై ఆ రాష్ట్ర విభాగాలతో అత్యవసర సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. ఇక.. ఆర్జీ కర్ ఆస్పత్రిపై దుండగుల దాడికి బాధ్యత వహిస్తూ బెంగాల్ సీఎం మమత రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. అయితే.. ఆస్పత్రిపై దుండగుల దాడి వెనుక రాజకీయ పార్టీలు ఉన్నాయని.. రెచ్చగొట్టే చర్యలకు పాల్పడటం ద్వారా ఇబ్బందులు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు.



ఆస్పత్రిలో దుండగుల చేతిలో ధ్వంసమైన వైద్య పరికరాలు

ఉత్తరాఖండ్‌లో నర్సుపై హత్యాచారం

» 9 రోజుల తర్వాత దొరికిన మృతదేహం

» రాజస్థాన్‌లో నిందితుడి అరెస్టు

» ఆమె చున్నీతోనే ప్రాణాలు తీశాడు

డెహ్రాడూన్, ఆగస్టు 15: ఓ ప్రయివేటు ఆస్పత్రిలో పనిచేసే నర్సుపై అత్యాచారం చేసి, అనంతరం హత్య చేసిన సంఘటన ఉత్తరాఖండ్‌లోని రుద్రపూర్‌లో చోటు చేసుకుంది. సంఘటన జరిగిన తొమ్మిది రోజుల అనంతరం ఆమె మృత దేహం లభించింది. దర్యాప్తు జరిపిన పోలీసులు బుధవారం ఇందుకు బాధ్యుడైన నిందితుడ్ని రాజస్థాన్‌లో అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆ నర్సు ఇంద్రాచౌక్‌లోని ఆస్పత్రిలో పనిచేస్తుండగా, సరిహద్దులో ఉన్న ఉత్తరప్రదేశ్‌లోని బిలాస్‌పూర్‌లో 11 ఏళ్ల కుమార్తెతో కలిసి ఉంటోంది. జులై 30న విధులు ముగించుకొని ఈ-రిక్షాలో బిలాస్‌పూర్ బయలుదేరింది. దినసరి కూలీ అయిన ధర్మేంద్ర ఆమెను అనుసరించాడు. ఆమె తాను నివాసం ఉండే అపార్టుమెంటుకు చేరుకుంటుండగా దాడి చేశాడు. సమీపంలోని పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఆమె చున్నీతోనే పీక నులిమి హత్య చేశాడు. అనంతరం అక్కడి ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలోని దిబ్‌డిబా గ్రామంలోని ఖాళీ స్థలంలో పడేసి వెళ్లిపోయాడు. ఆమె పర్సులోని రూ.3000ను కూడా దొంగిలించాడు. ఆ సమయంలో అతడు మద్యం మత్తులో ఉన్నాడు. ఇంటికి రాకపోవడంతో ఆమె సోదరి మరుసటి రోజున పోలీసులకు ఫిర్యాదు చేశారు. తొమ్మిది రోజుల అనంతరం ఈ నెల 8న పోలీసులు మృతదేహాన్ని గుర్తించారు. బాధితురాలి ఫోన్ ఆధారంగా నిందితుడ్ని గుర్తించారు. అతడు ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ జిల్లా వాసి అని తేలింది. పోలీసులు దర్యాప్తు జరిపి నిందితుడ్ని రాజస్థాన్‌లో పట్టుకొని అరెస్టు చేశారు.

ఫ్యూచర్ స్టేట్‌గా తెలంగాణ

సకల జనులు సుఖశాంతులతో శోభిల్లే రాష్ట్రంగా మార్చుతాం.. తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవేదికపై సగర్వంగా చాటాలి

- రాష్ట్రానికి రూ.31,532 కోట్ల పెట్టుబడులు, 30 వేల మందికి ఉద్యోగాలు
- దశాబ్దకాలం తర్వాత తెలంగాణకు స్వేచ్ఛ
- ఏడో గ్యారెంటీగా రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తున్నాం
- రైతు కూలీలకు త్వరలో 12 వేల సాయం
- గోల్కొండలో స్వాతంత్ర్య వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి





గోల్కొండ కోటలో స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులతో కరచాలనం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. తన నివాసంలో జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న సీఎం

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో తెలంగాణను 'ఫ్యూచర్ స్టేట్'గా మార్చనున్నామని, అందుకు కార్యాచరణ ప్రారంభమైందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా విదేశీ పెట్టుబడుల సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని తెలిపారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణలో దశాబ్ద కాలం తర్వాత నిజమైన ప్రజా పాలన మొదలైందన్నారు. బ్రిటీషువారి దాస్య శృంఖలాల నుంచి దేశం ఏవిధంగా విముక్తి చెందిందో.. అదే స్ఫూర్తి, అదే పోరాట పటిమతో అంతిమ పోరాటం చేసి 2023 డిసెంబరు 3న తెలంగాణ స్వేచ్ఛ పొందిందని, రాష్ట్రంలో తొలిసారి ప్రజాస్వామ్యబద్ధ పాలన సాగుతోందన్నారు. తమ నిర్ణయాల్లో తప్పు జరిగితే సరిదిద్దుకుంటున్నామని, ఎవరైనా తప్పుడు ఆరోపణలు చేసినా సంయమనాన్ని పాటిస్తున్నాం అని చెప్పారు. ఎన్నికల్లో చెప్పినట్లుగా ఏడో గ్యారెంటీగా ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తున్నాం అని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో గురువారం గోల్కొండ కోటలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి గోల్కొండ కోటపై మువ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరించారు. జెండా ఎగురవేశాక జాతీయ గీతాలాపన అనంతరం కొత్తగా స్వరపర్చిన జయ జయహే తెలంగాణ గీతాలపన ఆహూతులను అలరించింది. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి రేవంత్ ప్రసంగించారు. "తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవేదికపై సగర్వంగా చాటాలనే లక్ష్యంతో నేను, మంత్రి శ్రీధర్‌బాబు అమెరికాలో పర్యటించి, అంతర్జాతీయ దిగ్గజ సంస్థల అధినేతలు, ప్రతినిధులతో భేటీ అయ్యాం. తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను వివరించాం. ఫ్యూచర్ స్టేట్‌గా తెలంగాణను పరిచయం చేశాం. బేగరికంచె వద్ద శంకుస్థాపన చేసుకున్న ఫోర్త్ సిటీ, మూసీ రివర్ ఫ్రంట్, రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం, అంతర్జాతీయ మౌలిక సదుపాయాలు, మెట్రో విస్తరణ తదితర ఆలోచనలను వారితో పంచుకున్నాం. జనవరిలో దావోస్ పర్యటనలో భాగంగా రూ.40 వేల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు కుదుర్చుకున్నాం. ఇది పెట్టుబడుల ఆకర్షణలో ఒక రికార్డు" అని వివరించారు. రాష్ట్రానికి పెట్టుబడుల సాధన కోసం ఇటీవల చేపట్టిన అమెరికా, దక్షిణ కొరియా పర్యటన విజయవంతమైందని, 19 అగ్రశ్రేణి కంపెనీలతో చర్చలు జరిపామని, రూ.31,532 కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు జరిగాయని, తద్వారా 30 వేల మందికి పైగా నేరుగా ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందని వివరించారు. సకల జనులు సుఖశాంతులతో శోభిల్లే తెలంగాణగా మార్చేందుకు ప్రజా ప్రభుత్వం పాలన అందిస్తుందని హామీ ఇస్తున్నానని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ... సంక్షేమానికి పెద్దపీట వేస్తూ విశ్వ వేదికపై తెలంగాణను సగర్వంగా నిలిపే పాలనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని హామీ ఇస్తున్నామని వ్యాఖ్యానించారు.

యువతకు ఉద్యోగావకాశాలు

అధికారంలోకి వచ్చిన 3నెలల్లోనే 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామని సీఎం తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి, ఇప్పటికే గ్రూప్-1 ప్రాథమిక పరీక్షను విజయవంతంగా నిర్వహించామని రేవంత్ అన్నారు. 11,062 టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీని విజయవంతంగా నిర్వహించామన్నారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 నియామకాలకు ఉన్న కోర్టు చిక్కుముళ్లను పరిష్కరించామని, ఇటీవల శాసనసభలో జాబ్ క్యాలెండర్‌ను ప్రవేశ పెట్టామని తెలిపారు. సింగరేణి సహకారంతో రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయ హస్తం కింద సివిల్స్‌లో ప్రాథమిక పరీక్షను విజయవంతంగా పూర్తి చేసిన అర్హులైన యువతకు రూ.లక్ష చొప్పున సాయం చేయాలని నిర్ణయించామని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారాన్ని చేపట్టేనాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా విధ్వంసమై ఉందని చెప్పారు. గత పదేళ్లలో రాష్ట్ర అప్పు 10 రెట్లు పెరిగిందని, రాష్ట్ర ఆవిర్భావ సమయంలో రూ.75,577 కోట్లుగా ఉన్న అప్పు.. నిరుడు డిసెంబరు నాటికి రూ.7 లక్షల కోట్లకు చేరిందన్నారు.

రుణమాఫీపై విపక్షాల రంధ్రాన్వేషణ

ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసిందని, రాష్ట్రంలోని రైతాంగం ప్రస్తుతం అతి పెద్ద పండుగ జరుపుకుంటోందని రేవంత్ అన్నారు. రుణమాఫీకి ముందు మాఫీ అసాధ్యమంటూ వక్రభాష్యాలు చెప్పిన విపక్షాలు, ఇప్పుడేమో రంధ్రాన్వేషణ మొదలుపెట్టారని ఎద్దేవా చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజే.. తెలంగాణ రైతుకు ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చిందని ఘనంగా చెప్పుకునే రోజు ఇది అని, ఫలితంగా తన జన్మ ధన్యమైందని చెప్పారు. రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.15 వేలను అందించాలన్నది తమ ప్రభుత్వ సంకల్పమని అన్నారు. సన్న రకం వరి ధాన్యం సాగును ప్రోత్సహించేందుకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్‌ను చెల్లించాలని నిర్ణయించామని, దీనికి 33 రకాల వరి, ధాన్యాలను గుర్తించామని తెలిపారు. రైతుల పాలిట శాపంగా మారిన ధరణి సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ధరణి అమలులో అవకతవకలు, లోపభూయిష్ట విధానాల కారణంగా రైతులకు ఎంతో కష్టం కలిగిందన్నారు. భూ సమస్యల పరిష్కారానికి సరికొత్త సమగ్ర చట్టం తీసుకురావాలని భావిస్తున్నాం అని చెప్పారు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం ప్రతి నియోజకవర్గంలో ఒకే ఆవరణలో 25 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లను నిర్మించబోతున్నామని తెలిపారు. ఇటీవలే బేగరికంచె వద్ద యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేసుకున్నామని, తెలంగాణ విద్యా రంగంలో ఇదొక విప్లవాత్మక మలుపు కాబోతోందని అన్నారు. హైదరాబాద్ నగరాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించడానికి 'హైడ్రా' అనే కొత్త సంస్థను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఇరుగు పొరుగు రాష్ట్రాలతో, కేంద్రంతో స్నేహపూర్వకంగా, సఖ్యతతో వ్యవహరిస్తున్నామని.. రాష్ట్ర విభజనానంతరం అపరిష్కృతంగా మిగిలిపోయిన సమస్యలను సత్వరమే పరిష్కరించుకోవడానికి ఇటీవల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రితో జరిపిన చర్చలు త్వరలో మంచి ఫలితాలు ఇస్తాయని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. కాగా, అంతకు ముందు సికింద్రాబాద్‌లోని సైనిక వీరుల స్మారక స్థూపం వద్ద సీఎం రేవంత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

48 గంటల్లోనే రెండు గ్యారెంటీల అమలుతో చరిత్ర సృష్టించాం

బాధ్యతలు స్వీకరించిన 48 గంటల్లోనే ఆరు గ్యారెంటీల్లోని రెండు గ్యారెంటీలను అమలు చేసి, చరిత్ర సృష్టించామని రేవంత్ అన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని, దీని ద్వారా మహిళలకు రూ.2,619 కోట్లను ఆదా చేశామన్నారు. ఆరోగ్యశ్రీ పథకానికి పూర్వవైభవాన్ని తీసుకురావడంలో భాగంగా వైద్య చికిత్సల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని, కొత్తగా 163 చికిత్సలను ఈ పథకంలో చేర్చామని వివరించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ ప్రత్యేక గుర్తింపు సంఖ్య గల డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డులను జారీ చేసే విధానాన్ని త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమల్లోకి తెచ్చామని, పదేళ్లలో రూ.1200 వరకు ఉన్న సిలిండర్ ధర... ఇప్పుడు రూ.500 తగ్గిందని అన్నారు. ప్రస్తుతం 43 లక్షల మందికి లబ్ధి చేకూర్చుతోందని, సబ్సిడీ కింద వినియోగించిన 85,17,407 సిలిండర్లకుగాను రూ.242 కోట్లను చెల్లించామని అన్నారు. గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు విద్యుత్తును వాడే ప్రతిఇంటికి ఉచిత వెలుగులను పంచుతున్నామని, ప్రస్తుతం 47,13,112 మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో నూతన గృహనిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించామని, ప్రతి నియోజకవర్గంలో కనీసం 3,500 ఇళ్ల చొప్పున మొత్తం... 4,50,000 ఇళ్లను ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్మించాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు భారీ మొత్తంలో రూ.72,659 కోట్లను కేటాయించామని తెలిపారు.

రైతులు సంతోషంగా ఉండాలని లేదా?

- పదేళ్లలో చేయలేని రుణమాఫీని నెలల్లో చేస్తే ఎందుకు ఏడుపు?
- ఉప ఎన్నికల భ్రమల్లో కేసీఆర్, కేటీఆర్
- ఫిరాయింపులపై కేసీఆర్ నెలకొల్పిన సంప్రదాయాన్నే రేవంత్ కొనసాగిస్తున్నారు
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



హైదరాబాద్,ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన చేస్తుంటే కేసీఆర్, కేటీఆర్ ఉప ఎన్నికలను కోరుకుంటున్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. అధికారంలో ఉంటే ఫాంహౌస్, లేకపోతే ఉప ఎన్నికలు.. ఇదే బీఆర్ఎస్ సిద్ధాంతం అని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షంలో ఉంటే ప్రజా సమస్యలపై పోరాటం.. అధికారంలో ఉంటే ప్రజా సమస్యల పరిష్కారం.. ఇదీ కాంగ్రెస్ సిద్ధాంతం అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో పదేళ్లలో చేయలేని రుణమాఫీని రేవంత్ ప్రభుత్వం 8నెలల్లో.. ఒకే కిస్తీలో అదీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తే ఎందుకు ఏడుపు? అని ఆ పార్టీ నేతలపై మండిపడ్డారు. గురువారం గాంధీ భవన్‌లో జగ్గారెడ్డి విలేకరులతో మాట్లాడారు. రైతులు సంతోషంగా ఉండాలనే ఆలోచన బీఆర్ఎస్ నేతలకు లేదన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై విసుగుచెందే ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని చెప్పారు. సోనియా, రాహుల్ నిర్ణయించుకొని సీఎంగా రేవంత్‌ను చేశారని, ఆ అగ్రనేతల మార్గదర్శకత్వంలోనే ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతోందని పేర్కొన్నారు. కేటీఆర్ పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని.. ఉప ఎన్నికలు వస్తాయనే మత్తులో ఉన్నారని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో శాఖలవారీగా జరిగిన నష్టాన్ని రేవంత్ సర్కారు సవరించుకుంటూ వస్తోందన్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినా కూడా బీఆర్ఎస్ నేతల్లో అహంకారం తగ్గలేదన్నారు. 'లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నేతలకు ప్రజలు ఒక్కసీటూ ఇవ్వలేదు. సొంత జిల్లా అని చెప్పుకునే ఉమ్మడి మెదక్‌లోనూ ఓటమిపాలయ్యారు. ట్రబుల్ షూటర్ హరీశ్ రావు ఎక్కడున్నావ్?' అని ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందే బీఆర్ఎస్ అని.. కేసీఆర్ తెచ్చిన సంప్రదాయాన్నే రేవంత్ కొనసాగిస్తున్నారని చెప్పారు. ఎన్నికల కోసం నాలుగున్నరేళ్ల సమయంఉందని.. తొందరపడొద్దని.. అబద్ధాలు చెప్పడం మానేయాలని.. ప్రభుత్వానికి మంచి సలహాలు, సూచనలు ఇవ్వాలని బీఆర్ఎస్ నేతలకు హితవుపలికారు. రాహుల్ గాంధీ తెలంగాణకొచ్చి ప్రచారం చేస్తేనే ఇక్కడి నేతలను ప్రజలు గెలిపించారన్నారు. సీఎం, మంత్రులు మంచి పరిపాలన చేస్తున్నారనిన్నారు. తమ అధిష్ఠానం ఢిల్లీలో ఉంటుందని.. పిలుపొస్తే ఢిల్లీకి వెళ్లి కలుస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ కుటుంబం తెలంగాణ కోసం ఢిల్లీకి వెళ్లి సోనియా గాంధీని కలిశారని గుర్తుచేస్తూ.. "మీరు చేస్తే ఒప్పు.. మేము చేస్తే తప్పా"? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం.. ఇచ్చిన మాట ప్రకారం గురువారం (ఆగస్టు 15) నాటికి రూ.2 లక్షల రుణమాఫీ ప్రక్రియ పూర్తిచేసిందన్నారు.



బీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బస్సులో అల్లం, ఎల్లిపాయ వలిస్తే తప్పని మేమెక్కడ అన్నాం సీతక్కా?

- బస్సులో కుట్లు, అల్లికలు.. అవసరమైతే బ్రేక్ డ్యాన్స్, రికార్డింగ్ డ్యాన్స్ చేయండి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలు
- సుమోటోగా విచారణకు స్వీకరించినట్టు మహిళా కమిషన్ చైర్మన్ వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): "ఉచిత బస్సు ప్రయాణంలో మహిళలు అల్లం, ఎల్లిపాయ పొట్టు తీయడం తప్పా? దాన్ని కూడా వీడియో తీసి తప్పుగా చూపిస్తున్నారు" అంటూ మంత్రి సీతక్క బుధవారం చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. గురువారం ఉదయం పార్టీ రాష్ట్రకార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'బస్సుల్లో అల్లం ఎల్లిపాయ వలిస్తే తప్పా? కుట్లు అల్లికలు చేస్తే తప్పా' అని మా సీతక్క అంటున్నరు.. తప్పని మేమెక్కడ అన్నామక్కా... 'తన్నుకుంటున్నారు.. మంచి గలేదు' అని మామూలుగా అన్నం. మనిషికో బస్సు పెట్టు.. మేమెందుకు అంటం. మనిషికో బస్సు పెడితే కుటుంబం అంతాపోయి మంచిగ కుట్లు అల్లికలు, అవసరమైతే.. బ్రేక్‌డ్యాన్సులు, రికార్డింగ్ డ్యాన్సులు ఏం చేస్తరో చెయ్యండి.. మేమెందుకు వద్దంటం. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు బస్సుల్లో ఈ రకంగా ఎప్పుడైనా ఆడబిడ్డలు కొట్టుకునే పరిస్థితి ఉండేదా? సీట్ల కోసం కొట్టుకొనుడు, సిగలు పట్టుకొనుడు, గుద్దుకొనుడు.. ఎన్నెన్ని చూస్తున్నం' అని వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలపై మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అభ్యంతరం వ్యక్తం చేశారు. వ్యాఖ్యలు అనుచితమని.. వాటిని కమిషన్ సుమోటోగా విచారణకు స్వీకరించిందని 'ఎక్స్' ద్వారా ప్రకటించారు. కేటీఆర్ వ్యాఖ్యలు విస్తృతంగా ప్రచారమయ్యాయని, అవి మహిళలకు అవమానకరంగా, వారిని కించపరిచేవిగా ఉన్నాయన్నారు. దీన్ని గమనించిన కమిషన్ అందుబాటులో ఉన్న ఆధారాల ప్రకారం స్వతంత్ర విచారణను ప్రారంభించినట్టు తెలిపారు. మరోవైపు.. కేటీఆర్ వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఆయన దిష్టిబొమ్మలు దహనం చేసి, నిరసన తెలపాలని పార్టీ శ్రేణులకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

దేశ విచ్ఛిన్నానికి కుట్రలు

- కాంగ్రెస్‌తోపాటు విదేశీ శక్తుల యత్నం
- బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మణ్

హైదరాబాద్, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని బీజేపీ ఎంపీ, పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ ఆరోపించారు. కులాలు, మతాలు, ప్రాంతాల పేరుతో దేశాన్ని విడగొట్టేందుకు విదేశీ శక్తులతో పాటు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. కొన్ని అరబ్బు దేశాలు, పశ్చిమ దేశాలు భారత్‌ను బలహీనపరచాలని చూస్తున్నాయన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరుగుతుంటే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఎందుకు ఖండించడం లేదని నిలదీశారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భంగా గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో లక్ష్మణ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆసియా ఖండంలో భారత్‌ను బలహీనపరిచేందుకు పొరుగు దేశాల్లో భారత వ్యతిరేక భావనను పెంపొందించి కొన్ని దేశాలు పబ్బం గడుపుకోవాలని చూస్తున్నాయి. పాకిస్తాన్, చైనా ప్రోద్బలంతో ఇస్లామిక్ ఉగ్రవాదులు బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని కూలదోశారు.. అక్కడి హిందువులపై మారణకాండ చేస్తున్నరు.. దేవాలయాలను ధ్వంసం చేస్తున్నరు.. అని లక్ష్మణ్ ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో సీఎం మమతా బెనర్జీ రోహింగ్యాలను పెంచి పోషిస్తున్నారని లక్ష్మణ్ ఆరోపించారు.

ఆడపడుచులకు కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి

- కేటీఆర్‌పై కేసు నమోదు చెయ్యాలి
- మంత్రులు సీతక్క పొన్నం

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్టీసీ బస్సుల్లో బ్రేక్ డ్యాన్సులు, రికార్డింగ్ డ్యాన్సులు చేసుకోవచ్చని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు జుగుప్సాకరంగా ఉన్నాయని మంత్రు లు సీతక్క, పొన్నం ప్రభాకర్ విమర్శించారు. కేటీఆర్ వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కేటీఆర్ తక్షణమే మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. ఆడవాళ్లు బస్సుల్లో కుట్లు, అల్లికలు చేసుకుంటే తప్పేంటి?సమయం వృథా చేయకుండా పనిచేసుకోవడం తప్పా? అని సీత క్క ప్రశ్నించారు. కేటీఆర్‌పై కేంద్ర,రాష్ట్ర మహిళా కమిషన్లు కేసులు నమోదు చేయాలని పొన్నం కోరారు. కేటీఆర్ దురహంకారంతో మాట్లాడుతున్నారని మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి విమర్శించారు.



హైకోర్టులో జరిగిన వేడుకల్లో జస్టిస్ అలోక్ అరాధే

త్వరలోనే నూతన హైకోర్టు నిర్మాణం ప్రారంభం

- స్వాతంత్ర్య దినోత్సవంలో హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే నూతన హైకోర్టు భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే తెలిపారు. గురువారం హైకోర్టులో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో ఆయన జెండా ఆవిష్కరించి ప్రసంగించారు. న్యాయవాదులపై దాడుల నేపథ్యంలో అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లు తీసుకురావాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు చెప్పారు. కొత్తగా అమల్లోకి వచ్చిన మూడు క్రిమినల్ చట్టాలపై మార్గదర్శకాలు రూపొందించడంతోపాటు రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ ఆధ్వర్యంలో న్యాయాధికారులకు శిక్షణ కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు జస్టిస్ అలోక్ అరాధే వెల్లడించారు.

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన స్పీకర్

గురువారం శాసనసభ ప్రాంగణంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు. ముందుగా అంబేడ్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలకు ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు శాసనసభ కార్యదర్శి వి.నరసింహాచార్యులు, చీఫ్ మార్షల్ కర్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీభవన్‌లో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మహేష్‌కుమార్ గౌడ్



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న మహేష్ కుమార్‌గౌడ్

గాంధీభవన్‌లో 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యోద్యమంతో సబంధంలేని వారు ఈ రోజు దేశాన్ని పాలిస్తున్నారన్నారు. కార్పొరేట్ శక్తులు దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. జోడో యాత్ర, న్యాయ యాత్రతో రాహుల్ గాంధీ దేశ ప్రజల గుండెల్లో నిలిచారని, అధికారంలోకి రాకపోయినా ప్రతిక్ష నాయకుడిగా ఆయన దేశ ప్రజలకోసం పోరాడుతున్నారని మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు.

2047కు అగ్రగామి దేశంగా భారత్: కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిద్దటమే తమ లక్ష్యమని కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి తెలిపారు. గురువారం న్యూఢిల్లీలోని తన నివాసంలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వికసిత భారత్ లక్ష్యంగా రాబోయే ఐదేళ్ల అన్ని రంగాల్లో సాధికారత సాధించే దిశగా అంకితభావం, చిత్తశుద్ధితో పని చేస్తామని అన్నారు. మోదీ నేతృత్వంలో రాబోయే ఐదేళ్లలో అన్నిరంగాల్లో పురోగతి సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

నేడు రాష్ట్రానికి ఉప రాష్ట్రపతి

న్యూఢిల్లీ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రెండురోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని కన్హ శాంతి వనాన్ని ఆయన సందర్శిస్తారు. శనివారం ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో అక్షర విద్యాలయ క్యాంపస్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, స్వర్ణ భారత్ ట్రస్ట్, ముప్పవరపు ఫౌండేషన్‌లను సందర్శిస్తారు. అలాగే వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ 23వ వార్షికోత్సవ వేడుకల్లో ధన్‌ఖడ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని గురువారం ఉప రాష్ట్రపతి సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

4 నెలల్లో రూ.6,894 కోట్ల ఆదాయం

- 523 కి.మీ. 'కవచ్' విస్తరణకు టెండర్లు పిలిచాం
- దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్
- స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

హైదరాబాద్ సిటీ/సికింద్రాబాద్, ఆగష్టు 15 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దక్షిణమధ్య రైల్వే అత్యుత్తమ విజయాలను నమోదు చేస్తోందని, గత నాలుగు (ఏప్రిల్-జూలై) నెలల్లో రూ.6,984 కోట్ల ఆదాయాన్ని సాధించిందని జీఎం అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 3 శాతం మెరుగైందన్నారు. ఏప్రిల్ నుంచి జూలై వరకు జోన్ పరిధిలో 46.25 మిలియన్ టన్నుల సరుకు రవాణా నమోదు చేశామని, సరుకు రవాణా విభాగంలో రూ.4,611 కోట్ల ఆదాయాన్ని ఆర్జించామని చెప్పారు. 8.8 కోట్ల మంది ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చి రూ.1,956 కోట్ల ఆదాయాన్ని ఆర్జించామన్నారు. 'కవచ్' విస్తరణలో భాగంగా, వాడి- గుంతకల్- రేణిగుంట మధ్య 523 కి.మీ. మేర పనులకు టెండర్లు పిలిచామని జైన్ తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద, గుర్తించిన 119 స్టేషన్లలో రూ.6,243 కోట్ల అంచనా వ్యయంతో పునరాభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు.

విద్యతోనే సామాజిక అంతరాలకు స్వస్తి

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 15 : విద్యతోనే సామాజిక అంతరాలకు స్వస్తి పలకొచ్చని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. మహబూబాబాద్‌లో ఇంటింటా ఇన్నోవేటర్ అవార్డుకు ఎంపికైన కంబాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినీ ఇందుకు ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ మాట్లాడుతూ...పాఠశాల స్థాయి నిర్వహించిన ఇంటింటా ఇన్నోవేటర్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని ఇందు ఎక్స్‌పాండబుల్ సీలింగ్ ఫ్యాన్ రాడ్ అనే ఇన్నోవేషన్‌కి అవార్డుకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. విద్యారంగానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థిని ఇందు అవార్డుకు ఎంపిక కావడానికి ప్రోత్సహించిన హెచ్‌ఎం రమేష్‌బాబు, గైడ్ టీచర్ ఝాన్సీ, ఉపాధ్యాయులను అభినందించారు.

రైతులు విధిగా కెపాసిటర్లను అమర్చుకోవాలి

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 15: మండలంలోని రైతులు విధిగా విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలని స్థానిక ఏడీఈ ఆకిటి స్వామిరెడ్డి అన్నారు. గురువారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో రైతుపొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు కెపాసిటర్ అమర్చుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు. విద్యుత్‌లైన్లతోపాటు విద్యుత్ మోటారు మరమ్మతుకు రాదని అన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎర్రకోట సందేశం

ప్రధాని నరేంద్రమోదీ ఎంతో చక్కగా ప్రసంగించగలరు. ఆయన ఎర్రకోట ప్రసంగాల్లో ఆదిలో ఉన్న పస క్రమంగా తగ్గిందని గిట్టనివారు అంటూంటారు కానీ, ఈ 78వ స్వాతంత్ర్యదినోత్సవంలో ఆయన ఒక సరికొత్త రికార్డు కూడా సృష్టించేశారు. జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం ఆయన ప్రసంగం ఏకంగా 98నిముషాలు సాగింది.మరో రెండునిముషాలు మాట్లాడివుంటే సెంచరీ కొట్టేవారని అభిమానులు అంటున్నారు. ఓ రెండునిముషాలు ఎక్కువగా మాట్లాడి ఆయన 2016నాటి రికార్డును చెరిపేశారు. 2019లో అధిక సంఖ్యాబలంతో రెండోసారి ప్రధాని అయినప్పుడు కూడా ఎర్రకోటనుంచి 92నిముషాలే మాట్లాడారు. ఇప్పుడు సొంత బలం 240కు పడిపోయి, కూటమి కట్టాల్సివచ్చినప్పటికీ, గత పది ప్రసంగాల రికార్డులను చెరిపివేస్తూ ఈ 11వ ఎర్రకోట ప్రసంగాన్ని సుదీర్ఘంగా చేశారు. ప్రధాని ప్రసంగంలో 140కోట్ల బలం కనిపించిందే తప్ప, ఆ 240 బలహీనత కాదని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ప్రత్యక్షంగా ఆహూతులను, పరోక్షంగా కోట్లాదిమంది ప్రజలను ఆయన సంబోధించారు. మాజీ ప్రధానులు మన్మోహన్ సింగ్, అటల్‌బిహారీ వాజపేయి వంటివారు కాస్త అటూఇటూగా అరగంటే మాట్లాడేవారు. పనిమంతుడైన మన్మోహన్ సింగ్ మంచిమాటకారి కాదు కానీ, అంతటి వాగ్ధాటి ఉన్నప్పటికీ అటల్ జీ ఎర్రకోటమీద ఎందుకంత తక్కువ సమయం ఉండేవారో తెలియదు. 2014లో అధికారంలోకి వచ్చినప్పటినుంచీ నరేంద్రమోదీ ఈ స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగాన్ని నామమాత్రపు తంతుగా కాకుండా ఒక ప్రజాసంబంధ వ్యవహారంగా చూశారు. ప్రసంగానికి అప్పటివరకూ ఉన్న హద్దులను కూడా చెరిపేసి, రాజకీయం చేస్తున్నారన్న విమర్శలను కూడా ఎదుర్కొన్నారు. నెహ్రూ నుంచి రాహుల్ వరకూ ఎవరిని తప్పుబట్టాలన్నా, గతపాలకుల పాపాలు దేశానికి శాపాలుగా మారాయని కడిగిపారేయడానికి కూడా ఆయన దీనిని వాడుకున్నారు. అలాగే, పలురకాల అభియాన్లు, మిషన్ల ప్రకటనకు కూడా ఇదే వేదికైంది. స్వచ్ఛభారత్, బేటీ బచావో-బేటీ పడావో, ఉజ్వల, జల్‌జీవన్ వంటివి అందులో కొన్ని. అవినీతి వ్యతిరేక పోరాటాలు, కుటుంబపాలనపై విమర్శలు సైతం ఆయన ఎర్రకోట ప్రసంగాల్లో ఉంటాయి.

ఇప్పుడు సొంతబలం తగ్గినంతమాత్రాన మోదీ తీరులో మార్పు ఉండబోదని ఈ ప్రసంగం సైతం రుజువుచేసింది. ఆయన ఈ మారు దూకుడుగా కాక, కాస్తంత మెత్తగా మాట్లాడారని కొంతమందికి అనిపించినా, విపక్షాలను ఏకిపారేయడానికీ, వివాదాస్పద అంశాలను ముందుకు తేవడానికీ ఆయన సంకోచించలేదు. వికసిత భారతాన్ని కాంక్షించారు, మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించడం లక్ష్యంగా ప్రకటించారు.

మద్దతిస్తున్న మిత్రపక్షాలకు ఇబ్బందిలేకుండా ఉండటానికి కాబోలు, తాము ఎప్పటినుంచో వల్లిస్తున్న ఉమ్మడిపౌరస్మృతికి ఈసారి ఆయన 'సెక్యులర్' పదాన్ని జతచేర్చారు. చర్చ జరగాలన్న ఒక్క మాటతో రచ్చరేపవచ్చునని ఆయనకు తెలుసు. ఇప్పటి సివిల్‌కోడ్ మతపరమైనదనీ, వివక్షాపూరితమైనదనీ ఆక్షేపించి, మెజారిటీ ప్రజలు దానిని మెచ్చడం లేదని నిర్ధారించి, రాజ్యాంగ నిర్మాతలు కలలుగన్న ఈ లౌకికవాద ఉమ్మడిపౌరస్మృతికి సుప్రీంకోర్టు ఆమోదం, ఆశీస్సులు ఉన్నాయన్నారు. ఆ స్వప్నసాకారం దిశగా వడివడిగా అడుగులు ఎలా పడతాయో ఇక చూడాలి. ఒకేదేశం-ఒకే ఎన్నిక అవసరాన్ని కూడా ఆయన ఈ వేదికమీదనుంచి మరోమారు ఉద్ఘాటించి, సభాబలం తగ్గినంతమాత్రాన ఎజెండాలో తాము వెనక్కు తగ్గడంలేదని తెలియచెప్పారు. ఆర్థిక, చట్టపరమైన సంస్కరణల విషయంలో విపక్షాలు అడ్డుపడినా ఆగేదిలేదన్న ప్రకటన కూడా అటువంటిదే. విద్య, ఉపాధి గురించి ప్రస్తావించడం, కొన్ని చర్యలను వివరించడం ఆగ్రహంగా ఉన్న యువతరాన్ని ఉపశమింపచేయడం కోసం కావచ్చు. పదేళ్ళలో అద్భుతాలు చేశామంటూ ఏ ఒక్కరంగాన్నీ, ఏ చిన్న విషయాన్నీ వదలకుండా ఆయన ప్రజలకు వివరించారు. అదానీకి వ్యతిరేకంగా జరిగే ఏ వ్యవహారమైనా విదేశీకుట్రలో భాగమే కనుక, ఇప్పుడు సెబీచీఫ్‌మీద హిండెన్‌బర్గ్ కథనాన్ని సైతం విశ్వసించకూడదని అన్యాపదేశంగా సెలవిచ్చారు. మోదీ ఎంతో ఓపికగా చేసిన ఈ సుదీర్ఘ ప్రసంగంలో ఆత్మస్తుతి పరనిందలను అటుంచితే, కొనసాగుతున్న లక్ష్యాలను, అంతర్లీన సందేశాలను ప్రజలు సరిగానే గ్రహించి ఉంటారు.

వయనాడ్ విలయానికి కారకులు ఎవరు?

ఆ బాధ్యత నా జీవితంలో మహా కఠినమైన పని. పశ్చిమ కనుమలపై మాధవ్ గాడ్గిల్ కమిటీ సిఫారసులను సమీక్షించేందుకు గత ప్రభుత్వం నియమించిన కె. కస్తూరి రంగన్ కమిటీలో ఒక సభ్యురాలుగా ఉండడం గురించి నేను ప్రస్తావిస్తున్నాను. పశ్చిమ కనుమలను విధ్వంసం నుంచి పరిరక్షించే చర్యల పట్ల ఎందుకు అంత తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుందో మనం చర్చించాల్సిన అవసరమున్నది. ఇటీవల 400మందిని బలిగొన్న వయనాడ్ విపత్తు లాంటి ఉపద్రవాలను చవిచూస్తున్నా పశ్చిమ కనుమల ప్రాంతాల ప్రజలు తమ ప్రాంత పర్యావరణ వ్యవస్థలను కాపాడుకోవడంపై మెరుగైన అవగాహనతో కూడిన శ్రద్ధాసక్తులను ఎందుకు చూపించడం లేదనేది నన్ను బాగా కలవరపెడుతోంది.




■ సునీతా నారాయణ్

మట్టివాసన

సరే, కస్తూరి రంగన్ కమిటీ సభ్యురాలుగా నేను ఎదుర్కొన్న సందిగ్ధావస్థ గురించి తొలుత వివరిస్తాను. కస్తూరి రంగన్ కమిటీ, పౌర సమాజం వాగ్వ్యవహారంలో చెప్పాలంటే, మాధవ్ గాడ్గిల్ కమిటీ కీలక సిఫారసులను అస్పష్టం చేసి బలహీనపరిచేందుకు ఏర్పాటు చేసిన కమిటీ. కమిటీ మొదటి సమావేశం జరగకముందే ఏదో తప్పు చేశామనే భావన మాకు కలిగింది. ఆరు రాష్ట్రాలలో విస్తరించి ఉన్న పశ్చిమ కనుమల ప్రాంతాన్ని సున్నిత పర్యావరణ ప్రాంతం (ఎకొలాజికల్లీ సెన్సిటివ్ ఏరియా)గా ప్రకటించాలని మాధవ్ గాడ్గిల్ నివేదిక స్పష్టంగా సిఫారసు చేసింది. అయితే ఈ సిఫారసు ఆ ఆరు రాష్ట్రాలలో ఏ ఒక్కదానికీ ఆమోదయోగ్యం కాలేదు. గాడ్గిల్ నివేదికను తిరస్కరించాయి. కనుక కస్తూరి రంగన్ కమిటీ సభ్యురాలుగా నా విధి నిర్వహణ చాలా జటిలమైనదని నాకు బాగా తెలుసు. పశ్చిమ కనుమలను శీఘ్రగతిన పరిరక్షించేందుకు దోహదం చేసే పరిష్కారాన్ని కనుగొనడం ఎలా?

పశ్చిమ కనుమలలో 1,37,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం (80 శాతం)ను సున్నిత పర్యావరణ ప్రాంతంగా ప్రకటించాలని మాధవ్ గాడ్గిల్ కమిటీ సిఫారసు చేసింది. ఈ రక్షిత సున్నిత పర్యావరణ ప్రాంతాన్ని మూడు భాగాలుగా విభజించి ప్రతి ప్రాంతంలోను అనుమతించదగిన కార్యకలాపాల వివరాలను విపులంగా సమకూర్చింది. ఇదిగో ఈ సిఫారసే తోటల ప్రాంతాలు, వ్యవసాయ భూములు ప్రభుత్వ నియంత్రణకు లోనవుతాయేమోననే భయాలు, సంకోచాలను సృష్టించడానికి దారి తీసింది. అయితే ఆ సిఫారసు చేయడంలో మాధవ్ గాడ్గిల్ ఉద్దేశం అది కాదని నేను ఘంటాపథంగా చెప్పుతున్నాను. గాడ్గిల్ నాకు బాగా తెలుసు. పర్యావరణ, ప్రజల జీవనోపాధుల రక్షణకు అంకితభావంతో కృషి చేసిన పర్యావరణవేత్త. సామాజిక సమూహాల హక్కులను సంరక్షించాలని ఆయన సదా వాదించేవారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజలు సంపూర్ణ భాగస్వాములు కావాలనేది ఆయన ఆకాంక్ష. గాడ్గిల్ నివేదికకు ఆయన ఆకాంక్షకు విరుద్ధమైన భాష్యాలు చెప్పడం చాలా విచారకరమైన విషయం. ఎందుకలా జరిగింది? పశ్చిమ కనుమల ప్రాంతాలలో విధ్వంసకరమైన 'అభివృద్ధి' కార్యకలాపాలకు కారకులు, రాజకీయ ప్రాబల్యమున్న శక్తిమంతమైన స్వార్థపరశక్తులే అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.



కస్తూరి రంగన్ కమిటీ సిఫారసులలో కేరళ కోరిన సవరణే వయనాడ్ విషాదానికి దారితీసిందా? వాతావరణ మార్పు తీవ్రస్థాయిలో చోటుచేసుకుంటున్న ఈ కాలంలో ఏ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ నమూనాకు ప్రజల మద్దతు ఖాయంగా లభిస్తుంది? వయనాడ్ విపత్తు నేపథ్యంలో ఈ రెండు అంశాలపై మనం విస్తృత, లోతైన చర్చ జరపాల్సిన అవసరమున్నది.

ఆరు రాష్ట్రాల ప్రభుత్వాల ప్రతినిధులు, ఇతరులతో చర్చలు జరిపిన అనంతరం కస్తూరి రంగన్ కమిటీ తన సిఫారసులు రూపొందించింది. 2013లో పర్యావరణ పరిరక్షణ చట్టంలోని 5వ సెక్షన్ కింద వాటిని జారీ చేశారు. నోటిఫై అయిన సిఫారసులు మాధవ్ గాడ్గిల్ కమిటీ నివేదికకు రెండు మార్పులు చేశాయి. మొదటిది– పశ్చిమ కనుమలలోని సున్నిత పర్యావరణ ప్రాంతాన్ని 59,940 చదరపు కిలోమీటర్లకు కుదించింది. ఉపగ్రహాల ద్వారా తీసిన ఫోటోల ఆధారంగా పశ్చిమ కనుమలలో 60 శాతం తోటలు, వ్యవసాయ భూములు, మానవ ఆవాస ప్రదేశాలుగా ఉన్నాయని నిర్ధారించారు. వీటిని సాంస్కృతిక భూ దృశ్యం (కల్చరల్ ల్యాండ్ స్కేప్ – ప్రకృతి, మానవ చర్యలు రెండిటితో తీర్చిదిద్దబడిన ప్రాంతం)గా వర్గీకరించారు. సదరు భూములను ఉపయోగించుకుంటున్న తీరుతెన్నులను వెనక్కి అంటే పూర్వపు పరిస్థితికి మళ్లించలేము. కనుక మిగిలిన సహజ భూ దృశ్యం (నేచురల్ ల్యాండ్ స్కేప్)ను పరిరక్షించుకోవల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. ఈ సహజావరణంలో 20 శాతానికి పైగా పరిరక్షిత అడవులు, గ్రామాలు ఉన్నాయి. పర్యావరణ పరిరక్షణ చట్టం ఆ పరిరక్షిత గ్రామాల జాబితాను కూడా పేర్కొంది.

పశ్చిమ కనుమలలో అనుమతిస్తున్న, అనుమతించని కార్యకలాపాల సమగ్ర జాబితాను జారీ చేయకుండా విధ్వంసకర కార్యకలాపాలను చాలవరకు నిషేధించాలని కస్తూరి రంగన్ కమిటీ సిఫారసు చేసింది. దీని ప్రకారం ఇసుక తవ్వకాలతో సహా సకల మైనింగ్ కార్యకలాపాలు నిషిద్ధమయ్యాయి. అలాగే థర్మల్ విద్యుత్కేంద్రాలతో సహా సకల కాలుష్యకారక పరిశ్రమలు, భారీ స్థాయిలో భవన నిర్మాణ, ప్రాజెక్టులు, కొత్త టౌన్‌షిప్ ప్రాజెక్టులు మొదలైనవన్నీ నిషిద్ధమయ్యాయి. కస్తూరి రంగన్ కమిటీ సిఫారసులపై 2013లో జారీ అయిన నోటిఫికేషన్ ఇప్పటికీ అమలులో ఉన్నది. దానికింద పరిరక్షిత పశ్చిమ కనుమలలో నిషిద్ధ కార్యకలాపాలకు పర్యావరణ అనుమతులు ఇవ్వడం లేదు. అయితే ఈ విషయంలో ఒక కీలకమార్పు చోటుచేసుకున్నది. అది కేరళ రాష్ట్ర సంబంధితమైనది.

కస్తూరి రంగన్ సిఫారసుల నోటిఫికేషన్‌పై కేరళ ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. రక్షిత ప్రాంతాలలో మార్పులు చేయాలని కోరింది. కస్తూరి రంగన్ కమిటీ పేర్కొన్న నేచరల్ ల్యాండ్ స్కేప్‌లోని గ్రామాలను మొత్తంగా పరిరక్షిత ప్రదేశాలుగా వర్గీకరించకూడదని కేరళ ప్రభుత్వం వాదించింది. అందుకు బదులుగా గ్రామ సరిహద్దుల పరిధిలో ఒక ప్రాంతాన్ని పరిరక్షితమైనదిగా, మరొక ప్రాంతాన్ని పరిరక్షితం కానిదిగా పరిగణించాలని కేరళ సూచించింది. ఈ విధంగా కస్తూరి రంగన్ కమిటీ జాబితాలో ఉన్న గ్రామాలలో సున్నిత పర్యావరణ ప్రాంతం ఉంటుంది. ఆ ప్రాంతంలో మైనింగ్ కార్యకలాపాలను అనుమతించాలి. కేరళ ప్రభుత్వ సూచనను ఆమోదిస్తూ 2013లో జారీ చేసిన నోటిఫికేషన్‌కు కేంద్ర ప్రభుత్వం 2018లో ఒక సవరణ చేసింది. కేరళ డిమాండ్ చేసిన విధంగా పరిరక్షిత పశ్చిమ కనుమలలోని 3,115 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని ఆ నోటిఫికేషన్ నుంచి మినహాయించింది.

ఈ నేపథ్యంలో మనం రెండు ప్రధాన విషయాల గురించి మరింత విస్తృతంగా చర్చించవలసి ఉన్నది. ఒకటి– కస్తూరి రంగన్ కమిటీ సిఫారసులలో కేరళ కోరిన సవరణే వయనాడ్ విషాదానికి దారితీసిందా? రెండు– వాతావరణ మార్పు తీవ్రస్థాయిలో చోటుచేసుకుంటున్న ఈ కాలంలో ఏ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ నమూనాకు ప్రజల మద్దతు ఖాయంగా లభిస్తుంది? మరింత స్పష్టంగా చెప్పాలంటే సున్నిత పర్యావరణ ప్రాంతాలలో అభివృద్ధి నమూనాను ఎలా రూపొందించుకోవాలి?

(సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

ఉపేక్షిత కులాలకు ఉపకోటా వెల్లులు

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల అమలులో క్రీమీలేయర్ (సంపన్న శ్రేణి) నిబంధనను ప్రవేశపెట్టనున్నారనే విషయమై జరుగుతున్న ఊహాగానాలకు కేంద్రం తెరదించింది. అటువంటి మినహాయింపు సూత్రాన్ని సదరు రిజర్వేషన్లకు వర్తింపచేసే ఆలోచన ఏదీ లేదని కేంద్ర కేబినెట్ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. అయితే ఎస్సీ రిజర్వేషన్లను ఉపవర్గీకరణ చేసేందుకు రాష్ట్రాలకు అనుమతినిస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు అమలుపై ప్రశ్నలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎస్సీ కులాలలో బాగా వెనుకబడిన శ్రేణులకు ప్రత్యేక కోటాలు మంజూరు చేయడం (అంటే ఎస్సీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణ) వివక్ష, వెనుకబాటుతనం నిర్మూలనకు, సామాజిక నైతిక న్యాయసాధనకు దోహదం చేస్తుందా అనే అంశంపై స్పష్టమైన సమాధానాలు లేని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఎస్సీ రిజర్వేషన్లకు 'క్రీమీలేయర్' నిబంధనను వర్తింపచేసే ప్రసక్తే లేదన్న కేంద్ర కేబినెట్ నిర్ణయం ఆశ్చర్యం కలిగించలేదు. ఆర్థికాభ్యున్నతిని పొందిన దళితులపై వివక్ష కొనసాగుతూనే ఉన్నందున ఎస్సీ/ ఎస్టీ రిజర్వేషన్లకు క్రీమీలేయర్ నిబంధనను వర్తింపచేయకూడదనేది ఇప్పటికే ఒక సునిశ్చిత అభిప్రాయంగా ఉన్నది' అని ప్రొఫెసర్ సునీత్ మహ్సాకర్ (ఒ.పి. జిందాల్ విశ్వవిద్యాలయం) అన్నారు. అయితే ఉపవర్గీకరణకు అనుమతినిస్తూ తీర్పునిచ్చిన ఏడుగురు సభ్యుల ధర్మాసనంలోని నలుగురు న్యాయమూర్తుల వ్యాఖ్యలతో ఎస్సీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ నిబంధనను ప్రవేశపెట్టనున్నారా అన్నది విస్తృతంగా చర్చనీయాంశమయింది.

ఎస్సీ ఎస్టీలలో సంపన్న శ్రేణులను గుర్తించి వారిని రిజర్వేషన్ల పరిధి నుంచి మినహాయించాలన్నది ఆ నలుగురు న్యాయమూర్తుల వ్యాఖ్యల సారాంశం. రాజ్యాంగ అధికరణ 341 ప్రకారం షెడ్యూల్డు కులాలు అన్నీ ఒకే సమూహానికి చెందినవని 2005లో ఇ.వి. చిన్నయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఆగస్టు 1న 6:1 మెజారిటీతో త్రోసిపుచ్చింది. ఎస్సీ కులాలలో అత్యధికం తీవ్ర వివక్షకు గురవుతూ బాగా వెనుకబాటుతనంలో ఉన్నందున రాష్ట్రాలు ఉపవర్గీకరణ చేయడం రాజ్యాంగ సమ్మతమేనని ఏడుగురు సభ్యుల ధర్మాసనం స్పష్టం చేసింది. అటువంటి ఉపవర్గీకరణ కచ్చితమైన గీటురాళ్ల ప్రాతిపదికన జరగాలని మెజారిటీ తీర్పును స్వయంగా రాసిన భారత ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ పేర్కొన్నారు. అటువంటి విభజన నిర్దిష్ట కులాలను రాష్ట్రపతి జాబితా నుంచి మినహాయించదని, ఉపవర్గీకరణ అవసరమని నిరూపించే వాస్తవిక సమాచారం ప్రాతిపదికన జరగాలని, ఉపవర్గీకరణకు చేసే ఏ చట్టమైనా న్యాయసమీక్షలో ఆమోదం పొందితీరాలని న్యాయ కోవిదులు ఘంటాపథంగా చెబుతున్నారు.



ఎస్సీ రిజర్వేషన్లను ఉపవర్గీకరణ చేసేందుకు రాష్ట్రాలకు అనుమతినిస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు 'విప్లవాత్మక'మైనదని ఆ సామాజిక వర్గంలో బాగా వెనుకబడిన సమూహాలు భావిస్తున్నాయి. అయితే భర్తీ కాకుండ మిగిలిపోయిన రిజర్వ్‌డ్ ఉద్యోగాలు, ఉపకులాల స్థితిగతులపై అనుభవపూర్వక, సమాచారం కొరవడడం, అసలు ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు తగ్గిపోతున్న తరుణంలో ఎస్సీలకు రాజ్యాంగ విహిత కేటాయింపుల విభజనపై సమాధానాలు లేని ప్రశ్నలు ఎన్నో తలెత్తుతున్నాయి.

ఎస్సీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణకు సుప్రీంకోర్టు అనుమతించడం 'విప్లవాత్మక నిర్ణయం' అని రయీస్ ముహమ్మద్ (గతంలో రవిచంద్రన్ బత్రన్) వ్యాఖ్యానించారు (ఈయన 2016లో రాసిన 'ది మెనీ ఒమిషన్స్ ఆఫ్ ఎ కాన్సెప్ట్ : డిస్క్రిమినేషన్ ఎమాంగెస్ట్ షెడ్యూల్డ్ క్యాస్ట్స్' అనే పరిశోధనా పత్రంలోని కొన్ని అంశాలను సిజెఐ చంద్రచూడ్ తన తీర్పు పాదసూచికల్లో ఉటంకించారు). 'ఒక సామాజిక సమస్య పరిష్కారంలో న్యాయవ్యవస్థ ఒక విప్లవాత్మక తీర్పును వెలువరించడం చరిత్రలో ఇదే మొదటిసారి. మానవ మలమూత్రాలను ఎత్తి పారబోసే హేయ, అమానుష వృత్తిలో ఉన్న వాల్మీకీలు ఇత్యాది కులాలవారు ఇప్పుడు విద్యా ఉద్యోగాలలో వాటా, తద్వారా సామాజిక న్యాయాన్ని పొందగలుగుతారు. సుప్రీంకోర్టు తీర్పును అమలుపరిస్తే మూడు నుంచి ఐదు సంవత్సరాలలో తోటి ఎస్సీల మధ్య తమకు నిత్యం జరుగుతున్న అన్యాయాలను వారు అధిగమించగలుగుతారని' ముహమ్మద్ అన్నారు. 'క్రీమీలేయర్ నియమం వివక్షను రూపుమాపలేదు. అయితే షెడ్యూల్డు కులాలలో కుల అంతరాలను తొలగించేందుకు శ్రద్ధ చూపినందున సుప్రీంకోర్టు తీర్పు విప్లవాత్మకమైనదని' ఆయన అభిప్రాయపడ్డారు. అంబేడ్కర్ 'కుల నిర్మూలన'ను ఒక మత గ్రంథంగా దళితులు భావించడం దళిత ఉద్యమంలోని ఒక తీవ్ర లోపం. 'అంబేడ్కర్ ఆ పుస్తకాన్ని హిందువుల నుద్దేశించి రాశారు. దళితులు ఇప్పుడు తమ మొత్తం సమస్యలను అగ్రకుల హిందువులు కేంద్రంగా చూస్తున్నారు. నిజానికి 'దళితులలో మరింత కులతత్వం ఉందనేది నా వాదన. సుప్రీంకోర్టు తీర్పు కూడా ఈ విషయాన్ని చెప్పింది. దళితులలో సైతం బ్రాహ్మిణీయ మనస్తత్వం ఉన్నది. కులం అనేది అగ్రకులాల సమస్యగా మాత్రమే చూసేందుకు వారు ప్రయత్నిస్తున్నారు. కులం అనేది క్రింది స్థాయి కులాలకు సమస్య కాదని వారు చెప్పడం లేదు. ప్రతి వ్యక్తికీ కులం అనేది ఒక సమస్యగా ఉందని సుప్రీంకోర్టు తీర్పు చెప్పినందున అది విప్లవాత్మకమైనదని అంటున్నాను' అని ముహమ్మద్ అన్నారు.

ఉపవర్గీకరణ మాత్రమే ఎస్సీల, ఎస్టీల పురోగతికి దోహదం చేయగలదా లేదా అనేది ఇప్పుడు అసలైన ప్రశ్న అని ప్రభుత్వోద్యోగాలు, విద్యా సంస్థలలో దళితుల, ఆదివాసీల ప్రాతినిధ్యంపై సర్వే చేసిన ఇండియన్ రెవెన్యూ సర్వీస్ అధికారి ఎమ్ఎస్ నెత్రపాల్ అన్నారు. 'రిజర్వేషన్ విధానం గురించి మాట్లాడుతున్నప్పుడు భర్తీ చేయని ఉద్యోగ ఖాళీల గురించి తప్పక పట్టించుకోవల్సి ఉన్నది. ఉద్యోగాల విషయాన్ని సమగ్రంగా చూసినప్పుడు ఔట్‌సోర్సింగ్, ప్రైవేటీకరణ, ప్రభుత్వ రంగ సంస్థల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ మొదలైన పరిణామాలతో వాటి సంఖ్య అంతకంతకూ తగ్గిపోతోంది దీనికి తోడు ఉన్నత స్థాయి ఉద్యోగాలను చూస్తే రిజర్వ్‌డ్ కేటగిరీలో భర్తీకాకుండా మిగిలిపోయిన ఉద్యోగాలు అనేకం ఉండడాన్ని గమనిస్తాం. మరి వాటిని భర్తీచేసేదెప్పుడు? అనేది ప్రశ్నగా మిగిలిపోతోంది' అని ఆయన అన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమని సునీత్ మహ్సాకర్ అభిప్రాయపడ్డారు. ఆదాయం, ఆస్తులు, భూమిపై యాజమాన్యం పరంగా కులాల వారీగా ఎటువంటి సమాచారం లేదు గనుక ఆ తీర్పు రాజ్యాంగ విహితం కాదని ఆయన స్పష్టం చేశారు. 'ఉప విభజన తప్పనిసరి కావచ్చు. భవిష్యత్తులో జనాభా గణన వివరాలు అందుబాటులోకి వచ్చి, కొన్నికులాలు అధికంగా లబ్ధి పొందడంతో ఆటు, అవి కులాధారిత వివక్షకు తక్కువగా గురవుతున్నాయని ధ్రువీకరణకావచ్చు. మరాఠా, జాట్ కులస్తుల రిజర్వేషన్ల విషయంలో తగినంత అనుభవపూర్వక సమాచారం (ఎంపిరికల్ డేటా) లేదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. మరి ఇప్పుడు ఎస్సీ రిజర్వేషన్ల విషయంలో పూర్తి విరుద్ధంగా వ్యవహరించింది. ఎస్సీ ఉపకులాల, ఉపతెగలకు సంబంధించి ఎటువంటి అనుభవపూర్వక సమాచారం లేకుండానే ఉపవర్గీకరణ చేయవచ్చని ఆదేశించింది. ఇది రాజ్యాంగ విరుద్ధమని భావిస్తున్నాను' అని ఆయన అన్నారు. విద్యా ఉద్యోగాల ప్రవేశాలలో ముఖ్యంగా ఉన్నత స్థాయి ఉద్యోగాల విషయంలో కేవలం సంఖ్యాపరమైన ప్రాతినిధ్యానికేకాకుండా ప్రభావదాయక ప్రాతినిధ్యానికి ఆయా ఉపకులాలకు సంబంధించిన అనుభవపూర్వక సమాచారంను పరిగణనలోకి తీసుకోవడం చాలా ముఖ్యం. 'ఒక నిర్దిష్ట కులంకు సంబంధించిన సాధారణ ఉద్యోగులు, ఉన్నతాధికారులు ఎంతమంది ఉన్నారు. ఉన్నత విద్య అభ్యసించినవారు ఎందరున్నారు అనే అంశాలపై ప్రభుత్వం వద్ద సమాచారం ఉండి ఉండవచ్చని నేను భావిస్తున్నాను. ఆ సమాచారాన్ని ప్రజారంగం (పబ్లిక్ డొమైన్)లో ఉంచితే, సిజెఐ నిర్దేశించినట్టు కచ్చితమైన సమాచారం ప్రాతిపదికన ఉపవర్గీకరణ జరిగేందుకు ఆస్కారముంటుంది. అయితే అది న్యాయ తనిఖీ (జుడీషియల్ స్క్రూటినీ) నెదుర్కోవలసి ఉంటుందని' నెత్రపాల్ స్పష్టం చేశారు.


ఉపవర్గీకరణ అన్ని రాజకీయ పార్టీలకు రాజకీయంగా సమ్మతమవుతుందని, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతున్న మేధావి, ప్రజా కార్యకర్త సూరజ్ యెంగ్డే అభిప్రాయపడ్డారు. అయితే దీనివల్ల అంబేడ్కరైట్ విలువలు అన్నీ నిరర్థకమవుతాయని కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఆయన అభిప్రాయపడ్డారు. ఆయన ఇంకా ఇలా అన్నారు: 'ఏ ఒక్క ఎస్సీ కులం కోసం కాకుండా సమస్త షెడ్యూల్డు కులాల అభ్యున్నతికై అంబేడ్కర్ పోరాడారు. ఇప్పుడు ఉపవర్గీకరణతో ప్రతి ఎస్సీ ఉపకులమూ సమస్త ఎస్సీ వర్గంలో ఒక భాగంగా కాకుండా తనను తాను ఒక సంపూర్ణ ఎస్సీ శ్రేణిగా భావించుకుంటుంది. షెడ్యూల్డు కులాలు సమైక్యమవకుండా దేనికది విడిగా ఉండిపోయేలా చేయడమే బ్రాహ్మిణీయ ఎజెండా'. అట్టడుగు ఎస్సీ కులాల బాగును దృష్టిలో ఉంచుకునే సుప్రీంకోర్టు ఆ తీర్పును వెలువరించి ఉండవచ్చు కాని వాస్తవిక, ప్రామాణిక సమాచారం ప్రాతిదికన ఉపవర్గీకరణ జరగాలన్న నిర్దేశం అంతిమంగా ఎస్సీ కులాలలో చీలికలకు దారితీసే అవకాశమున్నది. సంప్రతింపుల ప్రక్రియ ద్వారా ఉపవర్గీకరణ జరగడం ఉత్తమమని యెంగ్డే అన్నారు. వివిధ సామాజిక సమూహాలతో సహా ఎస్సీ కులాల వారిని విస్తృతంగా సంప్రదించిన అనంతరం ఉపవర్గీకరణ జరగాలి. ఈ బాధ్యతను పార్లమెంటు చేపట్టాలని యెంగ్డే అన్నారు. 'కొన్ని కులాలకు సరైన ప్రాతినిధ్యం లేదన్న విషయం మనకు తెలుసు. వారి సమస్యలు నిజమైనవి. వాటిని పరిష్కరించి తీరాలి. వనరుల పునఃపంపిణీ అనేది ఉపవర్గీకరణ ద్వారా సవ్యంగా జరగదు. నిర్దిష్ట కులాల వారి వెనుకబాటుతనానికి అసలైన కారణాలు ఏమిటో గుర్తించడం ద్వారా మాత్రమే వనరుల పునఃపంపిణీ సమరీతిలో జరిగేందుకు అవకాశమున్నది. వనరుల పునఃపంపిణీ అనేది అట్టడుగు కులంలోని అట్టడుగు వ్యక్తికి కూడా చేరి తీరాలి. కేవలం సంఖ్యాపరంగా అధిక జనాభా ఉన్న కులాలకే ఆ పునఃపంపిణీ పరిమితం కాకూడదు. వెనుకబడిన సామాజిక సమూహాలు ఎన్ని ఉన్నాయో గుర్తించి, వనరులను సమంగా పంపిణీ చేసేందుకు ఏమి చేయాలో ఆలోచించాలి. (రిజర్వేషన్ల) రొట్టెను మీరు తునకలుగా చేసి, పంపిణీ చేయలేరు. ఎందుకంటే ఆ రొట్టె ఇప్పటికే చాలా చిన్నదిగా ఉన్నది' అని సూరజ్ యెంగ్డే అన్నారు.

■ శ్రావస్తి దాస్ గుప్తా
(ద వైర్ సౌజన్యం)

నాలుగు దశాబ్దాలైనా అదే కథ!

గత నెల 27న జరిగిన నీతి ఆయోగ్ జనరల్ కౌన్సిల్ సమావేశానికి కేరళ, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఢిల్లీ, పంజాబ్, బిహార్, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, పుదుచ్చేరి రాష్ట్రాల ముఖ్యమంత్రులు గైర్హాజరయ్యారు. బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హాజరయినా తన ఉపన్యాసం పూర్తికాక ముందే మైక్ కట్ చేశారని వాకౌట్ చేశారు.

సరిగ్గా నలభై సంవత్సరాల క్రితం ఇటువంటి సంఘటన జరిగిన సందర్భం ఒకటి గుర్తుకొస్తున్నది. జమ్మూ కాశ్మీర్‌లో ఫరూక్ అబ్దుల్లా నాయకత్వాన గల మంత్రివర్గాన్ని రద్దు చేసి, ఆయన బావ జి.ఎం. షాను ముఖ్యమంత్రిని చేసింది అప్పటి ఇందిరాగాంధీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం. దానిపై నలుగురు కాంగ్రెసేతర ముఖ్యమంత్రులు; చరణ్‌సింగ్, చంద్రశేఖర్, బిజూ పట్నాయక్, వాజ్‌పేయి వంటి 19 మంది ప్రతిపక్ష నేతలు ఎన్‌టిఆర్ అధ్యక్షతన ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో జూలై 10న సమావేశమై ఈ దుందుడుకు చర్యను ఖండిస్తూ తీర్మానించి, ఈ దుశ్చర్యను సరిదిద్దవలసిందిగా రాష్ట్రపతి జ్ఞాని జైల్‌సింగ్‌ను కలిసి వివరించాలని నిర్ణయించారు.



ఆ తరువాత 12వ తేదీన జాతీయ అభివృద్ధి మండలి సమావేశం జరిగింది. దానికి ముఖ్యమంత్రుల ఉపన్యాసాన్ని ముందుగానే తయారుచేసి, దానిని ముద్రించి అచ్చుప్రతులను కూడా కేంద్ర ప్రభుత్వానికి, ప్రణాళికా సంఘానికి అందజేయాలి. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రణాళికా శాఖ, ఆర్థిక శాఖ అధికారులతోనూ చర్చించి, ఎన్‌టిఆర్ ఉపన్యాసాన్ని రూపొందించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఇందిరాగాంధీ ముందుగా అధ్యక్షోపన్యాసం చేశాక, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులుగా ఉన్న శంకరరావు చవాన్ మాట్లాడారు. అకారాది క్రమంలో తొలుత మాట్లాడిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ ముందుగా రూపొందించిన ఉపన్యాసాన్ని పక్కన పడేసి, జేబులో నుంచి చిన్న కాగితాన్ని తీసి రాజకీయ ఉపన్యాసం మొదలుపెట్టారు. "జమ్మూ కాశ్మీర్‌లో ఫరూక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని కేంద్రం కుట్ర చేసి పడగొట్టి, జి.ఎం. షాకు పట్టం గట్టడాన్ని తీవ్రంగా ఖండించి, ఈ దుందుడుకు దూకుడులో లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమితులైన జగ్‌మోహన్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. తరువాత సర్కారియా కమిషన్ సిఫార్సుల ప్రకారం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలను పునర్నిర్వచించాలని రాజకీయ ఉపన్యాసం చేశారు.

ఇటువంటి రాజకీయ ఉపన్యాసాలకు, చర్చలకు ఇది వేదిక కాదని, చర్చలను తప్పుతోవకు మళ్లించవద్దని, ప్రధాని పదే పదే హెచ్చరించినా, తన ధోరణిలోనే ఉపన్యాసాన్ని కొనసాగించి, కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా వాకౌట్ చేశారు. ఎన్‌టిఆర్ ఉపన్యాసాన్ని అడ్డుకోరాదని ప్రధానితో వాదించిన ముగ్గురు ముఖ్యమంత్రులు– జ్యోతిబసు, రామకృష్ణ హెగ్డే, నృపేన్ చక్రవర్తి– కూడా ఎన్‌టిఆర్‌తో పాటే వాకౌట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ అధికారులు కూడా సమావేశం నుంచి ముఖ్యమంత్రితో బయటకు రావడానికి లేస్తే, వారిని కూర్చోమని ఎన్‌టిఆర్ సైగ చేశారు. తరువాత సమావేశం ప్రతిపక్ష ముఖ్యమంత్రుల బాధ్యతారహిత ప్రవర్తనను ఖండిస్తూ తీర్మానం చేసింది. సమావేశంలో ప్రధాని, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు గుసగుసలాడుకొని వాకౌట్ చేసిన ముఖ్యమంత్రులకు సహాయకులుగా వచ్చిన ఆయా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కూడా సమావేశం నుంచి బయటకు వెళ్లాలని ప్రకటించారు.

రాజకీయ ఉపన్యాసం సంఘటనతో ఇందిరాగాంధీ అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. అసలే అంతంత మాత్రంగా ఉన్న కేంద్ర-రాష్ట్ర సంబంధాలు మరింత సంక్లిష్టమయ్యాయి. కొద్ది రోజులకే ఎన్‌టిఆర్ గుండె శస్త్రచికిత్సకు అమెరికా వెళ్లడం, ఆయన అక్కడుండగానే ఇక్కడ ఆగస్టు సంక్షోభం ఏర్పడడం, స్వాతంత్ర్య దినోత్సవం నాటికి హైదరాబాద్‌కు చేరుకున్న ఎన్‌టిఆర్‌కు ఇటువంటి పరిస్థితి ఎదురవడం– ఈ పరిణామాలన్నీ చూశాం. చివరిగా చెప్పవచ్చేదేమంటే నలభై ఏళ్లుగా అదే కథ నడుస్తున్నది.

– డాక్టర్ యలమంచిలి శివాజీ

ప్రజా కలెక్టర్ 'పట్టాల' చంద్రయ్య

"ఎవరైనా మిమ్మల్ని చలువరాతి మందిరాల్లోకి ఆహ్వానిస్తే వెళ్ళండి, కానీ వెళ్ళేముందు మీరు ఉంటున్న పూరి గుడిసెకు నిప్పు పెట్టి మాత్రం వెళ్లవద్దు" అని డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ తన జాతి జనులకు జాగ్రత్త చెప్పాడు. కొమ్మ పట్టుకొని, ఉన్నత స్థానానికి చేరుకోవడంతో పాటు మరొకరికి కొమ్మగా మారి, చేయూతనందించాలని దళిత విద్యావంతులకు ఆయన పిలుపునిచ్చాడు. ఈ విధమైన ఎరుకతో గురుతరమైన బాధ్యతతో సమాజ ప్రగతికి జీవితాన్ని అంకితం చేసిన ధన్యజీవి కత్తి చంద్రయ్య. తల్లి, తండ్రి, గురువు, బంధువు, సోదరుడు, యముడు... వీరందరి విశిష్ట లక్షణాలను పుణికి పుచ్చుకున్నవారే ఉత్తమ అధికారి అన్న నీతిశాస్త్ర సూత్రానికి నిలువెత్తు నిదర్శనం చంద్రయ్య. కలెక్టర్ బంగాళాకే పరిమితం కాకుండా కటిక పేదరికంలో కునారిల్లుతున్న అణగారినవర్గాల అభ్యుదయపథంలో మడమ తిప్పకుండా పయనించిన బహుదూరపు బాటసారి చంద్రయ్య. పరిపాలన అంటే నిరుపేదల ఆలనా పాలనయేనని నిరూపించిన అరుదైన కలెక్టర్‌గా మన్ననలందుకున్నాడు. శిఖరాలను అధిరోహించటం గొప్పతనం కాదని, అందుకు కారణమైన పునాదులను పటిష్ఠపరచాలని తన కార్యాచరణతో రుజువు చేసిన మానవతామూర్తి. "పాలనా సామర్థ్యంలో, పౌరసేవలో, సంఘ సంస్కరణలో పాండిత్యంలో, రచనా వైభవంలో అన్నింటికీ మించి తాడిత, పీడిత ప్రజాబంధుగా" కత్తి చంద్రయ్య రాణకెక్కాడని ఏబీకే ప్రసాద్ కితాబిచ్చాడు (ఏబీకే సంపాదకీయాలు). చంద్రయ్య జీవన పుటలను పరిశీలిస్తే సమున్నత లక్ష్యసాధనా విధానం అర్థమవుతుంది. పేదరికం, అంటరానితనం వంటి ముళ్ళకంచెలను, పెను అవరోధాలను అధిగమించి, జ్ఞానైక దృష్టితో జీవితాన్ని గెలిచే స్ఫూర్తి కలుగుతుంది.



మద్రాస్ ప్రెసిడెన్సీ సివిల్ సర్వీస్‌కు ఎంపికై మూడు దశాబ్దాలపాటు వివిధ హోదాల్లో కీలక అధికారిగా కత్తి చంద్రయ్య ప్రభుత్వ ప్రశంసలందుకున్నాడు. నిబద్ధత కలిగిన కలెక్టర్‌గా ప్రజల నీరాజనాలందుకున్నాడు. నిరుపేదలకు, దళితులకు గిరిజనులకు విస్తృతంగా భూమిని పంపిణీ చేశాడు. అనేక రాజకీయ ఒత్తిళ్లను తట్టుకొని, తీవ్రమైన బెదిరింపులను లెక్కజేయకుండా వేలాది ఎకరాల భూమిని అణగారిన వర్గాల ప్రజలకు పట్టాలుగా పంచిపెట్టాడు.

పాత గుంటూరు జిల్లా ఒంగోలు సమీపంలోని పోతవరం గ్రామంలో పేరయ్య, రాగమ్మ దంపతులకు 1924, జూలై 6న కత్తి చంద్రయ్య జన్మించాడు. ఒక కుగ్రామంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన నిరుపేద కుటుంబ నేపథ్యం నుంచి ఎదిగివచ్చిన చంద్రయ్య, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో డిగ్రీ పూర్తి చేసి, మద్రాస్ విశ్వవిద్యాలయంలో న్యాయవాద విద్యనభ్యసించాడు. మద్రాస్ ప్రెసిడెన్సీ సివిల్ సర్వీస్‌కు ఎంపికై మూడు దశాబ్దాలపాటు వివిధ హోదాల్లో కీలక అధికారిగా ప్రభుత్వ ప్రశంసలందుకున్నాడు. నిబద్ధత కలిగిన కలెక్టర్‌గా ప్రజల నీరాజనాలందుకున్నాడు. ప్రజలకు తలలో నాలుకలా, బడుగు బలహీన వర్గాలకు కొంగుబంగారంగా వెలుగొందాడు. ఆంధ్రప్రదేశ్ సర్వీస్ కమిషన్, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఓరియంటల్ స్టడీ రీసెర్చ్ సెంటర్ వంటి సంస్థల్లో క్రియాశీలక సభ్యుడిగా ఆ సంస్థల పురోగతికి చంద్రయ్య విస్తృతంగా కృషి చేశాడు.

ప్రకాశం, గుంటూరు, ఉమ్మడి హైదరాబాద్ కలెక్టర్‌గా ఆయా జిల్లాల సర్వతోముఖ వికాసానికి చంద్రయ్య విశేషమైన సేవలందించాడు. ప్రకాశం జిల్లా తొలి కలెక్టర్‌గా ఆయన చారిత్రాత్మకమైన పాత్ర పోషించాడు. ఎంతో సూక్ష్మపరిశీలనతో, ముందుచూపుతో అంకితభావంతో జిల్లా అభివృద్ధికి చంద్రయ్య నిరంతరం పరిశ్రమించాడు. ఏ జిల్లాలో కలెక్టర్‌గా విధులు చేపట్టినా ఆ ప్రాంత ప్రజల హృదయాల్లో ఆయన చెరగని ముద్ర వేశాడు.

వ్యవసాయ కూలీలుగా మాత్రమే మిగిలిపోకుండా, దళితులు భూయజమానులుగా మారాలని చంద్రయ్య భావించాడు. "విద్య మన భవిష్యత్తు, భూమి మన వర్తమానమూ, భవిష్యత్" అని ప్రబోధించిన అంబేడ్కర్ దార్శనికతను తన పాలనకు అన్వయించుకొని తదనుగుణమైన ధ్యేయంతో కత్తి చంద్రయ్య ప్రజాసేవలో నిమగ్నమయ్యాడు. నిరుపేదలకు, దళితులకు గిరిజనులకు విస్తృతంగా భూమిని పంపిణీ చేశాడు. అనేక రాజకీయ ఒత్తిళ్లను తట్టుకొని, తీవ్రమైన బెదిరింపులను లెక్కజేయకుండా వేలాది ఎకరాల భూమిని అణగారిన వర్గాల ప్రజలకు పట్టాలుగా పంచిపెట్టాడు. అందుకే ప్రకాశం జిల్లాలో 'పట్టాల చంద్రయ్య'గా ప్రఖ్యాతి చెందాడు. పేద ప్రజలు ప్రేమతో ఇచ్చిన ఈ అరుదైన బిరుదు ఎన్నో పురస్కారాలకంటే ఎంతో విశిష్టమైనది. ఈ బిరుదులో కత్తి చంద్రయ్య పాలనాగరిమ అర్థమవుతుంది. ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో మాల, మాదిగ, యానాది వాడల్లో, బహుజన, ముస్లిం ప్రజలు నివాసముండే ప్రాంతాల్లో అనేక కాలనీలు నిర్మించి, వందలమందికి చంద్రయ్య గృహవసతి కల్పించాడు.

పాలనాదక్షుడుగా మంచి గుర్తింపు తెచ్చుకున్న కత్తి చంద్రయ్య గొప్ప పరిశోధకుడు, రచయిత అని చాలామందికి తెలియదు. నాలుగు శతాబ్దాల మహోన్నత హైదరాబాద్ చరిత్ర (Hyderabad 400 years of glorious years) అనే గ్రంథం చంద్రయ్య అపారమైన పరిశోధనా పటిమకు తార్కాణం. కుతుబ్‌షాహీ, అసఫ్‌జాహీల నేతృత్వంలోని హైదరాబాద్ చారిత్రిక, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితులను, ఈ బృహత్ గ్రంథంలో చంద్రయ్య సముచితంగా విశ్లేషించాడు. రాజుల ప్రణయగాథలు, ప్రజల బాధలతో పాటు, నగరంలో వెల్లివిరిసిన మతసామరస్యం, జాతీయ సమైక్యత, మొగల్, ఇండో సొరసెనిక్ శిల్పకళావైభవం తదితర అంశాలను ఈ పుస్తకంలో చంద్రయ్య వివరంగా సమీక్షించాడు. హైదరాబాద్‌లో లౌకిక భావనలకు పాదులు వేసిన సూఫీ ప్రవక్తల ఔన్నత్యం గురించి ఈ గ్రంథంలో ప్రస్తావించాడు. "Indian contribution to Islamic Calligraphy", "Ornamentation in Indian epigraphy" వంటి క్లిష్టమైన అంశాలపై కూడా చంద్రయ్య లోతుగా అధ్యయనం చేసి విలువైన రచనలు చేశాడు. దళితుల శ్రమ పునాదిపైనే దేశ ఆర్థిక వ్యవస్థ సుస్థిరంగా నిలబడి ఉందని ప్రతిపాదిస్తూ చంద్రయ్య రాసిన 'Dalit Economics' అముద్రిత గ్రంథం సామాజికశాస్త్ర విద్యార్థులకు సరికొత్త అవగాహన కలిగిస్తుంది. 'భారతీయ సంస్కృతిలో కుల ప్రభావం'పై ఆంగ్లంలో చంద్రయ్య రాసిన పరిశోధనాపత్రాన్ని బూక్యా చినవెంకటేశ్వర్లు తెలుగులోకి అనువదించాడు. మతం, కులం, సంస్కృతుల స్వరూప స్వభావాలను, పరస్పర ప్రభావాన్ని, వాటిననుసరించి మానవాళిని ఆవరించిన చీకటి వెలుగులను ఈ పత్రంలో ఆయన వివేచించాడు. భారతదేశంలో కులం గాలిలో కలిసివుందని, దీని అంటువ్యాధి లక్షణం హిందూ మతాన్ని దాటి ముస్లిం, క్రైస్తవ మతాలకు కూడా సోకిందన్న హెర్బర్ట్ రిస్లే సూత్రీకరణలను ఇందులో చంద్రయ్య సవివరంగా వ్యాఖ్యానించాడు. పదవీ విరమణ తరువాత ప్రముఖ ఆంగ్ల పత్రికల్లో చంద్రయ్య ఎన్నో పరిశోధనాత్మక వ్యాసాలు రాశాడు. ఈ ప్రజా కలెక్టర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా కత్తి కల్యాణ్ రాసిన 'నా అన్వేషణలో కత్తి చంద్రయ్య' అనే పుస్తకం చదివితే వీరి జీవనయానం కొంత వరకు తెలుసుకోవచ్చు.

● డాక్టర్ కోయి కోటేశ్వరరావు
ప్రభుత్వ సిటీ కళాశాల, హైదరాబాద్
(నేడు ఒంగోల్ ఎన్‌టిఆర్ కళాక్షేత్రంలో కత్తి చంద్రయ్య శతజయంతి సభ)



స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తున్న మంత్రి సురేఖ



హనుమకొండ పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఆవిష్కరణ చేస్తున్న మంత్రి కొండా సు రేఖ



గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి సురేఖ



ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నాం

- ఇచ్చిన మాటకు ప్రభుత్వం కట్టుబడి ఉంది..
- సమష్టి కృషితోనే జిల్లా సమగ్రాభివృద్ధి
- రెండు దశల్లో రూ.250కోట్ల రుణమాఫీ
- రూ.944కోట్లతో స్మార్ట్ సిటీ పనులు
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి

హనుమకొండ, ఆగస్టు 15, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, ఆ మేరకు రైతులకు రూ.2లక్షల రుణమాఫీతో సహా ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. గురువారం హనుమకొండ పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మంత్రి సురేఖ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యం, సమష్టి కృషితోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. జిల్లాలో అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ఈ సందర్భంగా ఆమె వివరించారు.

రుణమాఫీ

రుణమాఫీ పథకంలో భాగంగా ఇప్పటి వరకు రెండు విడతలుగా 37,209 మంది రైతులకు రూ.250.18కోట్ల రుణమాఫీ జరిగిందని, మొదటి విడత రూ.లక్షలోపు రుణమాఫీ కింద 25,391 మందికి రూ.141.95 కోట్లు, రెండో విడత కింద రూ.1.50లక్షలలోపు 11,818మంది రైతులకు రూ.108.23 కోట్ల రుణమాఫీ జరిగిందని తెలిపారు. స్వాతంత్ర్యదినోత్సవం స్ఫూర్తితో గురువారం రూ.2లక్షల లోపు రుణమాఫీ కూడా జరుగుతోందన్నారు. రైతు బీమా కింద 419 మంది రైతులు రూ.20.95కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామని తెలిపారు.

చేయూత పెన్షన్లు

జిల్లాలో చేయూత పెన్షన్ పథకం కింద 1,04,448 మంది వృద్ధాప్య, వితంతు, వికలాంగ, చేనేత, కల్లుగీత కార్మికులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, బోధకాలు, ఎయిడ్స్, డయాలసిస్ రోగులకు ప్రతీ నెల రూ. 24.40 కోట్లు పెన్షన్‌గా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. బ్యాంకు లింకేజీ కింద 2024-25గాను 7,685 మహిళా స్వయం సహాయక సంఘాలకుగాను 1435 ఎస్‌హెచ్‌జీలకు రూ.161.83 కోట్లు అందచేసినట్టు తెలిపారు. స్త్రీనిధి పథకం కింద 2024-25కు 570 ఎస్‌హెచ్‌జీలలోని 1279 మంది సభ్యులకు ఇప్పటి వరు రూ.1161 లక్షల రుణం అందించామని మంత్రి సురేఖ వెల్లడించారు. మహిళా శక్తి కార్యక్రమం కింద ఇప్పటి వరకు 208 సంఘాలకు రూ.24.26కోట్లను వివిధ బ్యాంకుల ద్వారా రుణాలుగా అందించామన్నారు. ప్రభుత్వ మెటర్నిటీ ఆస్పత్రి, భద్రకాళి దేవాలయం ఆవరణలో త్వరలో ఇందిర మహిళా శక్తి క్యాంటీన్లను ప్రారంభించనున్నట్టు చెప్పారు.



గత ప్రభుత్వంపై విమర్శలు

మంత్రి కొండా సురేఖ గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు కురిపించారు. ఆయా పథకాల అమలులో గత కేసీఆర్ సర్కార్ వైఫల్యాలను ఎత్తిచూపారు. ఆనవాయితీ ప్రకారం ముందుగానే ముద్రించిన ప్రసంగాన్ని సురేఖ ఒక పక్కనే చదువుతూనే.. దాని నుంచి కాస్త బయటకు వచ్చి ఆయా పథకాలను అమలు చేయడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపారు. గత ప్రభుత్వం విద్య, వైద్యం తదితర రంగాలను పట్టించుకోలేదని, తమ ప్రభుత్వం వాటి విషయంలో చిత్తశుద్ధితో కృషి చేస్తోందని చెప్పుకొచ్చారు. ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు.

వైద్య, ఆరోగ్యం

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అర్హులైనవారందరికీ రూ.10 లక్షల వైద్యసేవలను అందిస్తోందని, 5 ప్రభుత్వ, 37 ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ పథకం అమలవుతోందని, ఇప్పటివరకు 30,6 42 మంది రోగులకు రూ.67.55కోట్ల వ్యయంతో వైద్య సేవలు, మరో రూ.22.79కోట్ల వ్యయంతో 10,681 మంది రోగులకు ఆపరేషన్లు, ఇతర వ్యాధులకు చికిత్స అందచేసినట్టు తెలిపారు.

పట్టణాభివృద్ధి

కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) ఆధ్వర్యంలో విలీన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు 2014 నుంచి 2024 వరకు సుమారు రూ.280కోట్ల వ్యయం చేయగా, 2024-25లో రూ.480.05 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు కార్యప్రణాళికను రూపొందించినట్టు మంత్రి సురేఖ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.30కోట్లతో భద్రకాళి మాఢవీధులు, రూ.74.50 కోట్లతో వరంగల్ బస్‌స్టాండ్, రూ.250కోట్లతో ఆర్‌టీవో ఆఫీసు నుంచి ఏనుమాముల మార్కెట్ వరకు ఇన్నర్ రింగ్‌రోడ్డు, రూ.30కోట్లతో ఉనికిచెర్లలో 135 ఎకరాల్లో మోడల్ లేఅవుట్ అభివృద్ధి చేయనున్నట్టు వివరించారు.

స్మార్ట్ పనులు

స్మార్ట్ సిటీ పథకం కింద రూ.944.67 కోట్లతో 106పనులు చేపట్టామని, ఇందులో రూ.411.96 కోట్లతో 49 పనులు పూర్తయ్యాయని, రూ.413 కోట్లతో

మిగతా 8వ పేజీలో..

మహాలక్ష్మి

మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో 171 ప్రాంతాల్లో 416 ఆర్టీసీ బస్సులను నడుపుతున్నామని, ఎనిమిది నెలల్లో 3.34 కోట్ల మంది మహిళా ప్రయాణికులు ఉచిత రవాణా లబ్ధిపొందారని, రోజుకు సగటున 1,46,063 మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారన్నారు. ఇదే పథకంలో భాగంగా రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామన్నారు. 1,05,600 మంది లబ్ధిపొందుతున్నారని, ఇప్పటివరకు సబ్సిడీ కింద రూ.5.82కోట్లను ఖర్చు చేసిందని మంత్రి సురేఖ తెలిపారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు రూ.2,500 అందించేందుకు కాంగ్రెస్ ప్రణాళిక రూపొందిస్తోందన్నారు.



పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ గీతాలాపన చేస్తున్న ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, అధికారులు, ప్రజలు



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

కేయూలో విచారణల కలకలం రేగుతోంది. అవినీతి, అక్రమాల పేరుతో ప్రొఫెసర్లపై ఎంక్వైరీల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే గత వీసీ రమేశ్‌పై ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు పాల్పడ్డాడని రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించగా, తాజాగా పదేళ్ల కిందట వీసీగా పనిచేసిన బి.వెంకటరత్నంపై కూడా విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌లో ప్రభుత్వ నిబంధనలు పాటించలేదని ఆయనకు అధికారులు ఈనెల 12న నోటీసులు జారీ చేశారు. అన్ని వివరాలతో 16వ తేదీన హాజరుకావాలని కోరారు. అలాగే రిజిస్ట్రార్ మల్లారెడ్డి అర్హతలపై కొందరు రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేయాలని ఇన్‌చార్జి వీసీ కరుణను ప్రభుత్వం ఆదేశించింది.

ఇలా.. వరుస సంఘటనలతో వర్సిటీలో ఎప్పుడు, ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

\- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



విజిలెన్స్‌లు.. విచారణలు..

కేయూలో అవినీతి, అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి

- మాజీ వీసీలపై విజిలెన్స్ విచారణకు ఆదేశం
- ఉద్యోగుల రెగ్యులరైజ్‌పై మాజీ వీసీ వెంకటరత్నంకు నోటీసులు
- ఇప్పటికే మాజీ వీసీ రమేష్‌పై వెల్లువెత్తిన ఆరోపణలు
- తాజాగా రిజిస్ట్రార్ మల్లారెడ్డి అర్హతలపైనా విచారణ
- వరుస సంఘటనలతో మసకబారుతున్న వర్సిటీ ప్రతిష్ఠ

7 లో..

ఆగని జూడాల నిరసన

వరంగల్ మెడికల్, ఆగస్టు 15: ఆర్‌జీకేఏఆర్ మెడికల్ కళాశాలకు చెందిన పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన ఘాతుకాన్ని నిరసిస్తూ జూడాలు, వైద్య విద్యార్థులు నిర్వహిస్తున్న నిరసన రెండో రోజు సైతం వెల్లువెత్తింది. ఆర్‌జీకేఏఆర్ మెడికల్ కాలేజీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిపై కొందరు దుండగులు దాడి చేయడాన్ని నిరసిస్తూ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎంజీఎం సెంటర్ వద్ద జూనియర్ డాక్టర్లు, కేఎంసీ వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు మానవహారంగా ఏర్పడిన నిరసన వ్యక్తంచేశారు. నిందితులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వైద్య విద్యార్థుల ఆందోళనకు వరంగల్ ఐఎంఏ సంఘీభావం ప్రకటించింది.



ఎంజీఎం సెంటర్‌లో విద్యార్థుల మానవహారం

కార్మిక, ప్రజా వ్యతిరేక విధాలను అడ్డుకోవాలి..

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్
- హనుమకొండ చౌరస్తాలో జన జాగరణ సభ



జన జాగరణ సభలో మాట్లాడుతున్న రాగుల రమేష్

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 15: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకుని ఐక్యంగా ప్రతిఘటించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగులు రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి హనుమకొండ చౌరస్తాలో ఏఐఏడబ్ల్యూ జిల్లా అధ్యక్షుడు సారంపల్లి వాసుదేవరెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య అధ్యక్షతన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన జన జాగరణ సభలో రాగులు రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 11 ఏళ్ల బీజేపీ పాలనలో ప్రజా సంపదను లూటీ చేస్తూ కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం ఇప్పటికే రైల్వే, విమానాశ్రయాలు, రోడ్లు, ఓడ రేవులు, ఖనిజ సంపద బహుళజాతి సంస్థలకు కారు చౌకగా అమ్మేస్తోందని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా 44కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కార్మిక కోడ్‌లను అమలు చేయడంతో పాటు దేశ రైతాంగానికి స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు మద్దతు ధర ఇవ్వకుండా రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలను తీసుకురావడం దుర్మార్గమన్నారు.

కాగా, బుధవారం రాత్రి 9గంటలకు ప్రారంభమైన జన జాగరణ సభ.. గురువారం తెల్లవారుజామున 3గంటల వరకు స్వాతంత్ర్య పోరాటాలను గుర్తు చేసుకుంటూ కేంద్ర పాలకులు అవలంబిస్తున్న విధానాలపై ఆట పాటలతో సభ కొనసాగింది. ఈ సమావేశంలో జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణి, ఏఐఏడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడిరాజుల రాములు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.దీప, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వాంకుడోత్ వీరన్న, డీవైఎస్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి, మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గొడుగు వెంకట్, ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బండి పర్వతాలు, తెలంగాణ రజక సంఘం జిల్లా కార్యదర్శి కంచర్ల కుమారస్వామి, సిఐటీయు జిల్లా ఆఫీస్ బేరర్స్ పుల్లా అశోక్, బొల్లారం సంపత్, తదితరులు పాల్గొన్నారు.

రుచి లేని ఆహారం ఎలా తినాలి?

● కాకతీయ యూనివర్సిటీ మెస్ వద్ద విద్యార్థుల ఆందోళన ● రిజిస్ట్రార్ మల్లారెడ్డితో వాగ్వాదం

కేయూక్యాంపస్, ఆగస్టు 15: కాకతీయ యూనివర్సిటీ మెస్‌లో రుచి లేని ఆహారాన్ని పెడుతున్నారని ఆరోపిస్తూ గురువారం కామన్ మెస్ ఎదుట విద్యార్థులు ఆందోళనకు దిగారు. వర్సిటీ ఉన్నతాధికారులకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ మంద శ్రీకాంత్ నేతృత్వంలో బైఠాయించి నిరసన చేశారు. వంట పాత్రలు, ఖాళీ ప్లేట్లు, మెస్ డబ్బాలతో కామన్ మెస్ నుంచి వర్సిటీ మొదటి గేటు వరకు ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా మంద శ్రీకాంత్ మాట్లాడుతూ.. 10 రోజుల కిందటే వర్సిటీ హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదని విన్నవించినప్పటికీ పట్టించుకోలేదని ఆరోపించారు. ఉడకని అన్నం విద్యార్థులు తినలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.



రిజిస్ట్రార్ మల్లారెడ్డితో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ సెక్రటరీ మంద శ్రీకాంత్, తదితర విద్యార్థులు



కేయూ మెస్ వద్ద భోజనం డబ్బాలతో నిరసన చేస్తున్న విద్యార్థులు

విషయం తెలుసుకున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, హాస్టల్స్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్‌లు విద్యార్థులను సముదాయించారు. మెస్‌లో నాణ్యత పెంపొందించేలా విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ వర్సిటీ అధ్యక్షుడు పురుషోత్తం, సాయికుమార్, ఉపాధ్యక్షుడు బిరెడ్డి జస్వంత్, సహాయకార్యదర్శి పరిమిళ, కుమ్మరి శ్రీనాథ్, వివేక్, రత్నం, అఖిల్, హాతిరాం, రత్నాకర్, హరిస్వాటిల్, భరద్వాజ్, ప్రవీణ్, నాగు, కల్యాణ్, పృథ్వీరాజ్, వేణు, రాకేశ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ లారీ డ్రైవర్ మృతి

ఎల్కతుర్తి, ఆగస్టు 15: ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన మంతుర్తి అనిల్ (30)అనే లారీ డ్రైవర్ మద్యం మత్తులో పురుగుల మందు తాగగా గురువారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. మృతుడు రెండు సంవత్సరాలుగా మద్యానికి బానిసై ఇంటి వద్దనే ఉంటున్నాడు. కాగా, ఈ నెల 10వ తేదిన అతిగా మద్యం సేవించి మద్యం మత్తులో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. ఇంటికి వచ్చిన అనిల్ అపస్మారక స్థితిలోకి వెళ్లగా గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ అనిల్ మృతి చెందాడు. మృతుడి తండ్రి సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య శైలజ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కొత్తపల్లి పంచాయతీలో ఎగరని జెండా

విస్మరించిన గ్రామపంచాయతీ కార్యదర్శి, ప్రత్యేకాధికారి



కొత్తపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం

కొత్తగూడ, ఆగస్టు 13 : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీలో జాతీయ జెండా ఎగరలేదు. కార్యదర్శి విస్మరించడంపై గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పంద్రాగస్టును పురస్కరించుకొని గురువారం అన్ని కార్యాలయాల్లో జాతీయ జెండాను అధికారులు ఎగురవేశారు. అయితే కొత్తపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో మాత్రం ఎగురవేయలేదు. ఈ సమాచారంతో జీపీ కార్యాలయం నుంచే పంచాయతీ కార్యదర్శి స్వాతికి ఫోన్‌చేసి వివరణ కోరగా, తన తల్లి అనారోగ్యంతో ఉండగా ఆస్పత్రికి వచ్చినట్టు పేర్కొన్నారు. జీపీ ఆవరణలో ఉండే పాఠశాల జెండానే గ్రామపంచాయతీ జెండాగా భావించామని, జీపీ ఖర్చులతో స్కూల్ జెండానే ఎగురవేశామని కార్యదర్శి వివరించారు. పాఠశాల ఉపాధ్యాయుడు సువర్ణపాక జగ్గారావును వివరణ కోరగా స్కూల్ ఖర్చులతోనే ఉపాధ్యాయులే ఆవిష్కరించారని పేర్కొన్నారు. కాగా, 12గంటల తర్వాత జెండాను గ్రామ ప్రత్యేకాధికారి, ఎదుళ్లపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గుమ్మడి లక్ష్మీనారాయణ ఆవిష్కరించినట్టు జీపీ కార్యదర్శి వివరించారు. ఈ విషయమై ఎంపీవో రామకృష్ణను వివరణ కోరగా, స్థానిక కార్యదర్శి సెలవులో ఉన్నారని, అయినా ప్రత్యేకాధికారి జెండావిష్కరణ చేయాలని పేర్కొన్నారు. ఎంపీడీవో రవీంద్రప్రసాద్‌ను వివరణ కోరగా కార్యదర్శికి ఎవరూ సెలవు ఇవ్వలేదన్నారు. ఇదిలా వుండగా, జాతీయ జెండాను అవమానించిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కింద పడ్డ జాతీయ జెండా

డోర్నకల్ ఎంపీడీవో కార్యాలయంలో ఘటన



డోర్నకల్‌లో నేలవాలిన జాతీయ జెండా

డోర్నకల్, ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయా జెండాకు అవమానం జరిగింది. డోర్నకల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం జాతీయ జెండాను మండల ప్రత్యేక అధికారి నర్సింహామూర్తి ఎగురవేశారు. జెండాను ఎగురవేసిన తర్వాత తాడును వదిలివేయడంతో జెండా నేలపై పడింది. రెండు సెకన్ల తర్వాత జరిగిన పొరపాటును గ్రహించిన ప్రత్యేక అధికారి నర్సింహామూర్తి, ఎంపీడీవో శ్రీనివాసరావు వెంటనే తాడును లాగి మళ్లీ జాతీయ జెండాను ఎగురవేశారు. ప్రజలు, నాయకుల సమక్షంలోనే ఈ ఘటన చోటు చేసుకోవడంతో అందరు అవాక్కయ్యారు. జాతీయ జెండా నేలపై పడిన దృశ్యాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

బెల్టు షాపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు

వరంగల్ క్రైం, ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం షాపులను బంద్ నేపథ్యంలో పలు మద్యం వ్యాపారులు బెల్టు షాపులతో ఒప్పందం చేసుకున్నారు. బుధవారం అర్ధరాత్రి తర్వాత జంట నగరాల్లోని పలు మద్యం షాపుల నుంచి రూ.లక్షల విలువచేసే మద్యాన్ని బెల్టు షాపులకు తరలించారు. గురువారం అధిక ధరలకు విక్రయించేందుకు పలువురు బెల్టుషాపుల్లో నిల్వ చేసినట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వడ్డెపల్లిలో పెసరు రాజ్‌కుమార్ నివాసంలో నిల్వ ఉంచిన రూ.77వేల మద్యం, వడ్డెపల్లి ప్రాంతంలోని మరో చోట ఎం.రమాదేవి నివాసంలో రూ.50వేల మద్యం స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం సుబేదారి పోలీసులకు అప్పగించారు. కాగా, మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాకరాసికుంటకు చెందిన రాజు నివాసంలో రూ.2లక్షల 86వేల మద్యం స్వాధీనం చేసుకున్నారు. రాజును విచారణ నిమిత్తం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ధృవీకరించారు.

విజిలెన్స్‌లు.. విచారణలు..

● కేయూలో అవినీతి, అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి ● ఇద్దరు మాజీ వీసీలు, రిజిస్ట్రార్ మల్లారెడ్డి అర్హతలపైనా విచారణ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాకతీయ యూనివర్సిటీ ప్రక్షాళనపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. అధ్యాపకుల నియామకాలలో అవినీతి, అక్రమాలతోపాటు కోట్లాది రుపాయల యూనివర్సిటీ భూముల అక్రమణలు, నిధులు దుర్వినియోగంపై ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ వీసీలపై విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అలాగే విద్యార్హతలపై ప్రస్తుత రిజిస్ట్రార్‌పై విచారణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయటం కేయూలో కలకలం రేపుతోంది. మరోవైపు కేయూకు పూర్తిస్థాయి పాలక మండలి నియామకంతో పాటు వైస్ చాన్సలర్ నియామకం కోసం సెర్చ్‌కమిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అయితే ఇక్కడివరకు బాగానే ఉన్నప్పటికీ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు పీహెచ్‌డీ అడ్మిషన్ల వివాదంపై ఎటూ తేల్చకపోవటంతో విద్యార్థుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

మాజీ వీసీలపై విజిలెన్స్

2013-15లో కాకతీయ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్‌గా పనిచేసిన వెంకటరత్నంపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేయడం కేయూలో కలకలం రేపుతోంది. 2013లో వీసీగా ఉన్న వెంకటరత్నం అప్పటి ప్రభుత్వం అనుమతి లేకుండా కాకతీయ యూనివర్సిటీలో కనీస కాల పరిమితి కలిగిన ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయటంపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో హైదరాబాద్ విజిలెన్స్ అధికారుల ఆదేశాల మేరకు వరంగల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఈనెల 12వ తేదీన మాజీ వీసీ వెంకటరత్నంకు నోటీసులు పంపించారు. ఈనెల 16వ తేదీ శుక్రవారం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన డాక్యుమెంట్లతో వరంగల్‌లోని విజిలెన్స్ కార్యాలయానికి రావాలని ఆ నోటీసులో సూచించారు. దీంతో పదేళ్ల కిందట రెగ్యులరైజ్ చేసిన సంఘటనకు సంబంధించి ప్రభుత్వం విజిలెన్స్‌వ విచారణకు ఆదేశాలు జారీ చేయటం కేయూలో కలకలం రేగుతోంది. అలాగే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వైస్‌చాన్సలర్‌గా పనిచేసిన రమేష్‌పై పలు ఆరోపణలు రావటంతో ప్రభుత్వం విచారణకు ఆదేశాలు జారీ చేసింది. మే 21న కేయూ వైస్ చాన్సలర్‌గా ఉద్యోగ విరమణ చేయనుండగా, ప్రభుత్వం మే 18వ తేదీనే రమేష్‌పై విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేయటం యూనివర్సిటీలో తీవ్ర కలకలం రేగింది.

రిజిస్ట్రార్‌పై విచారణ

కేయూ ప్రస్తుత రిజిస్ట్రార్ మల్లారెడ్డిపై ప్రభుత్వం విచారణకు ఆదేశాలు జారీ చేసింది. ప్రొఫెసర్ మల్లారెడ్డి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అనుభవం, అర్హతలు లేకుండానే అసోసియేట్ ప్రొఫెసర్‌గా కేయూ నియమించిందని, అప్పటి అధికారులు నిబంధనలను ఉల్లంఘించి పదోన్నతి కల్పించారని హనుమకొండకు చెందిన కేఎన్.రెడ్డి అనే వ్యక్తి ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి, ఉన్నతావిద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. రిజిస్ట్రార్‌గా మల్లారెడ్డికి ఎలాంటి టీచింగ్ అనుభవం, అర్హతలు లేవని, దీనిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో కోరారు. దీనిపై విచారణ చేపట్టాలని ప్రభుత్వం కేయూ ఇన్‌చార్జి వైస్‌చాన్సలర్‌ను ఆదేశించింది. దీంతో రిజిస్ట్రార్ మల్లారెడ్డిపై వాకాటి కరుణ విచారణ చేపట్టనున్నారు. ఇలా.. వరుసగా కేయూలో అక్రమాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తుండటంతో చర్చనీయాంశంగా మారింది.

ఈసీ, వీసీ నియామకాలు, సమస్యలపై దృష్టి

కాకతీయ యూనివర్సిటీని క్షేత్రస్థాయిలో పటిష్ఠం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెట్టింది. ప్రధానంగా కాకతీయ యూనివర్సిటీకి పూర్తిస్థాయి పాలక మండలి(ఈసీ)ని ఇటీవలే ప్రభుత్వం నియమించింది. కేయూకి ఈసీ రావటంతో పాటు ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ అధ్యక్షతన ఇటీవల హైదరాబాద్‌లో కేయూలోని సమస్యలపై ఈసీ చర్చించింది. పీహెచ్‌డీ అడ్మిషన్లను కొనసాగించాలని నిర్ణయించారు. అయితే ఈసీతో పాటు శాశ్వత వైస్‌చాన్సలర్‌ను కూడా నియమించాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీని కోసం సెర్చ్ కమిటీని ఏర్పాటు చేసేందుకు ఈసీ నుంచి ఒకరిని సూచించాలని ప్రభుత్వం కోరింది. త్వరలోనే సెర్చ్ కమిటీ వేసి కేయూకి వైస్ చాన్సలర్‌ను కూడా నియమించే అవకాశాలున్నాయనే చర్చ జరుగుతోంది.

విద్యార్థుల సమస్యలు

కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా పీహెచ్‌డీ అడ్మిషన్లపై త్వరగా తేల్చాలని విద్యార్థులు కోరుతున్నారు. హస్టళ్లలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, నాణ్యమైన భోజనం అందించాలని కోరుతున్నారు. అలాగే హస్టళ్ల స్లాబ్‌పై నుంచి ఫ్యాన్ ఊడిపడటం, బిచ్చలు విరిగి పడటంతో విద్యార్థినులకు గాయాలయ్యాయి. ఇలాంటి సంఘనలు పునరావృతం కాకుండా చూడాలని విద్యార్థుల కోరుతున్నారు. వీటిపై కూడా ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఆరోపణలు ఇవీ..

- కాకతీయ యూనివర్సిటీకి కేటాయించిన భూముల్లో వందల ఎకరాల భూములు అధికారుల నిర్లక్ష్యంతో కబ్జాకోరుల్లోకి వెళ్లాయి. కేయూకు సంబంధించిన 229 సర్వే నెంబరులో కేయూ ఉద్యోగులతో పాటు మరికొంతమంది సుమారు 12ఎకరాల భూములను అక్రమంగా కబ్జా చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. దీనిపై విద్యార్థులు, అధ్యాకులు ఆందోళన చేయటంతో 13మందికి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- పీహెచ్‌డీ అడ్మిషన్లలో అక్రమాలు జరిగాయని 2023 సెప్టెంబరు నెలలో విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఇప్పటి వరకు పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అక్రమాలపై యూనివర్సిటీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు.
- ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ఫీజుల పేరుతో సుమారు రూ.5కోట్లు స్వాహా చేసినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. అలాగే కేయూలో అడ్జంట్ ప్యాకల్టీ (అనుబంధ అధ్యాపకులు)ని నిబంధనలకు విరుద్ధంగా నియమించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- సెలక్షన్ కమిటీ లేకుండా కేయూలో 2023 జనవరి 30న 12మందిని, మార్చిలో నలుగురిని కలిపి మొత్తం 16మందిని పాలక మండలి అనుబంధ అధ్యాపకులుగా నియమించటంపై విమర్శలు ఉన్నాయి.
- కేయూలో సీడ్‌మనీ పేరుతో నకిలీ పరిశోధన ప్రాజెక్టులతో రూ.20లక్షలకు పైగా నిధులు స్వాహ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆరుగురు ప్రొఫెసర్లతో కలిసి సీడ్‌మనీ పేరుతో జరిగిన ఈ అక్రమాలపై విచారణ జరిపించాలని అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్ (అకుట్) బృందం డిమాండ్ చేసిన స్పందన లేదు.
- మెస్ బిల్లుల పేరుతో యూనివర్సిటీలో రూ.2.50కోట్ల స్కామ్ జరిగినట్లుగా ప్రచారం జరుగుతోంది. దీనిపై ఫిర్యాదులు వచ్చిన గత వీసీ పట్టించుకోలేదనూ ఆరోపణలు ఉన్నాయి.
- కేయూ పరిధిలో మొత్తం 24 ఫార్మసీ కాలేజీలు ఉన్నాయి. అయితే గత విద్యాసంవత్సరం 12 కాలేజీలు డీఫార్మసీ కోర్సును ప్రవేశపెట్టేందుకు అనుమతులు కోరుతూ యూనివర్సిటీకి దరఖాస్తు చేసుకోగా, వీటిలో ఆరు ఫార్మసీకాలేజీలకు మాత్రమే అర్హత ఉండగా, మిగతా ఆరు కాలేజీలకు ఎలాంటి అనుబంధ వైద్యశాలలు లేకపోయినప్పటికీ యూనివర్సిటీ అనుమతులు ఇవ్వటం వివాదస్పదంగా మారింది.
- అసోసియేట్ ప్రొఫెసర్ల, సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు కూడా ఉన్నాయి.



పెద్దతండాలో ఏర్పాటుచేసిన గిరిజన బతుకమ్మ తల్లి విగ్రహం

గిరిజన బతుకమ్మ విగ్రహం ఏర్పాటు

రాష్ట్రంలోనే తొలిసారి పెద్దతండాలో ప్రారంభం

పర్వతగిరి, ఆగస్టు 15: ఇన్నాళ్లూ బతుకమ్మతల్లి విగ్రహాలనే చూశాం. నెత్తిన బతుకమ్మతో తల్లి నడుస్తుండగా పక్కన తన కూతురిని సైతం బతుకమ్మ చేతబూని తీసుకెళ్లే విగ్రహాలున్నాయి. కానీ, గిరిజన బతుకమ్మ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు గిరిజనులు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని పెద్దతండాకు చెందిన గిరిజనులు ప్రతీఏటా తీజ్ పండుగ ఉత్సవాలను జరుపుకుంటుంటారు. దీనిలో భాగంగా గోధుమ బుట్టలను తీసుకెళ్లి స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేస్తారు. హిందువులు బతుకమ్మలను నిమజ్జనం చేసే చోట బతుకమ్మ తల్లి విగ్రహాన్ని ఏర్పాటుచేసి అక్కడ బతుకమ్మలతో ఆడిపాడి అనంతరం నిమజ్జనం చేస్తారు. అచ్చం అదేవిధంగా బతుకమ్మ ఆడడానికి గాను పెద్దతండావాసులు గిరిజన బతుకమ్మ తల్లి వేషధారణలో ఉన్న విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారుచేయించారు. గిరిజన వేషధారణలో తల్లి నెత్తిన గోధుమ బుట్ట (తీజ్)ను ఎత్తుకోగా, పక్కన కూతురు చేత్తో తీజ్‌బుట్టను పట్టుకుని నడుస్తున్నట్టుగా ఉంది. తండావాసులు ఏర్పాటు చేసిన విగ్రహాన్ని గురువారం ప్రారంభించారు. రాష్ట్రంలోనే తొలిసారిగా గిరిజన బతుకమ్మ తల్లి విగ్రహం ఏర్పాటు చేయడంతో పలువురు వచ్చి ఆసక్తిగా తిలకిస్తున్నారు.

ఉత్సవ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా వేణుగోపాల్‌గౌడ్

వడ్డెపల్లి, ఆగస్టు 15 : సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్ జయంతి ఉత్సవ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా హనమకొండ పట్టణానికి చెందిన గౌడ సామాజిక వర్గానికి చెందిన వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ నియమితులయ్యారు. బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఉన్న వేణుగోపాల్‌గౌడ్ బహుజనుల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారు. ఈ నెల 18న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా చేపడుతున్న సర్దార్ సర్వాయిపాపన్న జయంతి ఉత్సవ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా వేణుగోపాల్‌గౌడ్‌కు అవకాశం లభించింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశం గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

మూడో విడత రుణమాఫీ విడుదల

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 15: రాష్ట్ర ప్రభుత్వం మూడో విడత రుణమాఫీ చేసింది. ఈ మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో 44.462 మంది రైతులకు రూ.735.29కోట్ల రుణం మాఫీ అయింది. కాగా, ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత విడతల వారిగా రుణ మాఫీ చేస్తూ వచ్చింది. ఇప్పటికే మొదటి విడుతలో రూ.లక్ష, రెండో విడతలో లక్షన్నర వరకు రుణమాఫీ చేసింది. గురువారం చివరగా మూడో విడతలో రూ.రెండు లక్షల వరకు రుణమాఫీని ప్రకటించింది. దీంతో రాష్ట్రంలో రెండు లక్షల వరకు రుణం తీసుకున్న రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో రుణమాఫీ ఇలా..

జిల్లా	అకౌంట్లు	కుటుంబాలు	రూ.కోట్లలో
హనుమకొండ	9506	7451	రూ.122.40
వరంగల్	9378	6843	రూ.112.51
భూపాలపల్లి	7670	6258	రూ.103.75
జనగామ	11064	8759	రూ.145.33
మహబూబాబాద్	14253	11322	రూ.188.00
ములుగు	4833	3829	రూ.63.30



మహమూద్‌పట్నంలో ధరలు తగ్గడంతో పారబోసిన బెండకాయలను చూపుతున్న ఎల్లయ్య

రూ.2.25కు కిలో బెండకాయ..!

రవాణాచార్జీలు రావని చెల్కవద్దనే పారబోసిన రైతు

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 15: బెండకాయ సాగు చేసిన రైతుకు గిట్టుబాటు ధర దక్కకపోవడంతో తన చెల్కవద్దనే పారబోసి న ఘటన గురువారం చోటు చేసుకుంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని మహమూద్‌పట్నంలో ఏశబోయిన ఎల్లయ్య ఎకరం విస్తీర్ణం లో బెండకాయ, మరో ఎకరంలో వంకాయ సాగు చేస్తున్నాడు. బెండకాయలు విక్రయించేందుకు హోల్‌సేల్ వ్యాపారికి ఫోన్‌చేయగా 22 కిలోల బస్తాను కిలో రూ.2.25ల చొప్పున రూ.50లకు అడిగాడు. దీంతో అసహనంతో రెండు క్వింటాళ్ల బెండకాయలను తనచెల్క వద్ద పారబోశాడు. అలాగే 22 కిలోల వంకాయలను రూ.220కి అడుగుతున్నారని వాపోయాడు. ఈ ధరలతో కూలీలు, రవాణా ఖర్చులు రావని చెల్కవద్దనే పారబోసినట్లు ఎల్లయ్య తెలిపాడు.

వరాలనిచ్చే తల్లీ.. 'వరలక్ష్మి..'

● నేడు సామూహిక వరలక్ష్మి వ్రతాలు

● ఇంటింటా, ఆలయాల్లో వ్రతాల ఆచరణ



వరంగల్ కల్చరల్, ఆగస్టు 15: శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతానికి మహిళలందరూ సిద్ధమయ్యారు. ఈ మేరకు నగరంలోని పలు ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారాన్ని వరలక్ష్మి వ్రతంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. వరాలు ఇచ్చే దేవతగా వరలక్ష్మిని కొలుస్తారు. అమ్మవారి వ్రతాన్ని శ్రావణ మాసంలో వివాహమైన మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరించుకుంటారు. హిందూ మహిళలు తమ సౌభాగ్యాన్ని కాపాడుకోవడానికి తగిన మార్గాన్ని ఉపదేశమించమని పార్వతి దేవి పరమ శివుడిని కోరగా వరలక్ష్మి వ్రతం గురించి పరమశివుడు వివరించగా ప్రతీ ఏడాది ముత్తైదువలం దరు ఈ వ్రతాన్ని ఆచరించుకోవాలని తెలిపాడని నానుడి. అష్టలక్ష్మి ఆరాధన ఎంతటి ఫలమిస్తుందో.. వరలక్ష్మి వత్రం చేపట్టడం కూడా అంతే ఫలాన్నిస్తుందని ధార్మిక గ్రంథాలు పేర్కొంటున్నాయి.

ఆలయాల్లో సామూహికంగా వరలక్ష్మి వ్రతాలు

శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని పౌర్ణమి ముందుగా వచ్చే శుక్రవారం రోజున సామూహికంగా వరలక్ష్మి వ్రతాలు నిర్వహించుకోవడానికి ఎంజీఎం సెంటర్‌లోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఏర్పాట్లు చేశారు. శుక్రవారం సందర్భంగా నగరంలోని శ్రీభద్రకాళి ఆలయం, బట్టలబజార్‌లోని శ్రీవెంకటేశ్వర ఆలయం, వరంగల్ చౌరస్తాలోని గీతాభవన్, స్టేషన్‌రోడ్డులోని ఆకారపువారి గుడి, వాసవీమాత దేవాలయం, హంటర్‌రోడ్డులోని శ్రీసంతోషిమాత దేవాలయం, ములుగురోడ్‌లోని దత్తక్షేత్రంతో పాటు పలు దేవాలయాల్లో పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

పూజా సామగ్రితో సర్వం సిద్ధం

నూతన వస్త్రాలు ధరించి వ్రతానికి కావాల్సిన పూలు, పండ్లు, ప్రసాదాలు, తమలపాకులు, గాజులు, పోక కర్జూరపండ్లు, జాకెట్ ముక్కలు, కొబ్బరికాయలు, రక్షా తోరణాలు, కలశముతో ఏర్పాటు చేసుకొని మహిళలు వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించుకుంటారు. వ్రతం అనంతరం బంధు మిత్రులను ఇరుగు పొరుగు వారిని పసుపు కుంకుమ బొట్టు కోసం పిలిచి వాయినాలు ఇచ్చి ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పొందుతారు.

పూలు, పండ్లకు భలే గిరాకీ..

వరలక్ష్మి వ్రతం అనగానే మొదట గుర్తుకొచ్చేది పూలు, పండ్లు, కొబ్బరికాయలు. ప్రతీ ఒక్కరు వ్రతానికి కావల్సిన పూలు, పండ్లను కొనుగోలు చేస్తారు. ఇప్పటికే పూల ధరలు అధికంగా ఉండడం.. దీనికి తోడు వరలక్ష్మి వ్రతం కావడంతో చామంతి కిలో రూ.400, గులాబీ కిలో రూ.300, లిల్లీ పూలు కిలో రూ.300, మల్లెపూలు కిలో రూ.800 అధిక ధరలు పలుకుతున్నాయి. అరటిపండ్లు కూడా డజన్‌కు రూ.60 నుంచి రూ.80 వరకు పలుకుతున్నాయి. బత్తాయి, ఆపిల్, దానిమ్మపండ్లు సీజన్ ప్రారంభం కావడంతో సైజును పట్టి విరివిగా మార్కెట్లో అందరికి అందుబాటులో ఉన్నాయి. వరలక్ష్మి వ్రతాలు కావడంతో పెద్దసంఖ్యలో మహిళలు పూజా సామగ్రి కొనుగోలుతో మార్కెట్‌లోని ప్రాంతాలు కిటకిటలాడాయి.



రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

రైతుల రుణం తీర్చుకున్న రేవంత్‌రెడ్డి: మార్నేని

హనుమకొండ సిటీ, ఆగస్టు 15: రూ.2లక్షల రుణమాఫీ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని రైతుల రుణం తీర్చుకున్నారని రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఉద్ఘాటించారు. రూ.2లక్షల రుణమాఫీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం హనుమకొండ ఆర్ట్స్ కళాశాల మైదానంలో మార్నేని రవీందర్‌రావు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపే కార్యక్రమాన్ని నిర్వహించారు. రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఆయన క్షీరాభిషేకం చేశారు.

సంపత్‌రావుకు ప్రశంసా పత్రం అందజేత



సంపత్‌రావుకు ప్రశంసా పత్రం అందిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 15: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో ఇండియన్ అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ కాజేసీ (ఏఎస్‌సీఐ) ద్వారా సెప్టిక్ ట్యాంక్‌ల క్లీనింగ్ చేసి ఎఫ్ఎస్‌టీపీకి పంపించి విశిష్ట సేవలందించినందుకు గాను ఢిల్లీ సంపత్‌రావును మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అభినందించారు. గురువారం బల్దియా కార్యాలయంలో జరిగిన 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో మేయర్, కమిషనర్ చేతుల మీదుగా ప్రశాంసాపత్రాన్ని అందుకున్నారు.

యాంటీ ర్యాగింగ్ పోస్టర్ ఆవిష్కరణ

కేయూ క్యాంపస్, ఆగస్టు 15: కేయూ పరిపాలన భవనంలోని రిజిస్ట్రార్ చాంబర్‌లో గురువారం యాంటీ ర్యాంగింగ్ పోస్టర్‌ను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, వర్సిటీ అకడమిక్ డీన్ ప్రొఫెసర్ జి.హన్మంతు, స్పోర్ట్స్ సెక్రటరీ ప్రొఫెసర్ టి.సవితాజ్యోత్స్న, హాస్టల్స్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, అకుట్ సెక్రటరీ, జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ మామిడాల ఇస్తారీ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ

ఐనవోలు, ఆగస్టు 15: ఐనవోలు ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించి ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు పాఠశాల విద్యార్థులకు రూ.25వేల విలువచేసే టిషర్ట్స్ లోయర్స్ పంపిణీ చేశారు. గురువారం పాఠశాలలో జెండా ఆవిష్కరణ కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మార్నేని ఉదయభానురావు రూ.15వేలు, సముద్రాల సమ్మయ్య రూ.10,116వేలు అందజేశారు. అదేవిధంగా ఎలిగం శ్యామ్ ఇండిగో కలర్ 25లీటర్లు అందించారు. మొత్తం రూ.25వేలతో ఖరీదు చేసిన టీషర్ట్స్, లోయర్స్‌ను విద్యార్థులకు బహూకరించారు.

శానిటేషన్ కార్మికులకు ఘనంగా సన్మానం



పెట్టెం సాంబయ్య ను సన్మానిస్తున్న నాయకులు

మడికొండ, ఆగస్టు 15: మడికొండలోని టీఎన్‌జీవోస్ కాలనీ అధ్యక్షుడు పెట్టెం సాంబయ్య స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం 44వ డివిజన్‌కు చెందిన మునిసిపల్ సిబ్బందికి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు సాంబయ్యను శాలువా కప్పి సత్కరించారు.



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న వినయభాస్కర్



జెండాకు సెల్యూట్ చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ



హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పాల్గొన్న రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు



బల్దియాలో జెండా వందనం చేస్తున్న మేయర్, కమిషనర్

ఘనంగా స్వాతంత్య్ర వేడుకలు

హనుమకొండ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వరంగల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హంటర్ రోడ్డులోని రైస్ మిల్లర్స్ సోసియేషన్ భవనంలో గురువారం 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అసోసియేషన్ అధ్యక్షుడు తోట సంపత్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో 150 మంది రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు. ఇదే అసోసియేషన్ భవనంలో హనుమకొండ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కూడా స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రబెల్లి వెంకటేశ్వర్ రావు, పతాకావిష్కరణ గావించారు. ఈ కార్యక్రమంలో 150 మంది రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకొని వరంగల్ క్రిష్ణకాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రియేట్స్ ఎన్‌జీవోవారు విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. క్రియేట్స్ ఎన్‌జీవో ప్రధాన కార్యదర్శి గడ్డం భాస్కర్, ఉపాధ్యక్షుడు ఎంఎన్ మూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విజేతలకు నగదు బహుమతులు అందచేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంప అశోక్ కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ బండి సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

● కేయూ క్యాంపస్: కేయూ పరిపాలన భవనం ఎదుట స్వాతంత్య్ర వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా మువ్వన్నెల జాతీయ జెండాను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఎగరవేశారు. ఈ సందర్భంగా వివేచన 19వ మ్యాగ్జిన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులతో పాటు వర్సిటీ ఉన్నతాధికారులు, ఉద్యోగులు, పరిశోధకులు తదితరులు పాల్గొన్నారు.

● రాంనగర్: హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకల్లో జిల్లా పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కమిషనర్ అంబర్ కిషోర్ ఝా జాతీయ పతాకాన్ని ఆవిష్కరంచారు. పోలీస్ అధికారులతో కలిసి జాతీయ జెండాకు గౌరవ వందనం చేశారు. ఈ వేడుకల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది కుటుంబసభ్యులతో పాల్గొన్నారు.

● వరంగల్ ఎడ్యుకేషన్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నిట్ క్యాంపస్‌లో డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి జెండాను ఎగురవేశారు. అనంతరం సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి జెండాను ఎగురవేశారు. వరంగల్ డీఈవో కార్యాలయంలో డీఈవో డి.వాసంతి జెండాను ఎగురవేయగా, హనుమకొండ డీఈవో కార్యాలయంలో ఇన్‌చార్జి డీఈవో శ్రీనివాస్ జెండాను ఎగురవేశారు. ములుగురోడ్‌లోని వరంగల్ ఉపాధికల్పన కార్యాలయంలో ఉపాధి అధికారి ఉషారాణి జెండాను ఎగురవేయగా, హనుమకొండ ఉపాధి కార్యాలయంలో అధికారి మల్లయ్య జెండాను ఎగురవేశారు. పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయంలో ఆర్జేడీ కె.సత్యనారాయణరెడ్డి జెండాను ఎగురవేశారు. అనంతరం సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. వరంగల్ డీఐఈవో కార్యాలయంలో డీఐఈవో డాక్టర్ జి.శ్రీధర్‌సుమన్ జెండాను ఎగురవేయగా, హనుమకొండ డీఐఈవో కార్యాలయంలో డీఐఈవో ఎ.గోపాల్ జెండాను ఎగురవేశారు. ఇంటర్ ఆర్జేడీ కార్యాలయంలో ఆర్జేడీ జయప్రదబాయి జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ డీఐఈవో ఎ.గోపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఎంజేపీ ఆర్‌సీవో కార్యాలయంలో ఆర్‌సీవో మనోహర్‌రెడ్డి జెండాను ఎగురవేశారు.

● హనుమకొండ సిటీ: హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జీడబ్ల్యూఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు శ్రీమాన్, రజాలీ విజయశ్రీ, మామిండ్ల రాజు, రాములుతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

● హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా జరిగాయి. డీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వరరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్, డీజీఎం అశోక్, ఏజీఎం మధు, బోడ రాజు, స్రవంతి తదితర బ్యాంకు మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

● హనుమకొండ కలెక్టరేట్: హనుమకొండలోని కలెక్టరేట్ సమీకృత కార్యాలయాల సముదాయంలో స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ వేడుకలలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి విద్యాలత, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

● హనుమకొండ చౌరస్తా: జిల్లా పెయింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వతంత్య్ర వేడుకలు ఘనం గా జరిగియి. హనుమకొండ కుమార్‌పల్లి పెయింటర్స్ అసోసియేషన్ అడ్డా ప్రాంగణంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, శ్రమ శక్తి అవార్డు గ్రహీత తాడి సత్యనారాయణ జెండాను ఆవిష్కరించారు.

● బాలసముద్రం: బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు పాల్గొని జెండాను ఆవిష్కరించారు. వరంగల్ ఆర్టీసీ రీజినల్ కార్యాలయంలో రీజినల్ మేనేజర్ డి. విజయ భాను జాతీయ జెండా ఎగరవేశారు. కార్యక్రమంలో విధుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంస పత్రాలు అందించి శాలువతో సన్మానించారు. బాలసముద్రంలో శ్రీనివాస్ గురుకుల్ హైస్కూల్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాలను చేతబూని బాలసముద్రంలో ర్యాలీ చేసి ప్రదర్శిస్తూ ప్రజల్లో దేశభక్తిని కలిగించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఉపన్యాసాలు, పాటలు పాడి విద్యార్థులు దేశభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శిబిరాల సోమరత్నం విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.

● జులైవాడ: 59వ డివిజన్ వికాస్‌నగర్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్ రెడ్డి జాతీయపతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు పులి వీరారెడ్డి, కమిటీ సభ్యులు జనార్ధన్‌రెడ్డి, రమణారెడ్డి, యాదగిరిరెడ్డి, మల్లికార్జున, బాసెట్టి మల్లయ్య, మల్లారెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రేటర్ 49వ డివిజన్ ఫారెస్ట్ కార్యాలయ జంక్షన్‌లో స్వాతంత్య్ర వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు.

● కాళోజీ జంక్షన్: కేఎల్ఎన్‌రెడ్డి కాలనీలో రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. సేవా సమితి అధ్యక్షుడు కటంగూరి సత్యనారాయణ పతాకావిష్కరణ చేశారు.

● మడికొండ: మడికొండలోని బురుజు వద్ద, టేకులగూడెం, ఉనికిచర్లలో, మడికొండలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో జరిగిన వేడుకలలో 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. మడికొండలోని దుర్గాబాయి మహిళా శిశు కేంద్రంలో జిల్లా మేనేజర్ జయశ్రీ జాతీయ జెండాను ఎగురవేశారు. మడికొండలోని ఎస్సీ కాలనీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వస్కుల శంకర్ జెండాను ఎగురవేశారు. అయోధ్యపురం రోడ్ టీఎన్‌జీవోస్ కాలనీలో కాలనీవాసులు జాతీయ జెండాను ఎగురవేసి వేడుకలు జరుపుకున్నారు.

● వడ్డెపల్లి: వడ్డెపల్లి క్రాస్ రోడ్డులోని ప్రణయ్ మార్గ్ నుంచి అదాలత్ సెంటర్ వరకు గ్రేటర్ వరంగల్ 60వ డివిజన్ కార్పొరేటర్, బీజేపీ రాష్ట్ర నేత డాక్టర్ దాస్యం అభినవ్ భాస్కర్ ఆధ్వర్యంలో 78 మీటర్ల జాతీయ పతాకంతో భారీ తిరంగ ర్యాలీని ఎన్‌సీసీ క్యాడెట్లు, వివిధ పాఠశాలల విద్యార్థులతో కలిసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ హాజరయ్యారు. గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్ అంబేద్కర్ విగ్రహం వద్ద స్థానిక కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్, గోపాల్‌పూర్‌లోని సర్దార్ సర్వాయిపాపన్న జంక్షన్ వద్ద కాంగ్రెస్ 56వ డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మందోటి మహేందర్ పటేల్, ద్వారకా సాయి కాలనీ ఫేస్ -2 వద్ద సర్దార్ సర్వాయిపాపన్న సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వల్లాల రాజ్‌కుమార్‌గౌడ్, జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో త్రివర్ణ పతాకాన్ని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు ఆవిష్కరించగా ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్‌తో పాటు వివిధ యూనియన్ల నేతలు, జర్నలిస్టులు, ప్రెస్‌క్లబ్ బాధ్యులు పాల్గొన్నారు. 57వ డివిజన్ గాంధీ నగర్‌లో గాంధీ నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకటరాజిరెడ్డి, 58వ డివిజన్ ఎన్జీవోస్ కాలనీ బస్టాప్ వద్ద జాతీయ పతాకాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా నేతలు తాళ్లపెల్లి రవీందర్(జేకే), తాళ్లపెల్లి సుధాకర్, 60వ డివిజన్ టీచర్స్ కాలనీ ఫేస్-1 కమ్యూనిటీ హాల్‌లో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పింగిళి రామిరెడ్డి, వడ్డెపల్లి పింగిళి డిగ్రీ అండ్ పీజీ మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తిని చంద్రమౌళి గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

● కాజీపేట: కాజీపేటలోని 62వ డివిజన్‌లోని వివిధ కాలనీలలో స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ జెండా ఆవిష్కరించారు. 63వ డివిజన్‌లో వివిధ కాలనీలలో స్థానిక కార్పొరేటర్ విజయ శ్రీ రజాలీ పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బావుసింగ్, పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డిలు జాతీయ జెండా ఆవిష్కరించారు. కాజీపేట రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్‌లో స్వాతంత్య్రదినోత్స వ వేడుకలు రైల్వే సీనియర్ డీఈఈ ప్రశాంత్ కృష్ణ సాయి ఆధ్వర్యంలో జరిగాయి. ఇనిస్టిట్యూట్ సెక్రెటరీ దేవులపల్లి రాఘవేందర్ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెండా ఆవిష్కరణ అనంతరం రైల్వే ఇనిస్టిట్యూట్ సభ్యులు, వారికుటుంబ సభ్యుల కోసం నిర్వహించిన సాంస్కృతి క పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు.

● హసన్‌పర్తి: మండలంలోని పెంబర్తి ఏకశిల ఈటెక్నో స్కూల్ ఆవరణలో స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలుసాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. వివిధ విభాగాల్లో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్ గౌరు రిత్విక్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణ రాజ్, అకాడమిక్ ఇన్‌చార్జి రాంప్రసాద్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● వరంగల్ కార్పొరేషన్: నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో స్వాతంత్ర దినోత్సవాన్ని ఘ నంగా నిర్వహించారు. కార్యక్రమానికి మేయర్ గుండు సుధారాణి హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం బల్దియా సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కమిషనర్ చింతకుట్ల రవీందర్‌రెడ్డి, డిప్యూటి మేయర్ రిజ్వాన షమీం, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు. 54వ డివిజన్ హ నుమాన్‌నగర్ ఫేజ్-4 కాలనీలో హనుమాన్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యమంలో గౌరవ అధ్యక్షుడు కందికొండ రంగయ్య, మాజీ అధ్యక్ష కార్యదర్శులు శాతిరి బిక్షపతి, అర్షం సదానందం, అధ్యక్ష, కార్యదర్శులు సంపత్, రవీందర్, సభ్యులు తీగల ఎల్లగౌడ్, గుండారపు భద్ర య్య, రజినీకాంత్, రంజీత్, మహేశ్, సుధాకర్, శ్రీనివాస్‌లతో పాటు శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

● హనుమకొండ టౌన్: హనుమకొండ హంటర్ రోడ్డు దీన్‌దయాళ్ నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జిల్లా బీజేపీ అధ్యక్షురాలు రావు పద్మ జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జ సత్యనారాయణరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొలను సంతోషరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పులి సరోత్తంరెడ్డి, చందుపట్ల రాజిరెడ్డి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం, విద్యుత్ భవన్ కార్యాలయాల్లో స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి జాతీయ జెండాను సీఎండీ ఎగరవేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగుల అమరుల స్థూపం వద్ద పూలదండ వేసి నివాళులర్పించారు.

● ధర్మసాగర్: ధర్మసాగర్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అనిల్‌కుమార్, పోలీస్‌స్టేషన్‌లో సీఐ ప్రవీణ్ కుమార్ జాతీయ జెండాను ఎగరవేసి గౌరవ వందనం స్వీకరించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ గోపినాథ్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ జాతీయ జెండాలను ఎగరవేసి గౌరవ వందనం స్వీకరించారు.

● వేలేరు: వేలేరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కోమి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మీ ప్రసన్న ,పోలీసుస్టేషన్‌లో ఎస్సై సురేష్ జాతీయ జెండాను ఎగరవేసి గౌరవ వందనాన్ని స్వీకరించారు. హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు రాజన్న, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు లీలాబాయి వివిధ గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో జాతీయ జెండాను ఎగర వేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● ఐనవోలు: తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీడీవో పులి వెంకటేశ్వర్లు, ఎస్సై పస్తం శ్రీనివాస్, ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, ఏవో కవిత, నందనం సొసైటీ వైస్ చైర్మన్ టి.చందర్‌రావు తమ తమ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేక అధికారులు, ఆటో, కార్మిక సంఘాలు, యువజన సంఘాల అధ్యక్షులు, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఆయా పార్టీల అధ్యక్షులు త్రివర్ణ పతకాలను ఎగురవేశారు. తహసీల్దార్ కార్యాలయంలో పోలీసులు జాతీయ జెండాకు గౌరవవందనం సమర్పించారు.



బాలసముద్రంలో స్వాతంత్య్ర వేడుకలలో ప్రదర్శన చేస్తున్న శ్రీనివాస్ గురుకుల్‌హైస్కూల్ విద్యార్థులు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఏకశిల విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి



మడికొండలోని కార్యాలయంలో జాతీయ జెండాకు వందన సమర్పణ చేస్తున్న బీఎం రఘుపతిరావు, హెచ్‌వోడీలు, సిబ్బంది

ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో..

మడికొండ: మడికొండలోని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. బ్రాంచ్ మేనేజర్ వర్ధినేని రఘుపతిరావు మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఎగురువేశారు. పలు విభాగాల హెచ్‌వోడీలు, మాస్టర్జీ స్కూల్ విద్యార్థులతో కలిసి త్రివర్ణపతాకానికి వందన సమర్పణ చేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ విభాగం ఆర్ఎం భైరి అజయ్‌కుమార్, ఏసీఎం ఎం.డి. షరీఫ్, షెడ్యూలింగ్ ఆఫీసర్ కాయల వేణయ్య, అకౌంటెంట్ సాయిని వెంకటేష్, ఎడిటోరియల్ అసిస్టెంట్ పబ్బ రాజేందర్, స్టోర్ ఇన్‌చార్జి గుండెబోయిన రవి, కార్యాలయ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.



హనుమాన్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్వతంత్ర దినోత్సవంలో పాల్గొన్న కమిటీ సభ్యులు



వర్సిటీలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, ఈసీ మెంబర్లు సురేశ్‌లాల్, సుదర్శన్



స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సీపీ



కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నాం..

(5వ పేజీ తరువాయి)

చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయని, రూ.119.71కోట్లతో చేపట్టిన 21 పనులు ప్రారంభదశలో ఉన్నాయని, ఈ పనులన్నీ వచ్చే మార్చి నాటికి పూర్తవుతాయన్నారు. 15వ ఆర్థిక సంఘం కింద రూ.9.90కోట్లతో పైప్ లైన్లు, స్లూయిస్ వాల్వుల పనులు పూర్తి చేశామని, పట్టణ ప్ర గతి కింద మంజూరైన రూ.4.12కోట్లతో 8 పనులు చేపట్టగా వీటిలో రెండు పనులు పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. రూ.30.89కోట్ల మున్సిపల్ సాధారణ నిధులతో 368 పనులు మంజూరు కాగా, 128 పూర్తయ్యాయన్నారు.

కేంద్ర రహదారులు

జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా స్టేషన్ ఘనపూర్ నుంచి ఐనవోలు వయా కూనూరు, గర్నెపల్లి వరకు రూ.20కోట్లతో రోడ్డు వెడల్పు పనులు, రూ.15 కోట్లతో ఒగ్లాపూర్ నుంచి దర్మారం రోడ్డు వరకు రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఎండీఆర్ ప్లాన్ పథకం కింద రూ.36కోట్లతో ధర్మసాగర్ నుంచి వేలేరు వయా సాయిపేట మల్లికుదుర్ల వరకు 20.70 కి.మీ. రోడ్డు విస్తరణ పనులు, రూ.16కోట్లతో పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి కొత్తకొండ వయా గట్టునర్సింగాపూర్ వరు విస్తరణ పనులు పూర్తయ్యాయని, రూ.29కోట్లతో ఆరెపల్లి- పరకాల రోడ్డు విస్తరణ పనులకు పురోగతిలో ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపి కడియం కావ్య ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ పి.ప్రావిణ్య, పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, నగర పాలక కమిషనర్ అశ్వినీతానాజీ వాకాడే, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, స్వాతంత్య్ర సమరయోధులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
నివేదన
శుక్రవారం • 16 ఆగస్టు 2024



కల్కి వచ్చేది అప్పుడే



కల్కి అవతారాన్ని భవిష్యత్తులో జరగబోయేదిగా మన పూర్వ ఋషులు వర్ణించారు. ఆయన జన్మించే శంభల గ్రామం ధర్మబద్ధమైనదనీ, అది సామాన్యులకు అగోచరంగా... అంటే కంటికి కనిపించకుండా ఉంటుందనీ కూడా వెల్లడించారు. కానీ ప్రజలలో కుతూహలం పెరిగి, వాటిపై రకరకాల కల్పిత కథనాలు ఊహాపోహలు ఎక్కువయ్యాయి. నిరాధారమైన అప్రామాణిక కథలు చిలవలుపలవలుగా సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ నేపథ్యంలో సనాతన ధార్మిక గ్రంథాలు చెబుతున్న అసలు విషయాలను తెలుసుకొనే ప్రయత్నం చేయాలి. కల్కి ఈ యుగాంతంలో ఆవిర్భవించే అవతారం. 'అథాసౌ యుగసంధ్యాయాం...' అంటే 'యుగసంధిలో...' అని పురాణాలు స్పష్టంగా చెబుతున్నాయి. దానికి ఇంకా చాలా సమయం ఉంది.

సృష్టి స్థితి లయకారకుడైన పరమాత్మ... ధర్మ ప్రతిష్ఠాపన కోసం, అధర్మ నిర్మూలన కోసం తనను తాను యోగమాయా శక్తితో అవతరింపజేసుకుంటాడనేది సనాతన ధర్మ శాస్త్రాలు చెబుతున్న మాట. వాటిలో ప్రధానంగా... త్రేతాయుగంలో రామావతారం, ద్వాపర యుగంలో కృష్ణావతారం, కలియుగాంతంలో కల్కి అవతారం సంభవిస్తాయని పూర్వ ఋషులు పలుచోట్ల ప్రస్తావన చేశారు. ప్రజలు ఒకరంటే ఒకరికి గిట్టక... పరస్పర కలహాలతో ధర్మనాశనం జరిగే కాలం కలియుగం. 'కల్యంతే కలహం కుర్వంత్యస్మిన్నితి కలిః' అని వ్యుత్పత్తి. పాపం, దురాచారం, విచ్చలవిడితనం, మర్యాదారాహిత్యం, పరస్పర హింస, ప్రకృతి వైపరీత్యాలు లాంటి దుర్లక్షణాలు... కలి స్వభావాలు. దుర్మార్గులు పాలకులై, ధర్మ విరోధుల దాష్టీకాలతో దెబ్బతిన్న కలియుగంలో... ధర్మ రక్షణ కోసం శ్రీమహావిష్ణువు ఆవిర్భవిస్తాడనే విషయాన్ని 'విష్ణుపురాణం', 'శ్రీమద్భాగవతం', 'విష్ణు ధర్మోత్తర పురాణం' తదితర పురాణాలలో, కొన్ని కావ్యాల్లో వివరించారు. భాగవతానికి అనుబంధమైన ఉప పురాణం 'శ్రీ కల్కి పురాణం'లో కల్కి కథ విస్తృతంగా వివరించి ఉంది.

ఇత్థం కలౌ గతప్రాయే జనేషు ఖర ధర్మిషు... ధర్మత్రాణాయ సత్త్వేన భగవానవతరిష్యతి... శంభల గ్రామ ముఖ్యస్య బ్రాహ్మణస్య మహాత్మనః... భవనే విష్ణుయశసః కల్కిః ప్రాదుర్భవిష్యతి... తదితర శ్లోకాల్లో కల్కి అవతార విశేషాలను 'శ్రీమద్భాగవతం' వర్ణించింది. ఇదే అర్థాన్ని ఇచ్చే వాక్యాలు, శ్లోకాలు ఇతర పురాణాలలోనూ ఉన్నాయి. "గాడిదల మాదిరిగా ప్రవర్తించే జంతుప్రాయులైన మానవుల వల్ల అధర్మం ప్రబలుతుంది. దానివల్ల ప్రకృతి వైపరీత్యాలు విజృంభిస్తాయి. ఆ సమయంలో భగవానుడు ధర్మ రక్షణ కోసం సత్త్వగుణంతో అవతరిస్తాడు. సకలలోక గురువైన, సర్వులకూ ఆత్మ అయిన, సర్వేశ్వరుడైన మహావిష్ణువు... సాధువులను రక్షించడానికి ఆవిర్భవిస్తాడు. శంభల గ్రామంలో విష్ణుయశుడనే వేదవేత్తకు తనయుడిగా జన్మిస్తాడు. దేవదత్తమనే అశ్వాన్ని అధిరోహిస్తాడు. మహాశక్తిమంతమైన ఖడ్గంతో... కపటపాలకులుగా ఉన్న దోపిడీదారులను, మ్లేచ్ఛులను హతమారుస్తాడు. ఆ తరువాత కృతయుగాన్ని స్థాపిస్తాడు" అని అవి వివరిస్తున్నాయి. గరుత్మంతుడి శక్తే అశ్వంగా పుడుతుందనీ, సర్వజ్ఞమనే శక్తి స్వామికి లీలాశుకంగా (చిలుక)గా ఉంటుందనీ పురాణాలు వర్ణించాయి. ముగ్గురు సోదరుల తరువాత కల్కి జన్మిస్తాడు. అతని పత్ని పద్మ. పరశురాముని దగ్గర శిష్యరికం చేసి, శివోపాసనతో అస్త్రవిద్యలను ఆర్జించి, ఆ తరువాత భూమి అంతటా పర్యటించి దుష్టత్వాన్ని నివారిస్తాడు.

కల్కిం కల్కవినాశార్థం ఆవిర్భూతం విదుర్బుధాః
నామా కుర్వంస్తతస్తస్య కల్కిరిత్యభివిశ్రుతమ్... అని చెప్పింది కల్కి పురాణం. అంటే 'కల్కమును వినాశనం చేయువాడు కల్కి' అని అర్థం. 'కల్కో అస్య అస్తి ఇతి హార్యతయా కల్కిః' అనేది కల్కి నామానికి వ్యుత్పత్తి. 'కల్కము' అంటే కపటం, వంచన, పాపం, భయభ్రాంతులు తదితర అర్థాలు ఉన్నాయి. వాటన్నిటినీ తొలగించి, యదార్థ ధర్మాన్ని స్థాపన చేసేవాడు కల్కి.

ఇది భవిష్యత్ అవతారమే అయినా... విష్ణు స్వరూపమే కాబట్టి, ఈ కాలంలో కూడా ఈ నామంతో విష్ణువును ఆరాధించినా, స్మరించినా స్వామి కృప లభిస్తుంది. అలా ఆరాధించేవారికి కలి బాధ సోకకుండా స్వామి రక్షిస్తాడు. కాబట్టి కల్కిరూప శ్రీమన్నారాయణ స్మరణతో ధన్యులమవుదాం.



• సామవేదం షణ్ముఖశర్మ

గీతాసారం

యోగః కర్మసు కౌశలం

వివిధ అంశాల ఆధారంగా మనకోసం, మన కుటుంబం కోసం, సమాజం కోసం మనం నిర్ణయాలు తీసుకుంటాం. ఈ నిర్ణయ సామర్థ్యాన్ని తదుపరి స్థాయికి తీసుకువెళ్ళాలని చెబుతూ "యోగః కర్మసు కౌశలం... అంటే యోగస్థితిలో చేసే ప్రతి కర్మ సామరస్యంగా ఉంటుంది" శ్రీకృష్ణుడు చెప్పాడు. ఇది జీవితాన్ని ఉన్నది



ఉన్నట్టుగా ఆస్వాదించడం కోసం కర్తృత్వాన్ని, అహంకారాన్ని వదిలెయ్యడం. మనం తీసుకొనే నిర్ణయాలన్నీ మనం, మన కుటుంబం సుఖపడడానికి లేదా బాధను నివారించుకోవడానికి. ఈ ప్రయాణంలో తదుపరి స్థాయి... సమతుల్యమైన నిర్ణయాలను తీసుకోవడం. మనం సంస్థలకు, సమాజానికి బాధ్యత వహిస్తున్న సందర్భాలలోనైనా సరే... ఈ కర్తృత్వం ఇంకా మిగిలే ఉంటుంది. ఇక్కడ కృష్ణుడు కర్తృత్వానికి తావులేని అంతిమ (అత్యున్నత) స్థాయి గురించి మాట్లాడుతున్నాడు. ఈ స్థాయికి చేరుకున్న వ్యక్తి ఏది చేసినా... అది సామరస్యంగానే ఉంటుంది. అంతటా వ్యాపించి ఉన్న చైతన్యమే వారిని నడిపిస్తుంది. నిర్ణయాధికారులందరికీ తమ ప్రయాణంలో ఈ దశ ఒక ముఖ్యమైన భాగం. అందుకే 'యోగః కర్మసు కౌశలం' అనే వాక్యాన్ని 'ఇండియన్ అడ్మినిస్ట్రేషన్ సర్వీస్' (ఐఎఎస్) తమ లోగోలో భాగంగా చేసుకుంది.

మనం భావోద్వేగాలు, పక్షపాతాలు, జ్ఞాపకాల ప్రభావంలో పడకుండా ఉండాలి. ఎందుకంటే వాటి ప్రభావంలో పడితే... వాస్తవాలను గ్రహించే మన సామర్థ్యాలను అవి నాశనం చేస్తాయి. తప్పుడు నిర్ణయాలకు దారి తీస్తాయి. మనం ఏదైనా నిర్ణయం తీసుకున్నప్పుడు ఏదో ఒకవైపు మొగ్గు చూపించే పరిస్థితి వస్తుంది. అలాంటప్పుడు వీలైనంత త్వరగా తటస్థ దశలోకి రావాల్సిన అవసరం ఉంది. ఏదైనా నిబంధనను కచ్చితంగా అమలు చేయడం, ఏదైనా నిర్ణయం తీసుకోవడం సులువైన, ఆహ్లాదమైన విషయాలు కావు. అప్పుడు తటస్థమైన ఆలోచనే మార్గాన్ని చూపిస్తుంది. ప్రశంసలను, విమర్శలను సమానంగా తీసుకోవడానికి తటస్థ వైఖరి సహాయపడుతుంది. తటస్థ స్థితిలో స్థిరంగా నిలిచినవారికి శక్తి, అపరిమితమైన తెలివితేటలు, కారుణ్య స్వభావం ఉంటాయి. ఇలాంటి గొప్ప గుణాలు కలిగినవారు అన్నింటా కార్యసాధకులు అవుతారు.



కె. శివప్రసాద్
ఐఎఎస్

సుభాషితం

మహాత్ముల స్వభావం

ఇతః స్వపితి కేశవః కులమితస్తదీయ ద్విషా
మితశ్చ శరణార్థినాం శిఖరిణాం గణాః శేరతే
ఇతోపి బడబానలః సహ సమస్త సంవర్తకై
రహో వితతమూర్జితం భరసహం చ సింధోర్వపుః

మహాత్ముల గొప్పతనం గురించి తన నీతి శతకంలో భర్తృహరి చెప్పిన శ్లోకం ఇది. దాన్ని...

ఒక యెడ బవ్వళించు హరి, యొక్కయెడన్ వహియించు రాక్షస
ప్రకరము, లొక్కచో నడగు బర్వత సంఘము, లొక్కెడన్ బలాహకములతోడ నుండు బడబాగ్నియు, విస్తృత మూర్జితంబునున్ బ్రకటభరక్షమం బగుచు భాసిలు నౌర సముద్రమెంతయున్... అంటూ తెలుగువారికి అందించారు ఏనుగు లక్ష్మణకవి.



భావం: గొప్పవారిని, సహనశీలత కలిగినవారిని గంభీరమైన సముద్రంతో పోలుస్తూ ఉంటారు. బ్రహ్మాండాన్ని తన ఉదరంలో దాచుకున్న శ్రీమహావిష్ణువు సముద్రంలో ఒక చోట నిద్రపోతూ ఉంటాడు. ఆయనకు శత్రువులైన రాక్షసులు కూడా సముద్రంలో తలదాచుకొని ఉంటారు. ఇంద్రుడి వజ్రాయుధం దాడి నుంచి రక్షణ కోసం మైనాకాది సముద్రంలో దాగి ఉన్నాయి. సముద్రంలో మరొకచోట బడబానలం ప్రజ్వరిల్లుతూ నీటిని మింగేస్తోంది. వీటన్నిటినీ భరిస్తూ సముద్రం ఇంకా వర్ధిల్లుతూనే ఉంది. అదే విధంగా... సుఖాలు వచ్చినా, కష్టాలు ఎదురైనా మహాత్ములు తమను ఆశ్రయించినవారిని ఆదరిస్తారు. వారికి ఆధారంగా నిలుస్తారు.

సత్యధర్మరతాయచ...

పూజ్యాయ రాఘవేంద్రాయ సత్య ధర్మరతాయచ... భజతాం కల్పవృక్షాయ నమతాం కామధేనవే... ఇది భక్త జనులందరికీ తెలిసిన శ్రీ రాఘవేంద్రస్వామివారి నిత్య స్మరణీయ శ్లోకం. దీనిలోని మొదటి పదమే 'శ్రీ రాఘవేంద్రులు అత్యంత పూజనీయులు' అని చెబుతోంది. ఎందుకంటే ఆయన సత్య ధర్మాలనే దీక్షగా, వ్రతంగా పెట్టుకున్నవారు. 'సత్యం' అంటే ఉన్నది ఉన్నట్టు చెప్పడం మాత్రమే కాదు. యత్ సతాం హితం తత్ సత్యం...అంటే జీవితంలో మనం మాట్లాడే మాట మన తల్లితండ్రులకు, గురువులకు, సజ్జనులకు హితం కలిగించేదిగా ఉండాలి. తద్వారా వారు భగవన్ముఖులై... ఆ పరమాత్ముని అనుగ్రహం పొందాలి. ఇదీ రాఘవేంద్రుల సత్య వ్రతం. ఆయన ఏనాడూ పరుషమైన మాటలతో సజ్జనుల మనస్సును నొప్పించలేదు. శ్రీ రాఘవేంద్రులను పరీక్షించడానికి ఒక ముస్లిం రాజు తామసమైన ఆహారం మీద వస్త్రాన్ని కప్పి ఆయన ముందు ఉంచాడు. ఆయన తీర్థ సంప్రోక్షణంతో దాన్ని సాత్విక ఆహారంగా మార్చారు. ఆ రాజు తామస వ్యక్తిత్వాన్ని కూడా సాత్వికంగా మార్చారు. జాతి, మత భేదాలు లేకుండా... అందరినీ కరుణించి, వారి యోగ్యతకు అనుగుణంగా ఆధ్యాత్మిక దృష్టిని ప్రసాదించి, సన్మార్గాన్ని చూపించిన దివ్యపురుషులు శ్రీ రాఘవేంద్రులు.

శ్రీరాఘవేంద్రుల పూర్వనామం వెంకటనాథుడు. వివాహమై, సంసారధర్మాన్ని నిర్వహిస్తున్న కాలంలో ఆయన కటిక దరిద్రాన్ని అనుభవించారు. అయినా ఎవరినీ చేయి చాచి అడుగలేదు. సరైన దుస్తులు లేని దుస్థితిలో కూడా అధ్యయనాన్ని, అనుష్ఠానాన్నీ మానలేదు. చిన్న చిన్న సమస్యలకు సైతం చావే పరిష్కారం అనుకొనే దుర్బల మనస్కులు ఆయన ధర్మ దీక్ష నుంచి స్ఫూర్తి పొందాలి. ఆ ధర్మనిరతి వల్ల ఆయనకు మంత్రసిద్ధి కలిగింది.

ఒక రోజు వెంకటనాథుడు తన ఊరికి వెళుతూ... మార్గమధ్యంలో ఒక అగ్రహారానికి చేరుకున్నారు. తేజస్సుతో వెలిగిపోతున్న ఆయనను చూసి ఒక ఇంటి యజమాని తన ఇంట్లో జరుగుతున్న సమారాధనకు ఆహ్వానించాడు. అయితే వెంకటనాథుని యోగ్యత తెలియని అక్కడి వారు... గంధం తీసే పని ఆయనకు అప్పగించారు. దాన్ని పరమాత్ముని సేవగా భావించిన వెంకటనాథుడు... అగ్ని సూక్తాన్ని పఠిస్తూ గంధం తీశారు. వెంకటనాథుడు పొందిన మంత్రసిద్ధి ప్రభావం ఎంతటిదంటే... దేవుని పూజ అయ్యాక ఆ గంధాన్ని రాసుకున్న వారికి శరీరాలు కాలిపోతున్న బాధ కలిగింది. "మంట మంట" అని అరుస్తున్నారు. అప్పుడు ఆ ఇంటి పురోహితుడు "ఈ గంధం తీసినది ఎవరు?" అని అడిగాడు. అందరూ వెంకటనాథుణ్ణి చూపించారు. ఆయనను చూడగానే జరిగిన అపరాధం ఆ పురోహితుడికి అర్థమయింది. తమను క్షమించి, ఈ ఉపద్రవం నుంచి రక్షించాలని వెంకటనాథుణ్ణి ప్రార్థించాడు.



అప్పుడు ఆయన వరుణ సూక్తాన్ని జపిస్తూ... మిగిలిన గంధాన్ని తీర్థంతో కలిపి రాసుకోవాలని సూచించారు. వారు అలా చేయగానే... అప్పటివరకూ నిప్పులు మీద పడ్డట్టు కలిగిన మంట మటుమాయమై, చల్లని అనుభూతి కలిగింది. అందరూ ఆయనను మహిమాన్వితుడని ప్రశంసించగా... ఇదంతా భగవంతుడి లీల అనీ, తాను కేవలం దాసుణ్ణి మాత్రమేనని చెప్పారు.

ద్వైత సిద్ధాంత స్థాపకుడైన శ్రీ మధ్వాచార్యుల సిద్ధాంతం గురించి వివరిస్తూ అర్థ వివరణలు, టీకా టిప్పణులతో దాదాపు 50 గ్రంథాలను శ్రీరాఘవేంద్రులు రచించారు. శ్రీ మధ్వ, శ్రీ జయతీర్థుల భావాలను ఆయన రాసిన 'భావదీప' ప్రకాశింపజేయడంతో పాటు వారిని ఆక్షేపించినవారికి దీటైన సమాధానంగా నిలిచింది. దశోపనిషత్తులకు రాసిన ప్రతిపదార్థం అత్యంత ప్రసిద్ధి చెందింది. అయితే గ్రంథరచన నెపంతో నిత్య నైమిత్తిక కర్మలను శ్రీరాఘవేంద్రులు ఎన్నడూ విడిచిపెట్టలేదు. ప్రవచనాలు చెప్పేవారు. దేశసంచారం, తీర్థయాత్రలు చేసేవారు. భౌతిక శరీరాన్ని విడిచిపెట్టిన తరువాత... శ్రీవిజయదాసుల వారికి ప్రహ్లాద, వ్యాసరాయ, రాఘవేంద్ర రూపాలతో దర్శనమిచ్చి... దాసపథాన్ని కొనసాగించాలని ఆశీర్వదించారు. శ్రీజగన్నాథదాసులకు కనిపించి... శ్రీహరి తత్వాలను ఉపదేశించారు. 'మఠానికి చెందిన మంత్రాలయ గ్రామ భూములు సరైనవా? కావా?' అని విచారించడానికి తను వెళ్ళినప్పుడు... శ్రీ రాఘవేంద్రులవారు తన బృందావనం నుంచి నేరుగా బయటకు వచ్చారని, సంబంధిత పత్రాలను చూపించారని ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారి సర్ థామస్ మన్రో 'మద్రాస్ గెజిట్'లో స్వయంగా పేర్కొన్నారు. మన్రో గెజిట్ నేటికీ అందుబాటులో ఉంది. భగవద్భక్తులు అంటే 'సరైన మార్గం ద్వారా తత్వ జ్ఞానాన్ని పొందడానికి దీక్ష వహించినవారు' అని అర్థం. స్వార్థానికి తావులేకుండా 'సమస్త జగత్తుకు శుభం కలగాలి' అనే చింతన వారి మనసులో ఎల్లప్పుడూ ఉండాలి. 'ప్రాతస్సంకల్ప గద్యం' అనే రచన ద్వారా శ్రీ రాఘవేంద్రులు ఇచ్చిన సందేశం ఇదే. "నేను చేసే అన్ని క్రియల ద్వారా ఆ శ్రీహరి ప్రసన్నం కావాలి. నా చుట్టూ ఉన్న సకల సజ్జనులకు సత్కర్మలు చేసే బుద్ధిని ఆ శ్రీహరి ప్రేరేపించాలి" అని రోజూ సంకల్పం చేసుకోవాలని ఆయన బోధించారు.

ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకూ శ్రీ రాఘవేంద్రుల ఆరాధన మహోత్సవాలు జరగనున్నాయి. ఆయన ప్రథమ శిష్యుడయిన అప్పణాచార్యులవారు తుంగభద్ర నదిని దాటుతూ రచించిన 'శ్రీ రాఘవేంద్ర స్తోత్రా'న్ని ఈ పుణ్య దినాలలో పారాయణం చేస్తే... అది మనల్ని సంసార సాగరాన్ని దాటిస్తుంది. శ్రీహరి కృపకు పాత్రులను చేస్తుంది. నైతిక జీవనం, జ్ఞాన సంపదలే దీక్షగా స్వీకరించి, శ్రీరాఘవేంద్రుల మార్గంలో సత్య ధర్మవ్రతులై ఉండేలా అనుగ్రహించాలని ఆయనను, భగవంతుణ్ణి ప్రార్థిద్దాం.

• మధ్వ ప్రచార పరిషత్, 9440258841

హరేకృష్ణ

నామస్తే హలాగ్రహ నామస్తే మూశలాయుధ
నామస్తే రేవతీ కాంత నామస్తే భక్త వత్సల
నామస్తే బలానాం శ్రేష్ఠ నామస్తే ధరణీధర
ప్రలంబారే నామస్తేస్తు త్రాహిమం కృష్ణ పూర్వజ

ఆధ్యాత్మిక బలం కోసం..

"హలధరుడు, గదాధరుడు, రేవతీకాంతుడు, భక్తవత్సలుడు, ధరణీధరుడు, బలశ్రేష్ఠుడు, ప్రలంబాసురుణ్ణి సంహరించినవాడు, శ్రీకృష్ణుడికి అగ్రజుడు అయిన బలరామునికి ప్రణామాలు. మా మీద దయచూపించి, మమ్మల్ని సదా రక్షించు" అని భావం. శ్రీకృష్ణుడి అన్న అయిన బలరాముని జయంతిని శ్రావణ పౌర్ణమి రోజున భక్తి శ్రద్ధలతో శ్రీకృష్ణ భక్తులు నిర్వహిస్తారు. రోహిణి, వసుదేవుల తనయుడైన బలరాముడు 'సంకర్షణ, రామ, బలభద్ర' అనే పేర్లతో పిలుపులు అందుకున్నాడు. దేవకి గర్భం నుంచి రోహిణి గర్భానికి మార్పు చెందినవాడు కాబట్టి 'సంకర్షణుడు' అని, గోకుల వాసులందరినీ సంతోషం కలిగించేవాడు కాబట్టి 'రామ' అని, విశేష బలపరాక్రమాలు కలిగినవాడు కాబట్టి 'బలభద్రు'డనీ అంటారు.

కంసుడి ఆగడాల నుంచి లోకాన్ని రక్షించడానికి శ్రీకృష్ణుడిగా మహావిష్ణువు ఆవిర్భవించబోతున్న సమయంలో... ఆయనకు సహాయపడేందుకు ఆ అనంతశేషుడు భువిపై బలరాముడిగా జన్మించాడు. దేవకీ వసుదేవుల అష్టమ సంతానంగా శ్రీకృష్ణుడు పుట్టాల్సి ఉంది. ఏడో సంతానంగా దేవకి గర్భంలో బలరాముడు ఉన్నాడు. ఆయనను రోహిణి గర్భానికి యోగమాయ మార్చింది. గర్భస్రావం జరిగిందని అందరూ అనుకున్నారు. దేవకి కూడా భయపడింది. కానీ ఆమెకు యోగమాయ ధైర్యం చెప్పి, వాస్తవాన్ని తెలియజేసింది. ఈ విధంగా దేవకికి, రోహిణికి బలరాముడు కుమారుడయ్యాడు. ఆ తరువాత "నీవు ఈ భూతలంపై వివిధ క్షేత్రాల్లో... దుర్గ, భద్రకాళి, విజయ, వైష్ణవి, కుముద, చండికా, కృష్ణా, మాధవి, కన్యకా, మాయా, నారాయణీ, ఈశాని,



19న
శ్రీబలరామ
జయంతి

శారద, అంబిక తదితర పేర్లతో ప్రజల నుంచి పూజలు అందుకుంటావు" అని యోగమాయకు శ్రీకృష్ణుడు చెప్పాడు. హరేకృష్ణ ఉద్యమ సంస్థాపకాచార్యులైన శ్రీల ప్రభుపాదులు తన భాష్యంలో బలరాముడి గురించి వివరిస్తూ "శ్రీకృష్ణుడి పరివ్యాప్త స్వరూపాలలో మొదటి రూపం బలరాముడని పలువురు పండితుల అభిప్రాయం. బలరాముడు 'మహా సంకర్షణ, కారణాబ్ధి శాయి, గర్భోదక శాయి, క్షీరోదక సాయి, అనంత శేషుడు' అనే అయిదు రూపాలలోకి తనను విస్తరింపజేసుకున్నాడు. ఈ అయిదు స్వరూపాలే ఆధ్యాత్మిక, భౌతిక జగత్తులు వ్యక్తం కావడానికి మూల కారణం" అని తెలిపారు.

ఆధ్యాత్మిక శక్తిలో మూడు అంశాలు ఉంటాయి. అవి సంధిని, సివత్, హ్లాదిని. వీటిలో సంధిని శక్తికి అధిష్ఠాన దైవం బలరాముడు. బలరాముణ్ణి ప్రార్థించడం ద్వారా శ్రీకృష్ణుని పాదపద్మాల దగ్గరకు చేరే మార్గం సుగమం అవుతుంది. బలరాముడు లేదా ఆయన ప్రతినిధి అయిన ఒక ప్రామాణిక గురువు అనుగ్రహం లేనిదే కృష్ణతత్వాన్ని అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. 'శ్రీకృష్ణుడి పట్ల, గురువు పట్ల ఎవరికైతే అచంచలమైన విశ్వాసం ఉంటుందో... వారిలో సమస్త జ్ఞానం తనంతట తానే భాసిల్లుతుంది" అంటుంది శ్వేతాశ్వతర ఉపనిషత్తు. "నాయమాత్మ బలహీనేన లభ్యో... తగినంత ఆధ్యాత్మిక బలం లేనిదే ఆత్మసాక్షాత్కార మార్గంలో పురోగమించడం సాధ్యం కాదు" అంటోంది ముండకోపనిషత్తు. ఇందులో 'బల' అనే పదం బలరాముణ్ణి సూచిస్తుంది. అయితే అది భౌతిక బలాన్ని ఉద్దేశించిన మాట కాదు. ఆధ్యాత్మిక జీవనంలో ఎవరైనా పురోగమించాలని కోరుకున్నప్పుడు... మాయ, మోహం పలు రకాలుగా అడ్డు పడుతూ ఉంటాయి. వాటిని అధిగమించడానికి తగిన ఆధ్యాత్మిక బలం అవసరం. ఆ బలం బలరాముణ్ణి ప్రార్థించడం వల్ల కలుగుతుంది.

కృష్ణ భక్తికి అవరోధాలుగా నిలిచే మనలోని అంతర్గత శత్రువులను బలరాముడి నుంచి లభించే బలంతో జయించవచ్చు. పవిత్రమైన బలరామ జయంతి రోజున ఆయన అనుగ్రహం కోరుతూ ప్రతి ఒక్కరూ ప్రార్థించాలి. 'హరేకృష్ణ హరేరామ' మంత్రంలోని 'రామ' నామం బలరాముణ్ణి కూడా సూచిస్తుంది. ఆ మహామంత్ర జపంతో శ్రీకృష్ణ బలరాముల అనుగ్రహం లభిస్తుంది, సకల శుభాలు కలుగుతాయి.



శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984

విశేషం

వరాల వేలుపు

గృహిణులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరించే వ్రతం... వరలక్ష్మీ వ్రతం. సంపదలను ప్రసాదించే ఈ వ్రతాన్ని శ్రావణమాసంలో... పౌర్ణమికి ముందుగా వచ్చే శుక్రవారం చేసుకోవడం సంప్రదాయం. శ్రావణమాసానికి, శుక్రవారాలకు ఉన్న విశిష్టతలే దీనికి కారణం. శ్రీసూక్తంలోని మొదటి శ్లోకం 'లోకైక దీపాంకురాం' అంటూ శ్రీమహాలక్ష్మిని వర్ణిస్తుంది. లక్ష్మీ దేవి సమస్త లోకానికీ వెలుగునిచ్చే దీపం. ఆమె క్షీరసాగర తనయ. శ్రవణం నక్షత్రం జన్మతిథిగా ఉన్న శ్రీహరిని భర్తగా పొందింది. పౌర్ణమి రోజున శ్రవణం నక్షత్రం ఉండే మాసమే శ్రావణమాసం. అలాగే.... పౌర్ణమినాడు షోడశ కళలతో ప్రకాశించే చంద్రుడు... లక్ష్మీదేవికి తోబుట్టువు. అంటే అటు పుట్టినిల్లు, ఇటు మెట్టినిల్లు కాంతులతో విలసిల్లుతూ ఉంటుంది.


ఇక... శుక్రవారాన్ని 'భృగువారం' అంటారు. ఒక జన్మలో భృగుమహర్షి కుమార్తెగా లక్ష్మీదేవి శుక్రవారం నాడు జన్మించింది. అందుకే ఆమెను 'భార్గవీ లోక జననీ క్షీరసాగర కన్యకా' అంటూ పూజిస్తారు. శుక్రవారం ఆమెకు ఇష్టమైన రోజు. ఇలా ఎన్నో ప్రత్యేకతలు కలిగినవి శ్రావణ శుక్రవారాలు.

> **లక్ష్మీ దేవికి ఎన్నో పేర్లు, అంశలు ఉన్నా... ఆరింటినే ప్రధానంగా పేర్కొంటారు. శ్రీసూక్తంలోని 'శుద్ధలక్ష్మీ ర్మోక్షలక్ష్మీ జయలక్ష్మీం సరస్వతీ... శ్రీలక్ష్మీ ర్వరలక్ష్మీశ్చ ప్రసన్న మమ సర్వదా' అనే శ్లోకం వాటి గురించి చెబుతుంది.**

వ్రతకథ, విధానం...

వరలక్ష్మీ వ్రతం మహిళలందరూ ఆచరించదగినది. శ్రద్ధాభక్తులతో ఆ తల్లిని పూజించినవారిని ఎలాంటి కొరతా లేకుండా కటాక్షిస్తుందన్నది పెద్దల మాట. పుట్టింటివారితో, మెట్టినింటివారితో ఆప్యాయంగా మసలుకుంటూ, ఇరుగు పొరుగువారితో నిరహంకారంగా మెలుగుతూ... పెద్దలను గౌరవిస్తూ, పిన్నలను ఆదరంగా చూస్తూ... కుటుంబానికి కేంద్రబిందువుగా ఉండే మహిళగా 'వరలక్ష్మీ వ్రత కథ'లోని చారుమతి పాత్ర కనిపిస్తుంది. చారుమతిలోని ఆ గుణాలు లక్ష్మీ దేవికి ప్రీతిపాత్రమైనవనీ, అటువంటి వారికి ఆ తల్లి దయ ఎల్లప్పుడూ ఉంటుందనీ ఈ కథ వెల్లడిస్తుంది. చారుమతికి వరలక్ష్మీదేవి కలలో దర్శనమిచ్చి... తాను వరలక్ష్మిననీ, శ్రావణ పౌర్ణమికి ముందుగా వచ్చే శుక్రవారం తనను భక్తి శ్రద్ధలతో పూజిస్తే కోరిన వరాలు కురిపిస్తాననీ చెబుతుంది. ఈ సంగతి ఇంటి పెద్దలకు, ఇరుగుపొరుగువారికీ చారుమతి తెలియజేస్తుంది.

వరలక్ష్మీదేవి ఆదేశం ప్రకారం... చారుమతితో పాటు ఇరుగు పొరుగు ఇల్లాళ్ళందరూ.... ఆ రోజు అందరూ శుచిగా స్నానాలు ఆచరించారు. వ్రత విధానాన్ని పాటిస్తూ... షోడశోపచారాలతో అమ్మవారిని ఆరాధించారు. తోరాలను పూజించారు. వరలక్ష్మికి ప్రతీకగా నిలిపిన కలశానికి, అనంతరం తమ మంజేతులకు తోరాలను కట్టుకున్నారు. వ్రత మంటపానికి ముమ్మారు ప్రదక్షిణ చేశారు. ఈ విధంగా వ్రతం ఆచరించి, వారందరూ వరలక్ష్మీ కటాక్షాన్ని పొందారని వ్రత కథ వివరిస్తోంది. ఎలాంటి వివక్షలూ, పక్షపాతాలూ లేకుండా... సమష్టిగా వ్రతాలనూ, సత్కార్యాలనూ ఆచరించి, వచ్చిన ఫలితాన్ని సమానంగా అనుభవించాలని ఈ కథ బోధిస్తోంది.



నేడు
వరలక్ష్మీ
వ్రతం

సమగ్ర రూపమే వరలక్ష్మి

లక్ష్మీ దేవికి ఎన్నో పేర్లు, అంశలు ఉన్నా... ఆరింటినే ప్రధానంగా పేర్కొంటారు. శ్రీసూక్తంలోని 'శుద్ధలక్ష్మీ ర్మోక్షలక్ష్మీ జయలక్ష్మీ సరస్వతీ... శ్రీలక్ష్మీ ర్వరలక్ష్మీశ్చ ప్రసన్న మమ సర్వదా' అనే శ్లోకం వాటి గురించి చెబుతుంది. మొదటిది శుద్ధ లక్ష్మి: మన సంపద శుద్ధంగా... అంటే అవినీతికి తావులేకుండా ఉండాలి. అధర్మంగా, హింసా మార్గంలో సంపాదించినది కాకూడదు. శుద్ధమైన సంపదను ధర్మబద్ధంగా వితరణ చేయాలి. అప్పుడే లక్ష్మి ప్రసన్నమవుతుంది. రెండోది మోక్షలక్ష్మి. పేరులోనే 'మోక్షప్రదాయిని' అనే అర్థం ఉంది. చతుర్విధ పురుషార్థాలలో చివరిది మోక్షం. మోక్షాన్ని కోరుతూ లక్ష్మీదేవిని ఆశ్రయిస్తే... లౌకికమైన ప్రలోభాల నుంచి ఆధ్యాత్మిక మార్గానికి మళ్ళిస్తుంది. మూడోది జయలక్ష్మి: లక్ష్మీదేవిని త్రికరణశుద్ధిగా పూజిస్తే సర్వత్రా జయం కలుగుతుంది. మంచి పనులను తలపెట్టి, అవి నిర్విఘ్నంగా పూర్తికావాలని ఆమెను ప్రార్థించాలి. నాలుగోది సరస్వతి: సరస్వతికి ప్రతీక విద్యాలక్ష్మి. ఆమె అనుగ్రహం ఉంటే ఎంతటి మందబుద్ధి అయినా ప్రతిభాసంపన్నుడు అవుతాడు. అయిదోది శ్రీలక్ష్మి: ఇది ధనలక్ష్మికి పర్యాయ పదం. రఘు మహారాజు శ్రీసూక్త మంత్రాలతో కుబేరుని నుంచి ధనాన్ని పొందాడు. శ్రీఆదిశంకరులు పేద గృహిణి ఇంట కనకధారను కురిపించిన కథ అందరికీ తెలిసినదే. ఇలా అయిదు రీతులలో అనుగ్రహించే శ్రీమహాలక్ష్మి... ఆ ప్రయోజనాలన్నిటినీ వరంగా ప్రసాదించే రూపమే... ఆరవది అయిన వరలక్ష్మి. ధాన్యలక్ష్మి, సంతానలక్ష్మి, ధైర్య లక్ష్మి, సంతాన లక్ష్మి... ఇలా ఆమెకు అనేక రూపాలు. వాటన్నిటి సమగ్ర రూపమే వరలక్ష్మీ దేవి అనేది పెద్దల మాట.

• ఆయపిళ్ళ రాజపాప

ఎన్‌సీఈఆర్‌టీ 'ప్రయాస్' పోటీ



న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్&ట్రెయినింగ్(ఎన్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్ సైన్స్ అండ్ మేథమెటిక్స్(డీఈఎస్‌ఎం)- 'ప్రమోషన్ ఆఫ్ రీసెర్చ్ ఆటిట్యూడ్ ఇన్ యంగ్ అండ్ యాస్పిరింగ్ స్టూడెంట్స్(ప్రయాస్) 2024 స్కీమ్' గైడ్‌లైన్స్ విడుదల చేసింది. విద్యార్థులకు సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, ఆర్ట్స్, మేథమెటిక్స్ విభాగాల్లో ఆసక్తిని కలిగించి పరిశోధనల దిశగా ప్రోత్సాహాన్ని అందించేందుకు ఈ ప్రోగ్రామ్‌ని ఉద్దేశించారు. ఇందులో భాగంగా విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పరీక్షించి వారి సృజనాత్మకతను పెంపొందించేలా పోటీలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు తమ ప్రాంతాల్లోని ప్రధాన సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి శాస్త్రీయంగా పరిశోధనలు చేయాలి. ఇందుకు తమ పాఠశాల ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు తీసుకోవచ్చు.

తమ పరిశోధనల వివరాలతో ప్రాజెక్ట్ ప్రపోజల్‌ను సంస్థ ఈ మెయిల్‌కు పంపాలి. ప్రాజెక్ట్ వర్క్ వ్యవధి ఏడాది. అవసరం మేరకు మరో ఆర్నెల్లు పొడిగించే వీలుంది. నిబంధనల ప్రకారం పూర్తిచేసిన ప్రాజెక్ట్ పరిశోధన పత్రాలను ఎన్‌సీఈఆర్‌టీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు.

అర్హత: తొమ్మిది నుంచి పదకొండో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులు. దరఖాస్తు నాటికి విద్యార్థుల వయసు 14 నుంచి 18 ఏళ్ల మధ్య ఉండాలి. ఒకరు లేదా ఇద్దరు విద్యార్థుల గ్రూప్ తమ టీచర్, హెచ్ఈఐ సహకారంతో రీసెర్చ్ చేయవచ్చు. తొమ్మిది నుంచి పన్నెండోతరగతి వరకు సైన్స్/ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్ బోధించే పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) గైడ్‌గా వ్యవహరించవచ్చు. ఒక పాఠశాల నుంచి ఒక ఎంట్రీ మాత్రమే పంపాలి.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 25
- **దరఖాస్తుల స్క్రీనింగ్:** ఆగస్టు 31
- **ప్రాజెక్ట్ ప్రపోజల్ సెలెక్షన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 5
- **జ్యూరీ ఎంపిక చేసిన ప్రాజెక్ట్‌ల సమాచారం:** సెప్టెంబరు 10న
- **ప్రాజెక్ట్ రీసెర్చ్ వర్క్ ప్రారంభం:** సెప్టెంబరు 15 నుంచి
- **ప్రాజెక్ట్ వర్క్ పూర్తి చేసేందుకు చివరి తేదీ:** 2025 సెప్టెంబరు 14
- **ప్రాజెక్ట్ రిపోర్ట్ సబ్మిషన్:** 2025 సెప్టెంబరు 20
- **ఈ మెయిల్ ఐడీ:** prayaasncert@gmail.com
- **వెబ్‌సైట్:** ncert.nic.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Gxb0nalqలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

SCHOLARSHIP ALERT

Corteva Agriscience

Description: An initiative of Corteva Agriscience India Pvt. Ltd., this program aims to provide financial assistance to meritorious students pursuing postgraduate, doctoral or undergraduate courses in the area of agriculture, as well as students in Classes 11 and 12 with STEM subjects.

Eligibility: Female students in postgraduate (MBA/ M.Sc./ M.Tech.), doctoral, or undergraduate courses, as well as for those in Classes 11 and 12 with STEM subjects (government/private schools).

The applicant's annual family income must be 6,00,000 or less. Students from across India can apply. Children of employees of Corteva & Buddy4Study are not eligible.

Prizes & Rewards:
- For PG students: INR 50,000
- For UG students: INR 25,000
- For school students: INR 10,000

Last Date to Apply: 13-09-2024
Short Url: www.b4s.in/aj/CASP4

Infosys Foundation

Description: An initiative by Infosys Foundation to support female students in India who aspire to pursue undergraduate degrees in STEM (Science, Technology, Engineering, Mathematics) subjects.

Eligibility: Female students who are citizens of India and enrolled in the first year of their 4-year undergraduate course in the fields of engineering, medicine (MBBS), and other related STEM subjects at institutes of repute (NIRF accredited) are eligible.

Applicants must have obtained admission into the identified colleges and must have completed their Class 12. The annual family income of the applicants from all sources must be less than or equal to 8 lakh. Candidates must not have availed other scholarships for the same expenses

Prizes & Rewards: The selected candidates will receive a scholarship of up to 1 lakh per annum, covering tuition, living expenses, and study materials, for the duration of the course against paid receipts.

Last Date to Apply: 15-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/ISTS2

KSB Scholarship

Description: KSB Ltd through Care Charitable Trust invites applications from female students in their first year of a diploma in engineering or any polytechnic course to provide them with financial support for their studies.

Eligibility: Girls studying in the first year of a diploma in engineering or any polytechnic course. Students studying or having domiciles in and around Pune, Nashik, Ahmednagar, Satara, and Coimbatore. Students who have scored more than 60% marks in their previous classes are eligible to apply. Students' family income from all sources should be less than INR 8 lakh per annum. Children of employees of KSB Care Charitable Trust and Buddy4Study are not eligible.

Prizes & Rewards: Scholarship of INR 25,000 and mentorship support

Last Date to Apply: 16-09-2024
Short Url: www.b4s.in/aj/KSBMP1

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి

ఐపీఎస్ ఆఫీసర్‌గా...

విష్వక్ సేన్ కథానాయకుడిగా శ్రీధర్ గంటా దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. 'వీ.ఎస్ 13' వర్కింగ్ టైటిల్. గురువారం చిత్రీకరణ ప్రారంభించారు. కన్నడ నటి సంపద హీరోయిన్. ఈ సినిమాను సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. సెప్టెంబరు నుంచి రెగ్యులర్ షూటింగ్ జరగనుంది. గ్రామీణ నేపథ్యంలో విభిన్న



పొలిటికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో విష్వక్ నిజాయితీ గల ఐ.పీ.ఎస్ ఆఫీసర్ పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: కిశోర్‌కుమార్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్.



ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్‌లో గౌరవ అతిథిగా పాల్గొనేందుకు ఆహ్వానం అందిన నేపథ్యంలో రామ్‌చరణ్ తన కుటుంబంతో గురువారం మెల్‌బోర్న్ చేరుకున్నారు. పది రోజుల పాటు సాగే ఈ చలనచిత్రోత్సవంలో ఇండియన్ ఆర్ట్స్ అండ్ కల్చర్ అంబాసిడర్ పురస్కారాన్ని రామ్‌చరణ్ అందుకోనున్నారు.

కంటతడి పెట్టించిన కవిత



విలక్షణ నటుడు, గాయకుడిగా సుపరిచితుడైన ఆయుష్మాన్ ఖురానా పశ్చిమ బెంగాల్‌ను కుదిపేస్తున్న ట్రైనీ వైద్యురాలి హత్య ఘటనపై తన కలం ఝుళిపించారు. బాధితురాలి ఆవేదనకు అక్షరరూపం ఇచ్చిన ఆయన ఆ కవితను చదువుతున్న వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయగా వైరల్ అయింది. అది విన్న మనసున్న ప్రతి మనిషి కళ్లు ఆర్తితో చెమర్చుతున్నాయి. 'నేనే అబ్బాయిని అయి ఉంటే గది తలుపు వేయకుండా నిద్రపోవచ్చు కదా' అంటూ మొదలైన కవిత మగవాడిగా ఉండడంలోని స్వేచ్ఛను, ఆడపిల్లలపై ఉన్న పరిమితులను వర్ణిస్తూ సాగింది. తన ఆవేదనను ఆయుష్మాన్ ఆవిష్కరించిన తీరుతో ఆ కవిత విన్న ప్రతి ఒక్కరూ ఆ వైద్యురాలి ఆవేదనను అనుభూతి చెందుతున్నారు. 'నిర్భయ హత్య ఘటన జరిగి 12 ఏళ్లు... అయినా మనలో మార్పు రాలేదు. ఇప్పుడు మళ్లీ అదే తరహా ఘటన' అని నటి కరీనా కపూర్ ఆవేదన వ్యక్తం చేశారు. అలియాభట్, ప్రీతిజింతా సహా పలువురు బాలీవుడ్ నటీనటులు ఈ ఘటనను ఖండించారు.

భావోద్వేగాల సమ్మేళనం




బండి సరోజ్‌కుమార్ కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'పరాక్రమం'. ఈ నెల 22న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సందీప్ కిషన్ మాట్లాడుతూ "సరోజ్ కుమార్ నిజాయితీ గల దర్శకుడు. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. "ప్రతీ కామన్ మ్యాన్‌కు కనెక్టయ్యే చిత్రమిది. ఈ సినిమా ఎన్నో భావోద్వేగాల సమ్మేళనం" అని దర్శకుడు బండి సరోజ్‌కుమార్ అన్నారు.



సమంత సమాధానం?

సమంత ఏం చేసినా సంచలనమే. తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన సెల్ఫీ చర్చనీయాంశమైంది. ఇది నాగచైతన్య నిశ్చితార్థం తర్వాత ఆమె పోస్ట్ చేసిన తొలి ఫొటో కావడమే అందుకు కారణం. ఇందులో సమంత స్టైలిష్‌గా కనిపించారు. ఈ స్టిల్‌లో సమంత ఎడమ కణతపై మధ్యవేలును ఉంచారు. దర్శకుడు రాజ్ నిడమోరుతో డేటింగ్‌లో ఉన్నారంటూ తనపై వస్తున్న పుకార్లను పట్టించుకోనని శామ్ చెప్పకనే చెప్పారని కొందరు నెటిజన్లు అంటున్నారు. 'ది మ్యూజియం ఆఫ్ పీస్ అండ్ క్వైట్' అని రాసున్న టీషర్ట్‌ను సమంత ధరించారు. దీంతో ఈ కొటేషన్ ద్వారా కొందరికి సమంత సరైన సమాధానం చెప్పారని మరో అభిమాని వ్యాఖ్యానించారు.



దసరా బరిలో పొట్టేల్



యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల జంటగా నటించిన చిత్రం 'పొట్టేల్'. సాహిత్ ఎం. దర్శకత్వంలో నిశాంక్‌రెడ్డి, సురేశ్ కుమార్ సడిగె నిర్మించారు. గురువారం చిత్రబృందం విడుదల తేదీని ప్రకటించింది. దసరా సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలుపుతూ పోస్టర్‌ను విడుదల చేశారు.

అక్టోబర్‌లో హారర్ థ్రిల్లర్



వెంకటసాయి గుండ ప్రధాన పాత్రలో నటించిన హాలీవుడ్ చిత్రం 'ద డిజర్వింగ్'. ఈ సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌ను కోకా సింగ్ అరోర దర్శకత్వంలో వెంకటసాయి గుండ, తిరుమలేశ్ గుండ్రాత్, విస్మయ్‌కుమార్ కొత్తపల్లి నిర్మించారు. సమాజంలో జరిగే పలు అంశాలను ఆధారం చేసుకుని విభిన్నంగా తెరకెక్కింది. తాజాగా చిత్రబృందం ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు. 'ద డిజర్వింగ్'ను ఆక్టోబరు 1న విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

బాలల చిత్రం అభినవ్



భీమగాని సుధాకర్ గౌడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న బాలల చిత్రం 'అభినవ్'. సమ్మెట గాంధీ, సత్య ఎర్ర కీలక పాత్రలు పోషిస్తున్నారు. గురువారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "బాలకార్మిక వ్యవస్థను, గంజాయి మాఫియాను నిర్మూలించడమే ఈ సినిమా ప్రధాన కథాంశం. ఇది అందరి ఆదరణ పొందుతుందనే నమ్మకం ఉంది. ప్రేక్షకులను కట్టిపడేసే భావోద్వేగాలు ఈ సినిమాలో ఉన్నాయి. సామాజిక చైతన్యమే ఈ సినిమా ధ్యేయం" అని అన్నారు.

వినాయక చవితికి విడుదల



రాజ్‌తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా నటిస్తున్న చిత్రం 'భలే ఉన్నాడే'. ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌ను జె.శివసాయి వర్ధన్ దర్శకత్వంలో ఎన్.వి.కిరణ్‌కుమార్ నిర్మిస్తున్నారు. డైరెక్టర్ మారుతి సమర్పిస్తున్నారు. తాజాగా, మేకర్స్ ఈ సినిమా డేట్‌ను ప్రకటించారు. వినాయక చవితి సందర్భంగా ఈ చిత్రాన్ని సెప్టెంబరు 7న విడుదల చేస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది.

జీరోలో హీరోగా



నటుడు శివాజీ రాజా తనయుడు విజయ్‌రాజా హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'జీరో'. ఈ స్పోర్ట్స్ డ్రామాను లక్ష్మీనారాయణ దర్శకత్వంలో ఆర్.లక్ష్మణరావు, ఆర్.శ్రీను నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా గ్లింప్స్‌ను లాంచ్ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తనికెళ్ల భరణి మాట్లాడుతూ "మంచి కంటెంట్ ఉన్న సినిమా ఇది. తప్పక విజయం సాధిస్తుంది" అని చెప్పారు. "అన్ని వర్గాల ప్రేక్షకులకి ఈ సినిమా నచ్చుతుంది" అని దర్శకుడు లక్ష్మీనారాయణ అన్నారు. "ఈ సినిమాలో అందరికీ కనెక్ట్ అయ్యే ఆసక్తికర అంశం ఉంది" అని నిర్మాత ఆర్.లక్ష్మణరావు తెలిపారు.





పసిడి మళ్లీ రూ.75,000!

అమెరికా వడ్డీ రేట్లు తగ్గిస్తే పెరిగే చాన్స్



న్యూఢిల్లీ: పసిడి ధర మళ్లీ రూ.75,000కు చేరే సూచనలు కనిపిస్తున్నాయి. సెప్టెంబరులో జరిగే భేటీలో అమెరికా కేంద్ర బ్యాంక్ 'ఫెడ్ రిజర్వ్' వడ్డీ రేట్లు ఏకంగా అర శాతం (0.50%) తగ్గిస్తుందనే వార్తలు ఇందుకు ఆజ్యం పోస్తున్నాయి. దీంతో అక్టోబరులో డెలివరీ ఇచ్చే ఫ్యూచర్స్ మార్కెట్లో పసిడి ధర మళ్లీ పైచూపులు చూస్తోంది. సెప్టెంబరులో జరిగే భేటీలో ఫెడ్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లు పావు శాతం (0.25%) తగ్గించే అవకాశం ఉందని ఇప్పటి వరకు మార్కెట్ వర్గాలు భావించాయి. మరోవైపు తాజాగా ఫెడ్ రిజర్వ్ ఛైర్మన్ జెరోమ్ పోవెల్ కూడా వచ్చే నెలలో వడ్డీ రేట్లు తగ్గించే వీలుందని సంకేతాలిచ్చారు.

అమెరికా ఆర్థిక కష్టాలు

అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి వెళ్లే ప్రమాదం ఉందన్న వార్తలు, ప్రస్తుతం అందరినీ భయపెడుతున్నాయి. ఈ ప్రమాదం నుంచి తప్పించాలంటే సెప్టెంబరులో జరిగే భేటీలో ఫెడ్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లు ఏకంగా అర శాతం తగ్గించక తప్పదని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఇదే జరిగితే బులియన్ మార్కెట్లో మళ్లీ ర్యాలీ తప్పదని మార్కెట్ వర్గాల అంచనా. దీనికి తోడు అంతర్జాతీయ ఉద్రిక్తతలతో చైనాతో సహా ప్రధాన దేశాల కేంద్ర బ్యాంకులు పెద్దఎత్తున పసిడి నిల్వలు పెంచుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పండగల సీజన్ నాటికి మన దేశంలో 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) పసిడి ధర రూ.75,000 దాటినా ఆశ్చర్యం లేదని మార్కెట్ వర్గాల అంచనా.

తగ్గిన పసిడి దిగుమతులు

పసిడి దిగుమతులు తగ్గుముఖం పట్టాయి. ఈ ఏడాది ఏప్రిల్-జూలై మధ్య కాలంలో మన దేశానికి 1,264 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.05 లక్షల కోట్లు) విలువైన పసిడి దిగుమతైంది. గత ఏడాది ఇదే కాలంలో దిగుమతైన 1,320 కోట్ల డాలర్ల పసిడితో పోలిస్తే ఇది 4.23 శాతం తక్కువ. గత ఏడాది జూలైతో పోలిస్తే ఈ ఏడాది జూలైలోనూ పసిడి దిగుమతులు 10.65 శాతం తగ్గి 313 కోట్ల డాలర్లకు చేరాయి. అయితే పండగల సీజన్ అమ్మకాలతో సెప్టెంబరు నుంచి దిగుమతులు మళ్లీ పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా.

సిస్కోలో మరో 5,900 మంది ఔట్!

శాన్‌జోస్ (అమెరికా): అమెరికా టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నాయి. నెట్‌వర్క్ ఎక్విప్‌మెంట్ తయారీ సంస్థ సిస్కో మరోసారి ఉద్యోగాల కోతకు సిద్ధమైంది. ఈసారి ఏకంగా మొత్తం ఉద్యోగుల్లో ఏడు శాతం మందిని ఇంటికి పంపించబోతోంది. గత ఏడాది జూలై నాటికి సిస్కోలో 84,900 మంది పని చేస్తున్నారు. ఈ లెక్కన ఏడు శాతం మంది అంటే దాదాపు 5,900 మందిని కంపెనీ ఈసారి ఇంటికి పంపించబోతోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ సిస్కో కంపెనీ 4,000 మంది ఇంటికి పంపించింది. ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఇంటెల్ 15,000 మంది ఉద్యోగులను తీసివేస్తున్నట్టు ప్రకటించిన రెండు వారాలకే సిస్కో మరోసారి ఉద్యోగాల కోతకు దిగడం విశేషం. పడిపోతున్న ఆదాయాలు, లాభాలను కాపాడుకునేందుకు కృత్రిమ మేధ (ఏఐ), సైబర్ సెక్యూరిటీలపై పెద్దఎత్తున దృష్టి పెట్టాలని సిస్కో భావిస్తోంది. ఇందులో భాగంగానే ఉద్యోగాల కోతకు దిగుతున్నట్టు భావిస్తున్నారు.

థార్ రాక్స్ వచ్చేసింది..

» ప్రారంభ ధర రూ.12.99 లక్షలు



కోచి: దేశీయ వాహన తయారీ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం).. ఐదు డోర్ల ఎస్‌యూవీ థార్ రాక్స్‌ను గురువారం ఆవిష్కరించింది. దీని ప్రారంభ ధర రూ.12.99 లక్షలు. ఇప్పటికే మార్కెట్లో విక్రయిస్తున్న మూడు డోర్ల థార్ ధర కన్నా రూ.1.64 లక్షలు ఎక్కువ. పెట్రోల్, డీజిల్ ఇంజన్ వెర్షన్లలో మొత్తం ఆరు వేరియంట్లలో ఈ కారు లభించనుంది. హైఎండ్ వేరియంట్ ధర రూ.18.99 లక్షలుగా ఉంది. అక్టోబరు 3 నుంచి బుకింగ్స్ ప్రారంభించి.. దసరా (అక్టోబరు 12) రోజున కస్టమర్లకు డెలివరీలు చేయనున్నట్లు మహీంద్రా తెలిపింది.

30న ముంబైలో రెండో ప్రపంచ పసుపు సదస్సు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నేషనల్ కమోడిటీ అండ్ డెరివేటివ్ ఎక్స్ఛేంజీ (ఎన్‌సీడీఎక్స్), కమోడిటీ ట్రేడింగ్‌లో ప్రముఖ సంస్థ మెక్‌డొనాల్డ్ పీఈఎల్‌జెడ్ ఈ నెల 30వ తేదీన ముంబైలో రెండవ ప్రపంచ పసుపు సదస్సును నిర్వహిస్తున్నాయి. పసుపు ఉత్పత్తి, ఎగుమతి రంగాలకు చెందిన నిపుణులు ఈ సదస్సులో పాల్గొంటారు. పసుపు మార్కెట్ భవిష్యత్తు, పరిశ్రమలో ఏర్పడిన మార్పులు, పసుపు మార్కెట్లో చోటు చేసుకుంటున్న మార్పులు వంటి అంశాలపై ఆ సదస్సులో చర్చిస్తారు. ప్రపంచ బ్యాంకు, మహారాష్ట్ర ప్రభుత్వ ఉమ్మడి నిర్వహణలోని మహారాష్ట్ర వ్యవసాయ, గ్రామీణ పరివర్తన (స్మార్ట్) ప్రాజెక్టు, సుగంధ ద్రవ్యాల బోర్డు, వ్యవసాయ శాఖకు చెందిన ఉన్నతాధికారులు ఈ సదస్సులో పాల్గొంటారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



16వ తేదీ			
హైదరాబాద్	435	విజయవాడ	486
వరంగల్	437	గోదావరి	486
చిత్తూరు	493	విశాఖపట్నం	490
		దజను గుడ్లు రూ.	66

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	87	విజయవాడ	95
వరంగల్	87	గుంటూరు	95
కరీంనగర్	87	ఒంగోలు	95
మహబూబ్‌నగర్	87	చిత్తూరు	101
కర్నూలు	87	నెల్లూరు	101
విశాఖపట్నం	91	అనంతపురం	95
గోదావరి	95		

భారత్‌లోకి బీఎస్ఏ ఎంట్రీ

గోల్డ్ స్టార్ 650 విడుదల
ధర రూ.2.99 లక్షలు



ముంబై: ప్రపంచంలోనే అత్యంత పురాతన మోటార్ సైకిళ్ల బ్రాండ్ 'బర్మింగ్‌హామ్ స్మాల్ ఆర్మ్స్ కంపెనీ' (బీఎస్ఏ) తాజాగా భారత మార్కెట్లోకి ప్రవేశించింది. ప్రస్తుతం మహీంద్రా గ్రూప్ చేతుల్లో ఉన్న ఈ కంపెనీ.. గోల్డ్ స్టార్ 650 మోటార్ సైకిల్‌ను గురువారం మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ప్రారంభ ధర రూ.2.99 లక్షలు. జావా, యెజ్డీ బైక్‌లను విక్రయిస్తున్న మహీంద్రా గ్రూప్ ప్రీమియం మోటార్ సైకిళ్ల విభాగం క్లాసిక్ లెజెండ్స్‌ను 2016లో బీఎస్ఏను కొనుగోలు చేసింది. 2021లో యూకే మార్కెట్లోకి రీఎంట్రీ ఇచ్చిన బీఎస్ఏ గోల్డ్ స్టార్ 650 బైక్ ప్రస్తుతం యూరప్, టర్కీ, న్యూజిలాండ్, ఫిలిప్పీన్స్‌లో అమ్ముడవుతోంది. తాజాగా భారత్‌లో రాయల్ ఎన్‌ఫీల్డ్ ఇంటర్‌సెప్టర్ 650కి పోటీగా మహీంద్రా ఈ బైక్‌ను తీసుకొచ్చింది. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన డీలర్ల వద్ద ఈ బైక్‌ను కొనుగోలు చేయవచ్చని మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా తెలిపారు.

ఓలా ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్

3 వేరియంట్లు విడుదల చేసిన సంస్థ.. ప్రారంభ ధర రూ.74,999



కృష్ణగిరి (తమిళనాడు): ఓలా ఎలక్ట్రిక్ తాజాగా విద్యుత్ మోటార్ సైకిళ్ల విభాగంలోకి ప్రవేశించింది. రోడ్‌స్టర్ సిరీస్‌లో మూడు ఈ-బైక్‌లను గురువారం విడుదల చేసింది. అందులో రోడ్‌స్టర్ ఎక్స్ ప్రారంభ ధర రూ.74,999 కాగా, రోడ్‌స్టర్ ధర రూ.1,04,999గా ఉంది. రోడ్‌స్టర్ ప్రో మోడల్ ప్రారంభ ధరను రూ.1,99,999గా నిర్ణయించింది. రోడ్‌స్టర్, రోడ్‌స్టర్ ఎక్స్ బైక్‌ల డెలివరీ వచ్చే ఏడాది జనవరి నుంచి ప్రారంభం కానున్నాయని, రోడ్‌స్టర్ ప్రో మాత్రం వచ్చే ఏడాది దీపావళి నాటికి అందుబాటులోకి రానుందని కంపెనీ స్పష్టం చేసింది. అంతేకాదు, ఓలా ఎలక్ట్రిక్ మరో రెండు కొత్త మోటార్ సైకిళ్లను సైతం మార్కెట్లోకి తీసుకురాబోతున్నట్లు సంకేతాలిచ్చింది. ఓలా వార్షిక సదస్సు 'సంకల్ప్ 2024'లో సంస్థ వ్యవస్థాపకులు, సీఈఓ భవిశ్ అగర్వాల్ ఈ-బైక్‌లను ఆవిష్కరించడంతో పాటు మరిన్ని కీలక ప్రకటనలను చేశారు.

ఓలా క్యాబ్ ఇక ఓలా కన్స్యూమర్: ఓలా తన ఆన్‌లైన్ క్యాబ్ బుకింగ్ సేవల ప్లాట్‌ఫామ్ ఓలా క్యాబ్స్ పేరును ఓలా కన్స్యూమర్‌గా మార్చింది. కంపెనీ ఇకపై ఆఫర్ చేయబోయే సేవల్లో క్యాబ్ బుకింగ్ ఒకటిగా ఉండనుంది. ఈ విభాగం ద్వారా పలు సేవలందించబోతున్నట్లు భవిశ్ తెలిపారు.

క్విక్ కామర్స్ కోసం పోర్టబుల్ డార్క్ వేర్‌హౌస్‌లు: ఓలా క్విక్ కామర్స్ సేవల్లోకి ప్రవేశిస్తున్నట్లు తెలిపింది. ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) ద్వారా బుకింగ్‌పై త్వరితగతిన డెలివరీ అందించేందుకు వీలుగా పోర్టబుల్ డార్క్ వేర్‌హౌస్‌లను నిర్మించనున్నట్లు, ఈ ఏడాది చివరినాటికివి అందుబాటులోకి రానున్నాయని భవిశ్ వెల్లడించారు. అయితే, నేరుగా తాము ఉత్పత్తులను విక్రయించే ఉద్దేశం లేదని.. డైరెక్ట్ టు కన్స్యూమర్ బ్రాండ్లు, ఇతర విక్రేతలు తాము విక్రయించే ఉత్పత్తులను స్టోర్ చేసుకునేందుకు ఈ డార్క్ స్టోర్లను నిర్మిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

కంపెనీ ఈ-స్కూటర్లలో కృత్రిమ్ ఏఐ: ఓలా గ్రూప్‌నకు చెందిన కృత్రిమ మేధ (ఏఐ) స్టార్టప్ కృత్రిమ్ సేవలను సంస్థ ఎలక్ట్రిక్ స్కూటర్లలోనూ అందుబాటులోకి తేబోతున్నట్లు, ఈ దీపావళినాటికి బీటా వెర్షన్‌ను విడుదల చేయనున్నట్లు భవిశ్ తెలిపారు. అలాగే, కృత్రిమ్ ఏఐ కస్టమర్ కేర్ యాప్‌ను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. 22 భాషల్లో అందుబాటులో ఉండే ఈ యాప్ ద్వారా డెవలపర్లు తమ కస్టమర్ కేర్ సేవలను యాంత్రీకరించుకోవచ్చన్నారు.ఓలా ఎలక్ట్రిక్, ఓలా క్యాబ్ ఇప్పటికే ఈ యాప్ సేవలను వినియోగించుకుంటున్నాయన్నారు.

ఏఐ చిప్‌ల తయారీలోకి కృత్రిమ్: కృత్రిమ్ ఏఐ చిప్‌ల తయారీలోకి ప్రవేశించబోతోంది. బోధి 1 పేరుతో ఏఐ చిప్‌లను తయారు చేస్తున్నట్లు, 2026 నాటికి తొలి చిప్ అందుబాటులోకి రానుందని భవిశ్ చెప్పారు.

ఓలా పే

ఓలా యాప్ ద్వారా క్యాబ్ రైడ్ లేదా ఫుడ్, కిరాణా సరుకుల ఆర్డర్ల కోసం యూపీఐ చెల్లింపులు జరిపేందుకు వీలుగా కంపెనీ ఓలా పే సేవలను సైతం ప్రారంభించింది.

విద్యార్థులకు కెనరా బ్యాంక్ ప్రోత్సాహకాలు



విద్యార్థినికి చెక్ అందజేస్తున్న బ్యాంక్ ఎండీ సత్యనారాయణ రాజు

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ వినూత్నమైన సేవలకు శ్రీకారం చుట్టింది. గురువారం బెంగళూరులోని ప్రధాన కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో బ్యాంక్ ఎండీ, సీఈఓ కె.సత్యనారాయణరాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కెనరా బ్యాంక్ ప్రతి శాఖ పరిధిలోను కనీసం ఆరేడు మంది ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతిభావంతమైన ఎస్సీ, ఎస్టీ వర్గాలకి చెందిన విద్యార్థినులకు డాక్టర్ అంబేడ్కర్ విద్యాజ్యోతి ప్రోత్సాహకాలను అందిస్తామన్నారు. ఈ ఏడాది ఇప్పటికే 44,700 మంది విద్యార్థినులకు రూ.17.20 కోట్ల మేర నగదు బదిలీ చేశామన్నారు. ఏటా పేద బాలికలకు ప్రోత్సహించే విధానం కొనసాగుతుందన్నారు. ప్రతి గ్రామీణ బ్యాంకు శాఖ పరిధిలో పేద బాలికను దత్తత తీసుకుని ఎల్‌కేజీ నుంచి డిగ్రీ వరకు చదివిస్తున్నట్లు ఆయన చెప్పారు. అలాగే బ్యాంకులో వివిధ హోదాలలో పనిచేసి అనారోగ్యం, ప్రమాదాలతో మృతి చెందిన ఉద్యోగుల కుటుంబీకులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలిచ్చినట్లు తెలిపారు. ఐదేళ్లుగా ఈ అంశం పెండింగ్‌లో ఉందన్నారు. వయసుతో సంబంధం లేకుండా విద్యార్హతను బట్టి 150 మందికి ఉద్యోగాలిచ్చినట్లు చెప్పారు. స్టాఫ్ వెల్ఫేర్ ఫండ్‌ను రూ.45 కోట్ల నుంచి 90 కోట్లకు పెంచేందుకు అనుమతులు లభించాయని ఉద్యోగులతో పాటు రిటైర్డ్ అయిన వారికి కూడా అన్ని సౌలభ్యాలు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన పలువురు విద్యార్థులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

తీర్పుపై స్విస్ కోర్టుకు..



న్యూఢిల్లీ: వినేశ్ ఫొగట్ అప్పీల్‌ను క్రీడా మధ్యవర్తిత్వ న్యాయస్థానం (కాస్) అడ్‌హాక్ డివిజన్ ఆర్బిట్రేటర్ జస్టిస్ అనాబెల్ బెనెట్ బుధవారం కొట్టివేశారు. ఇక.. వినేశ్‌పై అనర్హత వేటుకు సంబంధించి తదుపరి కార్యాచరణ ఏమిటనే విషయమై చర్చలు బయలుదేరాయి. తీర్పునకు సంబంధించి సింగిల్ లైన్ ఆర్డర్ కాపీ మాత్రమే వచ్చిందని పారిస్ కోర్టులో వినేశ్ కేసుపై భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) తరఫున వాదించిన సీనియర్ న్యాయవాదుల్లో ఒకరైన విదుష్పత్ సింఘానియా శుక్రవారం తెలిపారు. తీర్పును ఎందుకు కొట్టి వేశారో సింగిల్ ఆర్డర్ కాపీలో లేదని చెప్పారు. పూర్తి వివరాలతో కూడిన తీర్పు కాపీ అందాల్సి ఉందన్నారు. కాస్ తీర్పుపై 30 రోజుల్లోగా స్విస్ ఫెడరల్ ట్రిబ్యునల్‌లో అప్పీలు చేస్తామని ఆయన తెలిపారు. స్విట్జర్లాండ్‌లోని లాసన్నెలో ఉన్న స్విస్ ఫెడరల్ కోర్టుకు వెళ్లే విషయంలో సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే తమకు మార్గదర్శనం చేస్తారని విదుష్పత్ తెలిపారు. అక్కడ తీర్పు అనుకూలంగా వస్తే..వినేశ్‌కు రజత పతకం అందజేస్తారు.

ఇలా సవాలు చేయొచ్చు..

అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ), ప్రపంచ రెజ్లింగ్ పాలక మండలి..యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) నిబంధనలకు అనుగుణంగా కాస్ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాలు చేయడానికి ఆస్కారముంది. కానీ తక్కువ అంశాల్లో మాత్రమే సవాలుకు చాన్సు ఉందని తెలిసింది. విచారణ నిబంధనలు ఉల్లంఘించినట్టు ప్రాథమికంగా తేలడం, పబ్లిక్ పాలసీలలో అననుకూలత..వంటి కారణాలతో కాస్ తీర్పును సవాలు చేయవచ్చని న్యాయవాదులు అభిప్రాయపడుతున్నారు.

మేమంతా నీవెంటే..

ఫొగట్‌కు క్రీడాలోకం బాసట



న్యూఢిల్లీ: తన పిటిషన్‌ను కాస్ డిస్మిస్ చేయడంతో రెజ్లర్ వినేశ్ ఫొగట్‌తో పాటు యావత్ భారతావని నిరాశకు గురైంది. అయితే, రజత పతకం లభించకపోయినా వినేశ్ తమకు మాత్రం చాంపియనే అంటూ దేశ క్రీడారంగం ఆమెకు బాసటగా నిలిచింది. నిర్ణీత 50 కిలోలకుగాను 100 గ్రాములు అదనంగా బరువుండడంతో వినేశ్‌ను ఫైనల్ బౌట్‌కు అనర్హురాలిగా పారిస్ క్రీడల నిర్వాహకులు ప్రకటించిన సంగతి తెలిసిందే. 'ఈ చీకట్లో నీ పతకాన్ని బలవంతంగా లాగేసుకున్నారు. అయినా, ప్రపంచం మొత్తం మీద నువ్వు వజ్రంగా వెలుగుతున్నావు' అని టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించిన రెజ్లర్ బజ్‌రంగ్ పూనియా ట్వీట్ చేయగా.. 'దేశమంతా నీవెంటే ఉంది. వినేశ్ తలపైకెత్తుకొని ఉండాలి. మాకు, దేశానికి ఆమే చాంపియన్' హాకీ ఆటగాడు అమిత్ పోస్ట్ చేశాడు.

వినేశ్ స్పందన ఇలా..

కాస్ తీర్పుపై వినేశ్ నేరుగా స్పందించకున్నా..శుక్రవారం ఇన్‌స్టాలో ఆమె పోస్ట్ చేసిన ఫొటో ఆ స్టార్ రెజ్లర్ ఎంత వేదనలో కూరుకుపోయిందో తెలియజేసింది. మ్యాట్‌పై వెల్లికలా పడుకొని ముఖాన రెండు చేతులు పెట్టుకున్న ఆ చిత్రానికి 'రబ్బావే' అని పాటను జోడించింది. ప్రముఖ పంజాబీ సింగర్ ప్రతీక్ బచ్చన్ పాడిన 'రబ్బావే' అనే ఆ పాట 'దేవుడు తన పట్ల దయచూపలేదు' అనే సాహిత్యంలో కొనసాగడం గమనార్హం. దీంతో ఆమెలో గూడుకట్టుకున్న విషాదానికి ఆ ఫొటో అద్దం పడుతుందని నెటిజన్లు పోస్టులు చేస్తున్నారు.

యూఎస్ ఓపెన్‌లో ఒసాకాకు వైల్డ్‌కార్డ్

న్యూయార్క్: రెండుసార్లు చాంపియన్ నవోమి ఒసాకతోపాటు మాజీ విజేతలు వావ్రింకా, డొమినిక్ థీమ్, బియాంక ఆండ్రెస్క్యూకు యూఎస్ ఓపెన్ వైల్డ్ కార్డులు లభించాయి. సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ అయిన యూఎస్ ఓపెన్ ఈనెల 26 నుంచి జరగనుంది. అమండా అనిసిమోవా, మెకార్టినీ కెస్లర్, అలెక్సా నోయల్, ఇవా జొవిచ్‌లకు కూడా వైల్డ్‌కార్డులు దక్కాయి.

'రిసార్ట్స్'లో వరల్డ్ చెస్ మ్యాచ్‌లు

న్యూఢిల్లీ: భారత టీనేజ్ గ్రాండ్ మాస్టర్ గుకేశ్ తలపడే ఫిడే వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్ వేదిక ఖరారైంది. సింగపూర్‌లోని 'రిసార్ట్స్ వరల్డ్ సెంటోసా'లో నవంబరు 23 నుంచి డిసెంబరు 15 వరకు చాంపియన్‌షిప్ జరగనుంది. చైనాకు చెందిన వరల్డ్ చాంపియన్ డింగ్ లిరెన్‌ను గుకేశ్ చాలెంజ్ చేయనున్నాడు. 138 ఏళ్ల టోర్నీ చరిత్రలో ఆసియాకు చెందిన ఇద్దరు ప్లేయర్లు తలపడడం ఇదే తొలిసారి.

అమన్‌కు ప్రమోషన్



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకంతో సత్తా చాటిన భారత యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్‌కు పదోన్నతి దక్కింది. ఇప్పటిదాకా రైల్వేలో సాధారణ ఉద్యోగిగా విధులు నిర్వర్తించిన అమన్‌ను ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)గా ప్రమోట్ చేస్తున్నట్టు ఉత్తర భారత రైల్వేస్ గురువారం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా అమన్‌ను ఉత్తర భారత రైల్వేస్ జనరల్ మేనేజర్ శోభన్ చౌదురి ఘనంగా సత్కరించారు. పారిస్ క్రీడల్లో పతకం సాధించిన పిన్న వయసు భారత అథ్లెట్‌గా 21 ఏళ్ల అమన్ రికార్డుకెక్కిన సంగతి తెలిసిందే.



ప్రధాని మోదీతో హాకీ ఆటగాళ్లు

ప్రతి క్రీడాకారుడూ చాంపియనే

పారిస్ అథ్లెట్లతో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: 'పారిస్‌లో పాల్గొన్న ప్రతి అథ్లెటూ చాంపియనే. మా ప్రభుత్వం క్రీడా రంగానికి మద్దతు కొనసాగిస్తుంది. అత్యున్నత క్రీడా సదుపాయాలు కల్పించేలా చర్యలు చేపడుతుంది' అని ప్రధాని మోదీ తెలిపారు. పారిస్‌లో ఒలింపిక్స్‌లో తలపడిన భారత బృందం ప్రధానిని ఆయన నివాసంలో గురువారం కలిసింది. ఈ సందర్భంగా ప్రధాని వారిని అభినందించడంతోపాటు అథ్లెట్లతో ముచ్చటించారు. 'పారిస్ ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులను కలుసుకోవడం అద్భుతంగా ఉంది. ఆ మెగా ఈవెంట్ సందర్భంగా అథ్లెట్లకు ఎదురైన అనుభవాల గురించి తెలుసుకున్నా' అని ప్రధాని ఎక్స్‌లో పేర్కొన్నారు.

2036 ఒలింపిక్స్ నిర్వహణకు సిద్ధమవుతున్నాం..

ప్రపంచ అతి పెద్ద క్రీడా పోటీలను నిర్వహించే సత్తా భారత్‌కు ఉందని ప్రధాని మోదీ నొక్కి చెప్పారు. ఈక్రమంలో 2036 ఒలింపిక్స్ నిర్వహణకు ఉన్న ఏ అవకాశాన్నీ వదలబోమని ఎర్రకోటనుంచి చేసిన స్వాతంత్ర్యదిన ప్రసంగంలో స్పష్టంజేశారు. '2036 విశ్వక్రీడలను నిర్వహించాలన్నది భారత్ స్వప్నం. అందుకోసం మేం ఇప్పటికే చర్యలు ప్రారంభించాం' అని ఆయన గుర్తుచేశారు. భారత్‌తోపాటు సౌదీ అరేబియా, ఖతార్, తుర్కియే 2036 ఒలింపిక్స్ నిర్వహణకు ప్రధానంగా పోటీ పడుతున్నాయి. ఇక భారత్ నుంచి అహ్మదాబాద్ ఆతిథ్య నగరంగా రేస్‌లో నిలిచింది.



ఈ పిస్టల్‌తోనే పతకాలు..

పారిస్‌లో 10 మీ. ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత, సరబ్ జోత్‌తో కలిసి మిక్స్‌డ్‌లో మొత్తం రెండు కాంస్య పతకాలు సాధించిన షూటర్ మనూ భాకర్‌తో ప్రధాని మోదీ ప్రత్యేకంగా ముచ్చటించారు. ఆ పోటీలలో తాను ఉపయోగించిన పిస్టల్‌ను మోదీకి చూపడంతోపాటు దానిని ఎలా ఉపయోగిస్తానో ఆమె వివరించింది. సరబ్ జోత్‌తోపాటు కాంస్య పతకం నెగ్గిన రైఫిల్ షూటర్ స్వప్నిల్ కుశాలేతో కూడా ప్రధాని ప్రత్యేకంగా మాట్లాడారు. పురుషుల 57 కిలోల విభాగంలో కాంస్య పతకం కైవసం చేసుకున్న రెజ్లర్ అమన్ సెహ్రావత్ మోదీతో ఫొటో దిగడంతోపాటు తాను సంతకం చేసిన భారత జెర్సీని ప్రధానికి అందజేశాడు. అలాగే కాంస్య పతకం సాధించిన పురుషుల హాకీ జట్టు ప్రధానికి ప్రత్యేక కానుక అందజేసింది. జట్టు సభ్యులు సంతకాలు చేసిన జెర్సీ, హాకీ స్టిక్‌ను మోదీకి బహూకరించింది. విశ్వ క్రీడల తర్వాత హాకీకి వీడ్కోలు పలికిన గోల్‌కీపర్ శ్రీజేష్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ కాంస్య పతకాలను ధరించి ప్రధానితో ఫొటో దిగారు. క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవ్య, భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు ఉదయం ఎర్రకోట వద్ద జరిగిన స్వాతంత్ర్య వేడుకలకు భారత అథ్లెట్లు హాజరయ్యారు.

ఈ టీ20 వరల్డ్‌కప్ మా వల్ల కాదు

ఐసీసీ ప్రతిపాదనను తిరస్కరించిన బీసీసీఐ

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లోని అనిశ్చిత పరిస్థితుల కారణంగా అక్కడ జరగాల్సిన మహిళల టీ20 వరల్డ్‌కప్ సందిగ్ధంలో పడింది. ఈనేపథ్యంలో ఈ మెగా టోర్నీకి ఆతిథ్యమివ్వాలంటూ ఐసీసీ చేసిన విజ్ఞప్తిని బీసీసీఐ తోసిపుచ్చింది. ఎందుకంటే వచ్చే ఏడాది మహిళల వన్డే వరల్డ్‌కప్ భారత్‌లోనే జరుగుతుంది. దీంతో వరుసగా రెండు ప్రపంచకప్‌లు నిర్వహించడం కష్టమనే భావనలో బోర్డు ఉంది. షెడ్యూల్ ప్రకారం అక్టోబరు 3-20 మధ్య బంగ్లా వేదికగా టీ20 వరల్డ్ కప్ జరగాలి. ప్రస్తుత పరిస్థితుల్లో బంగ్లాలో నిర్వహించే చాన్స్ లేకపోవడంతో శ్రీలంక, యూఏఈ వేదికలను పరిశీలిస్తున్నారు. ఈనెల 20న తుదినిర్ణయం వెలువడనుంది.

ఎన్‌సీఏలోనే లక్ష్మణ్



బెంగళూరు: మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) చీఫ్‌గా మరికొంతకాలం కొనసాగనున్నాడు. అతడి మూడేళ్ల పదవీకాలం వచ్చే నెలతో ముగియనుంది. కానీ లక్ష్మణ్‌ను మరో ఏడాదిపాటు ఎన్‌సీఏలోనే కొనసాగించాలని బీసీసీఐ భావిస్తోంది. మరోవైపు బెంగళూరు శివారులో అత్యంత ఆధునికంగా నిర్మిస్తున్న నూతన ఎన్‌సీఏ ముగింపు దశకు చేరింది. ఇందులో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మూడు క్రికెట్ స్టేడియాలు, 45 ప్రాక్టీస్ పిచ్‌లు, ఇండోర్ క్రికెట్ పిచ్‌లు, ఒలింపిక్ ప్రమాణాలతో కూడిన స్విమ్మింగ్‌పూల్, రిహాబిలిటేషన్ సెంటర్ ఉన్నట్టు బీసీసీఐ కార్యదర్శి జైషా ఎక్స్‌లో ఫొటోలను షేర్ చేశాడు.


ఒలింపిక్ అథ్లెట్లు కూడా..

కొత్త ఎన్‌సీఏలో వసతులను క్రికెటర్లే కాకుండా స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా సహా ఇతరులు కూడా వినియోగించుకోవచ్చనిజైషా తెలిపాడు.


సచిన్.. అధరహో!

● రూ. 2.15 కోట్లకు తలైవాస్ కొనుగోలు
● మహ్మద్‌రెజాకు రూ. 2.07 కోట్లు

ప్రొ కబడ్డీ లీగ్ వేలం



సచిన్ తన్వర్



మహ్మద్‌రెజా

ముంబై: ప్రొ కబడ్డీ సీజన్-11 వేలంలో ఆటగాళ్లపై కాసుల వర్షం కురిసింది. అత్యంత ఖరీదైన ఆటగాడిగా రైడర్ సచిన్ తన్వర్ సత్తా చాటగా. విదేశీ ఆటగాళ్ల జాబితాలో ఇరాన్ ఆల్‌రౌండర్ మహ్మద్‌రెజా చియనెహ్ రూ. 2 కోట్ల మార్క్‌ను దాటాడు. రెండు రోజులపాటు జరిగే వేలంలో మొత్తం 500 మంది ఆటగాళ్లు పాల్గొంటున్నారు. గురువారం జరిగిన తొలిరోజు వేలంలో మొత్తం 8 మంది ఆటగాళ్ల ధర రూ. కోటి దాటగా.. అందులో ఏడుగురు భారత ప్లేయర్లు ఉండడం విశేషం. కాగా, సచిన్ కోసం తెలుగు టైటాన్స్, గుజరాత్ జెయింట్స్ కూడా చివరిదాకా బిడ్డింగ్‌లో నిలిచినా.. చివరకు అతడిని తమిళ్ తలైవాస్ రూ. 2.15 కోట్లకు ఖరీదు చేసింది. సచిన్ తన కనీస ధర రూ. 30 లక్షలకు ఏడు రెట్లు ఎక్కువకు అమ్ముడుపోవడం విశేషం. రైడర్ గుమాన్ సింగ్‌ను గుజరాత్ జెయింట్స్ రూ. 1.97 కోట్లకు దక్కించుకోగా, గత సీజన్‌లో రూ. 2.6 కోట్లతో టాప్ లేపిన హైఫ్లయర్ పవన్ కుమార్ సెహ్రావత్‌ను ఈసారి తెలుగు టైటాన్స్ రూ. 1.72 కోట్లకు మళ్లీ చేజిక్కించుకుంది. ఆల్‌రౌండర్ భరత్‌ను యూపీ యోధాస్ రూ. 1.30 కోట్లకు, మణీందర్ సింగ్‌ను బెంగాల్ రూ. 1.15 కోట్లకు, డిఫెండర్ సునీల్ కుమార్‌ను యు ముంబా రూ. 1.01 కోట్లకు కొనుగోలు చేశాయి. కాగా, బాహుబలి అంటూ ఎంతో క్రేజ్ సంపాదించుకొన్న సిద్ధార్థ్ దేశాయ్‌ను దబాంగ్ ఢిల్లీ కేవలం రూ. 26 లక్షలకు తీసుకోవడం గమనార్హం. రైడర్లు అంజిక్యా పవర్ రూ. 1.10 కోట్లకు, పర్‌దీప్ నర్వాల్ రూ. 70 లక్షలకు బెంగళూరు బుల్స్ సొంతమయ్యారు. యువ రైడర్ మంజీత్‌ను ముంబా రూ. 80 లక్షలకు దక్కించుకుంది. కాగా, విదేశీ ప్లేయర్లలో మహ్మద్‌రెజా చియనెహ్ ఊహించినట్టే హాట్‌కేక్‌గా అమ్ముడయ్యాడు. అతడిని హరియాణా స్టీలర్స్ రూ. 2.07 కోట్లకు ఎగరేసుకుపోయింది. ఇరాన్ డిఫెండర్ ఫజల్ అత్రాచెలిని బెంగాల్ వారియర్స్ రూ. 50 లక్షలకే దక్కించుకొంది. ఆరో సీజన్‌లోనే కోటికిపైగా పలికిన అత్రాచెలిపై ఫ్రాంఛైజీలు ఈసారి పెద్దగా ఆసక్తి చూపలేదు. ఆల్‌రౌండర్లు రోహిత్ గులియా, విశ్వంత్‌లు అన్‌సోల్డ్‌గా మిగిలారు. మరికొంత మంది ఆటగాళ్ల వేలం శుక్రవారం జరగనుంది.



కూతురు ఆద్యతో సెల్ఫీ తీసుకుంటున్న డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్

కూతురు ఆద్యతో పవన్ సెల్ఫీ

కాకినాడ సిటీ, ఆగస్టు 15: కాకినాడ పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో గురువారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వేదికపై తన కూతురు ఆద్యతో సెల్ఫీ తీసుకున్నారు. దీంతో ఒక్కసారిగా గ్యాలరీ నుంచి అభిమానులు కేరింతలు కొట్టారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఓపెన్ టాప్ జీప్‌పై నుంచి గౌరవ వందనం స్వీకరిస్తూ పవన్‌కల్యాణ్ వేదిక వద్దకు వస్తున్న సమయంలో పబ్లిక్ గ్యాలరీ నుంచి సందర్శకులు కేరింతలు కొట్టారు. విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులు నృత్య ప్రదర్శన చేస్తున్నప్పుడు పవన్ వేదిక మీద నుంచి వారివద్దకు వచ్చి అభినందించారు.



పంతంగి టోల్ ప్లాజా వద్ద బారులు తీరిన వాహనాలు

వరుస సెలవుల నేపథ్యంలో సొంతూళ్లకు..

» పంతంగి టోల్‌ప్లాజా వద్ద బారులు తీరిన వాహనాలు

చౌటుప్పల్‌టౌన్/రూరల్, ఆగస్టు 15: వరుస సెలవుల నేపథ్యంలో ప్రజలు హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు బయలుదేరడంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై గురువారం వాహనాల రద్దీ నెలకొంది. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరాయి. రోజుకు 35వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా గురువారం 10 వేలకు పైగా వాహనాలు అదనంగా విజయవాడ వైపు వెళ్లాయి. టోల్‌గేట్ వద్ద ఫాస్ట్‌ట్యాగ్ సాఫ్ట్‌వేర్ అప్డేట్ చేయడంతో స్కానింగ్‌కు ఆలస్యమై వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.



ఆర్డీవో బూట్లు మోస్తున్న అటెండర్

జెండా సాక్షిగా ఆర్డీవో బూట్లు మోసిన అటెండర్

» బాన్సువాడ తహసీల్దార్ కార్యాలయంలో ఘటన

» పెద్దపల్లి బీఆర్ఎస్ కార్యాలయంలో తలకిందులుగా జెండా ఎగురవేత

బాన్సువాడ, పెద్దపల్లి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన ఓ ప్రభుత్వ ఉద్యోగి తన కింది స్థాయి ఉద్యోగితో బూట్లను మోయించాడు. ఈ ఘటన గురువారం జాతీయ జెండా సాక్షిగా బాన్సువాడలో జరిగింది. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆర్డీవో రమేశ్ రాథోడ్ జెండా గద్దె వద్దకు బూట్లు వేసుకుని వెళ్లారు. గద్దె వద్ద బూట్లను విడువగా అటెండర్ ఆ బూట్లను మోసుకుంటూ పక్కకు తీసుకెళ్లి విడిచిపెట్టాడు. అటెండర్ బూట్లు మోసుకుంటూ వెళ్తున్న ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కాగా, పెద్దపల్లిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ జాతీయ పతాకాన్ని ఎగురవేసే క్రమంలో జెండా తలకిందులుగా వేలాడింది. దీంతో అక్కడున్న వాళ్లు గమనించి వెంటనే జెండాను కిందకు దింపి సరిచేశారు.

జెండా ఎగురవేసి... గుండెపోటుతో కుప్పకూలి

» వైద్య విద్యార్థి మృతి..నల్లగొండ జిల్లాలో విషాదం



అఖిలేశ్‌యాదవ్(ఫైల్)

దేవరకొండ, ఆగస్టు 15: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఇంటిపై జెండా ఎగురవేసిన ఓ వైద్య విద్యార్థి ఐదు నిమిషాల్లోనే గుండెపోటుతో మృతిచెందాడు. అప్పటిదాకా తమతో ఉన్న కుమారుడు కళ్లముందే మరణించడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటన నల్లగొండ జిల్లాలో బుధవారం జరిగింది. దేవరకొండకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు నక్క. వెంకటేశ్, సత్తెమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు నక్క. అఖిలేశ్‌యాదవ్(24) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజుల కిందట అఖిలేశ్ ఇంటికి వచ్చాడు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం తమ ఇంటిపై తండ్రితో కలిసి జాతీయ జెండాను ఎగురవేశాడు. 5 నిమిషాల అనంతరం గుండెలో నొప్పి వస్తోందని తండ్రికి చెప్పాడు. అఖిలేశ్‌ను ఆసుపత్రికి తరలించేలోగానే మృతి చెందాడు. అఖిలేశ్ మృతదేహానికి గురువారం దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్ గౌడ్, బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నివాళులర్పించారు.

అప్పుల బాధ భరించలేక రైతు ఆత్మహత్య



జాదవ్ భరత్ (ఫైల్)

బోథ్, ఆగస్టు 15: అప్పుల బాధ భరించలేక ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం సొకేర గ్రామానికి చెందిన రైతు జాదవ్ భరత్(50) పురుగుల మందు తాగి గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. జాదవ్ భరత్ తనకున్న నాలుగు ఎకరాల భూమిలో పత్తి, సోయాబీన్ పంటలను సాగుచేస్తున్నాడు. పంటల సాగుకు రూ.4 లక్షల వరకు అప్పులు చేశాడు. దీంతోపాటు ఇద్దరు కూతుళ్ల పెళ్లికి కొంత మేర అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో మదనపడుతుండేవాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం చేనుకు వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లి సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో చేనుకు వెళ్లి చూసే సరికి పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండటంతో బోథ్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు.

ఎడారి బతుకులు!

(మొదటిపేజీ తరువాయి)

వెళ్లారు. వీరిలో.. కువైత్, దుబాయ్, మస్కట్, సౌదీ అరేబియా, బహ్రెయిన్ తదితర దేశాలలో ఉన్న సుమారు 80వేల మంది గడ్డుపరిస్థితులలో కాలం వెళ్లదీస్తున్నారు. విజిట్ వీసాలపై వెళ్లినవారు ఆ వీసాల గడువు ముగియడంతో.. బిక్కుబిక్కుమంటూ భయంతో బతుకుతున్నారు. అక్కడి పోలీసులకు దొరికిపోయి జైళ్లపాలవుతున్నారు.

అనుమతులున్నవారు ఒక్కరూ లేరు..

గల్ఫ్ ఏజెంట్ల మోసాలను అరికట్టాల్సిన పోలీసు శాఖతో పాటు ఇతర శాఖలు పట్టించుకోకపోవడంతో వారి ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. నిబంధనల ప్రకారం అనుమతులు ఉన్న గల్ఫ్ ఏజెంట్లు ఒక్కరు కూడా కామారెడ్డి జిల్లాలో లేరు. టూర్స్ అండ్ ట్రావెల్స్ పేరుతో దుకాణాలను తెరిచి గల్ఫ్ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో సుమారు ఇలాంటివారు 100 మందికిపైగా ఉన్నారు. ప్రతి మండలంలో దాదాపు 10 మంది గల్ఫ్ ఏజెంట్లుగా చలామణి అవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద రైతులు, కూలీలు, యువకులకు మాయ మాటలు చెప్పి.. అరచేతిలో స్వర్గం చూపి.. గల్ఫ్ దేశాలకు పంపి మోసం చేస్తున్నారు. అయినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. గల్ఫ్ ఏజెంట్ల చేతిలో మోసపోయామంటూ ఫిర్యాదులు వచ్చినా.. ఏ ఒక్క ఏజెంట్ పైనా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. బాధితులు, వారి కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్లకు వెళ్లి ఫిర్యాదులుచేస్తున్నా పట్టించుకోవట్లేదనే విమర్శలున్నాయి.



రియాద్‌లో మృతిచెందిన మహ్మద్ షరీఫ్ కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్‌లో) షరీఫ్





దుబాయిలో మృతిచెందిన సిద్దిరాములు (ఫైల్)

అవగహన లేకనే..

గల్ఫ్ దేశమైనా.. మరే దేశమైనా ఉపాధి కోసం వెళ్లాలంటే అన్ని అనుమతులు, ధ్రువపత్రాలతో వెళ్లాల్సి ఉంటుంది. కానీ గ్రామీణ యువతకు సరైన అవగాహన లేక నకిలీ ఏజెంట్ల మాయలో పడిపోతున్నారు. ముఖ్యంగా.. గల్ఫ్ దేశాలకు వలస వెళ్లే ఎక్కువ మంది భారత ప్రభుత్వం వద్ద నమోదు చేసుకోరని.. దీంతో అక్కడికి వెళ్లాక ఏదైనా సమస్య ఎదురైతే వారికి భారత రాయబార కార్యాలయం నుంచి సరైన సమయంలో సహకారం అందడం లేదని గల్ఫ్ సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. నిజానికి.. గల్ఫ్ దేశాలకు వెళ్లే కార్మికులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడంతో పాటు మోసాలను తగ్గించడమే లక్ష్యంగా 2014లో తెలంగాణ ప్రభుత్వం 'తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్)'ను ఏర్పాటు చేసింది. యువతను చట్టబద్ధంగా ఉపాధి కోసం విదేశాలకు పంపే ఏజెన్సీగా టామ్‌కామ్ పని చేస్తుందని అప్పట్లో ఊదరగొట్టింది. కానీ ఆశించిన స్థాయిలో లక్ష్యం మాత్రం నెరవేరలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో పాటు మ్యానిఫెస్టోలోనూ పొందుపర్చింది. ఈ నేపథ్యంలో.. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గల్ఫ్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, కేరళ మాదిరిగా గల్ఫ్ దేశాలకి వెళ్లే వారికి ముందస్తు నైపుణ్య శిక్షణ, అక్కడ కేసుల్లో చిక్కుకున్న వారికి న్యాయ, వైద్య సహాయం అందించడం.. గల్ఫ్ ఏజెంట్ల ఆగడాలను నియంత్రించడం వంటి చర్యలు తీసుకోవాలని గల్ఫ్ దేశాల్లోని తెలుగు సంఘాల నేతలు కోరుతున్నారు. టామ్‌కామ్ ద్వారా వీసాలు జారీ చేస్తే ఏజెంట్ల వ్యవస్థ కనుమరుగయ్యే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

కన్నీళ్లకే కన్నీరొచ్చే...

కడుపు చేతపట్టుకుని గల్ఫ్ దేశాలకు వెళ్లి అక్కడ నానా కష్టాలపాలై నరకం అనుభవిస్తున్నవారు ఎందరో. వారిలో మచ్చుకు కొందరి కష్టాలు..

- కామారెడ్డి జిల్లా శాబ్దిపూర్ తండా గ్రామానికి చెందిన మహ్మద్ మున్నా ఉపాధి నిమిత్తం ఏడాది క్రితం సౌదీకి వెళ్లాడు. అప్పటికే అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉన్న ఆ కుటుంబం.. కొత్తగా మరో రూ.60వేలు అప్పుచేసి మరీ, ఆ డబ్బు ఏజెంట్ చేతిలో పెట్టి మున్నాను అక్కడికి పంపింది. ఏడాదిలో అతడు రూ.20 వేలు మాత్రమే ఇంటికి పంపాడు. మున్నా తండ్రి మహ్మద్ షరీఫ్ అదేంటని ప్రశ్నించగా.. నెల నెలా జీతం ఇవ్వట్లేదని, సమయానికి తిండి పెట్టట్లేదని మున్నా ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో కొడుకు కష్టాలు తీర్చేందుకు షరీఫ్ మరో రూ.70వేలు అప్పు చేసి, డ్రైవర్‌గా పనిచేసేందుకు రియాద్‌కు వెళ్లాడు. అక్కడ జూన్ 7న గుండెపోటుతో మృతిచెందాడు. పెద్ద దిక్కు మృతి చెందడం, పెద్ద కొడుకు అక్కడ చిక్కుకుపోవడంతో.. ఆ కుటుంబం రోడ్డునపడింది. ఈ నేపథ్యంలో పెద్ద కుమారుడు మున్నాను తిరిగి దేశానికి రప్పించేలా చూడాలని తల్లి ఫాతిమా ప్రభుత్వాన్ని వేడుకుంటోంది.
- జిల్లాలోని రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయికి చెందిన సిద్దిరాములు(46)కు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కూతురు పెళ్లికి రూ.6 లక్షలు అప్పు చేశాడు. ఆ అప్పు తీర్చేందుకు గల్ఫ్ వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఏజెంట్ మోసంతో అక్కడ.. ఆకలికి అలమటించి మరణించాడని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.
- రాజంపేటకు చెందిన జొన్నల రవి (38) ఉపాధి కోసం దుబాయ్‌కి వెళ్లాడు. అక్కడ కూలీ పని చేస్తూ అనారోగ్యానికి గురయ్యాడు. జనవరి 17న గుండెపోటుతో అక్కడే చనిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. దుబాయి వెళ్లేందుకు తన భర్త రూ.లక్ష అప్పు చేశాడని.. ఇప్పుడాయన చనిపోవడంతో తమ కుటుంబం వీధిన పడిందని భార్య లత ఆవేదన వ్యక్తం చేశారు.

కిలో బెండకాయ రూ.2.25!

» రవాణాచార్జీలు రావని చెల్కవద్దనే పారబోసిన రైతు

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 15: ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కకపోవడంతో ఓ రైతు పంటను తన చెల్క వద్దనే పారబోశాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో జరిగింది. మండలకేంద్రంలోని మహమూద్‌పట్నంలో ఏశబోయిన ఎల్లయ్య ఎకరం విస్తీర్ణంలో బెండకాయ, మరో ఎకరంలో వంకాయ సాగు చేస్తున్నాడు. బెండకాయలు విక్రయించేందుకు హోల్‌సేల్ వ్యాపారికి ఫోన్ చేయగా 22 కిలోల బస్తాను కిలో రూ.2.25ల చొప్పున రూ.50లకు అడిగాడని, అలాగే 22 కిలోల వంకాయలను రూ.220కి అడుగుతున్నారని రైతు వాపోయాడు. అసహనంతో రెండు క్వింటాళ్ల బెండకాయలను తన చెల్క వద్దే పారబోశాడు. ఈ ధరలతో కూలీ, రవాణా ఖర్చులు రావని ఆవేదన వ్యక్తం చేశాడు.



పారబోసిన బెండకాయలను చూపుతున్న ఎల్లయ్య

పంచాయతీ ఎన్నికలకు కసరత్తు

» ముగిసిన డాటాఎంట్రీ ఆపరేటర్ల శిక్షణ

» వార్డుల వారీగా ఓటరు జాబితా

» అంతా పూర్తయ్యాక.. టీఎస్‌పోల్ పోర్టల్‌లో వివరాలు

హైదరాబాద్, ఆగస్టు15 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తోంది. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సిద్ధం చేసిన ఓటర్ల తుది జాబితా ఆధారంగా.. పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్‌లిస్ట్ సిద్ధం చేస్తోంది. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలు.. ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఒకే ఇంట్లో ఉండే ఓటర్లకు వేర్వేరు పోలింగ్ బూత్‌లను కేటాయించారు. ఇలాంటి ఇబ్బందులు లేకుండా.. సంబంధిత వార్డు పరిధిలోనే పోలింగ్ బూత్ ఉండేలా రాష్ట్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం 32 జిల్లాల పరిధిలోని డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణనిచ్చింది. మంగళవారం ఈ శిక్షణ కార్యక్రమం ముగిసింది. దీంతో.. వెనువెంటనే గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసి.. పూర్తివివరాలను టీఎస్‌పోల్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారన్న దానిపై స్పష్టత లేకున్నా.. స్థానిక ఎన్నికల నిర్వహణపై సంబంధిత వర్గాల పరిధిలో మాత్రం చర్చ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, పంచాయతీరాజ్‌శాఖ, రాష్ట్ర ఎన్నికలసంఘం చేపట్టే కార్యక్రమాలపై రాజకీయ వర్గాలు ఆసక్తి కనబరుస్తున్నాయి.

ఎన్నికల సిబ్బంది నియామకంపై..

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారుల నియామకానికి రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే మార్గదర్శకాలను జారీ చేసింది. వీటికి అనుగుణంగా రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులు, సిబ్బంది నియామకాలను చేపట్టాల్సి ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీలుండగా.. పంచాయతీకి ఒకరు చొప్పున స్టేజ్-1 అధికారిని నియమిస్తారు. వీరు నామినేషన్ల స్వీకరణ నుంచి గుర్తుల కేటాయింపు వరకు దగ్గరుండి అన్ని పనులను నిర్వర్తిస్తారు. స్టేజ్-2 అధికారులు పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. వీరితోపాటు పోలింగ్ సిబ్బంది కూడా ఉంటారు. పంచాయతీల వారీగా వీరిని గుర్తించేందుకు కసరత్తు జరుగుతోంది. ప్రతి పోలింగ్ కేంద్రంలో 200 మంది వరకు ఓటర్లు ఉంటే.. ప్రిసైడింగ్ అధికారితోపాటు పోలింగ్ అధికారి ఉంటారు. 201 నుంచి 400 మంది ఓటర్లు ఉంటే.. ఒక ప్రిసైడింగ్ అధికారితోపాటు ఇద్దరు పోలింగ్ అధికారులు ఉంటారు. 401 నుంచి 650 మంది ఓటర్లు ఉంటే ప్రిసైడింగ్ అధికారితోపాటు ముగ్గురు పోలింగ్ అధికారులను నియమిస్తారు. 650 మంది కంటే ఎక్కువ ఓటర్లుంటే అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. ఎన్నికల సిబ్బందికి సంబంధించిన కసరత్తు ఇప్పటికే పూర్తయిందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి మార్గదర్శకాలు రాగానే.. వీరికి ఎన్నికల విధులకు సంబంధించి శిక్షణ ఇస్తారు.

ప్రాణవాయువు అందించి అప్పుల పాలు

» మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రి నుంచి రూ.81.64 లక్షల బకాయి

» బిల్లులు అందక సతమతం అవుతున్న పంపిణీదారుడు శ్రీనివాస్

» బీఆర్ఎస్ హయాం నుంచి పెండింగ్..

మహబూబాబాద్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో వేలాది రోగుల ప్రాణాలను రక్షించేందుకు ఆక్సిజన్ సిలిండర్లను అందించిన మహబూబాబాద్ శ్రీనివాస ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకుడు బాణాల శ్రీనివాస్.. బిల్లులు అందక లబోదిబో అంటున్నారు. ఆర్థిక ఇబ్బందులతో తల్లడిల్లుతున్నారు. మొత్తం రూ.81.64 లక్షలు రావాల్సి ఉండడం.. ఎంత మంది పెద్దలకు విన్నవించుకున్నా ఫలితం లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఎవరికి చెప్పుకొన్నా బాధ తీరలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో ఏంచేయాలో పాలుపోని స్థితిని ఎదుర్కొంటున్నారు. శ్రీనివాస్‌కు తెలంగాణ వైద్య విధాన పరిషత్ నుంచి రూ.29.40 లక్షలు, మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి రూ.52.23 లక్షలు రావాల్సి ఉంది. గతంలో నెలనెలా ఇచ్చినప్పటికీ.. కరోనా సమయంలో రోగుల కోసం సిలిండర్ల వాడకం పెరగడం, ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవడంతో చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. జూన్ 2021 నుంచి ఈ ఏడాది జూలై వరకు రూ.81.64 లక్షలు పెండింగ్‌లో పడ్డాయి. మధ్యమధ్యలో రూ.లక్ష వరకు మంజూరు చేస్తున్నా, పెద్దమొత్తంలో ఉన్నవాటిని చెల్లించడం లేదు. బకాయిల మంజూరు కోసం జిల్లా కలెక్టర్, డీఎంఈ, ఎమ్మెల్యేలు, ముఖ్య కార్యదర్శి చివరకు వైద్య, ఆరోగ్య మంత్రి పేషీలో కూడా వినతిపత్రం అందించినా ఫలితం దక్కలేదు. దీంతో శ్రీనివాస్ అప్పులు తెచ్చి వడ్డీలు కడుతూ ఆర్థికంగా చితికిపోయారు. అయినప్పటికీ జిల్లా ఆస్పత్రికి ఆక్సిజన్ సిలిండర్లను పంపిణీ చేస్తూనే ఉన్నారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి అయినా చొరవ చూపాలని ప్రాధేయపడుతున్నారు.

రూ. 50 వేలిస్తేనే సర్వే..!

లేకుంటే భూముల్లో కొలత చైన్ పడదు.. లంచాలివ్వకుంటే దరఖాస్తులు పెండింగ్

» నల్లగొండలో ల్యాండ్ సర్వే దారుణాలు

» 600పైన దరఖాస్తులకు గ్రహణం

» ఫలితంగా.. గ్రామాల్లో ఘర్షణలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

ధరణితో తంటాలు పడుతున్న రైతులకు సాంత్వన కలిగించేలా కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని తీసుకువచ్చేందుకు సర్కారు సన్నాహాలు చేస్తుంటే.. నల్లగొండ జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డుల విభాగంలో క్షేత్రస్థాయి సిబ్బంది మాత్రం రైతన్నలను జలగల్లా పట్టి పీడిస్తున్నారు. చేయి తడపనిదే పనికాదని తెగేసి చెబుతున్నారు. పదోపరకో అంటే ఫర్వాలేదు కానీ, సర్వే కోసం చైన్ పట్టుకుని పొలంలోకి దిగాలంటే.. రూ.50 వేలు డిమాండ్ చేస్తున్నారని భూయజమానులు వాపోతున్నారు. కొందరు సర్వే సిబ్బంది దరఖాస్తుల సీనియారిటీతో సంబంధం లేకుండా.. ముడుపులిచ్చిన వారికి వెంటనే పనిచేసి పెడుతున్నారు. సరిహద్దులను భూయజమానులకు అనుకూలంగా మార్చేందుకు బేరాలాడుతున్నారు. గ్రామాల్లో పొలంగట్టు పంచాయితీలకు కారణమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏడాదిన్నర కాలంగా 600పైగా సర్వే దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయంటే.. అవినీతి జాడ్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు..!



సర్వే సిబ్బంది అడిగే రూ.50 వేలు, ఆపైన ముడుపులు చెల్లిస్తే.. ఠంచన్‌గా పని పూర్తిచేస్తున్నారు. ఏడాదిన్నర కాలంగా 600కు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడం సర్వే విభాగంలో అవినీతిని ఎత్తిచూపుతోంది. లంచాలు చెల్లించలేని వారు తమ దరఖాస్తులకు మోక్షమెప్పుడంటూ రైతులు, భూయజమానులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా.. ఫలితం ఉండడం లేదు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో సిఫారసు చేయిస్తే.. సరిహద్దు పట్టాదారు రావడం లేదనో.. రికార్డులు అందుబాటులో లేవనో.. సిబ్బంది లేరనో సాకులు చెబుతూ కాలయాపన చేయడం రివాజుగా మారింది.

45 రోజుల నిబంధన

నిబంధనల ప్రకారం.. భూయజమానులు సర్వే కోసం మీసేవలో దరఖాస్తు చేసుకోవాలి. నాలుగు సర్వే నంబర్ల వరకు రూ.300, ఆపైన సర్వే నంబర్లకు అదనపు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. పౌరసేవల పట్టిక(సిటిజన్ చార్టర్) ప్రకారం సర్వే సిబ్బంది తమకు దరఖాస్తు అందిన 45 రోజుల్లో భూముల సర్వే పూర్తిచేయాలి. కానీ, నల్లగొండ జిల్లాలో మాత్రం నెలలు, ఏళ్లు గడిచినా సర్వేలు పూర్తవ్వడం లేదు.

ఒక్కొక్కరిదీ ఒక్కో బాధ

తిప్పర్తి మండలం అనిశెట్టిదుప్పలపల్లికి చెందిన భూయజమాని కన్నెబోయిన కొండయ్య తన భూమి సరిహద్దులు నిర్ధారించాలని కోరుతూ సెప్టెంబరు 2020లో దరఖాస్తు చేసుకున్నారు. సర్వే సిబ్బంది ఏదో ఒక సాకు చెబుతూ.. ఇప్పటికీ సర్వే జరపలేదు. సర్వేకు నాలుగేళ్లు పడుతుందా? అంటూ కొండయ్య ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నార్కట్‌పల్లి మండలం నెమ్మానికి చెందిన ఒక పట్టాదారు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పనికాలేదని వాపోయారు. మూడెకరాలకు గాను రూ.50 వేల లంచం ఇచ్చినా.. తప్పులతడకగా సర్వేచేశారని ఆరోపించారు. చివరకు గ్రామపెద్దల సమక్షంలో సర్దుబాటు చేసుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పైసలిస్తే.. సరిహద్దుల్నే మార్చేస్తారు

ముడుపుల మత్తులో సర్వేయర్లు, ఆ విభాగం సిబ్బంది తీరు భూయజమానులకు కొత్త సమస్యలను తెచ్చిపెడుతోంది. తమకు ముడుపులు ఇచ్చేవారికి అనుకూలంగా సరిహద్దులను మార్చేస్తుండడంతో గ్రామాల్లో ఘర్షణలు చోటుచేసుకుని, పోలీసు కేసులు నమోదైన దాఖలాలున్నాయి. దరఖాస్తు ఎవరు చేసినా.. నిబంధనల ప్రకారం సంబంధిత భూమికి చుట్టూ ఉన్న భూముల యజమానులకు నోటీసులు ఇచ్చి.. వారి సమక్షంలో సరిహద్దులు నిర్ధారిచాల్సి ఉంటుంది. ముడుపుల మత్తులో తూగుతున్న సర్వేయర్లు నిబంధనలను తుంగలో తొక్కుతూ.. దరఖాస్తుదారులతో అదనపు బేరాలు కుదుర్చుకుని, సరిహద్దులను మార్చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇలా సరిహద్దులను ఏకపక్షంగా మార్చడం వల్ల పలు మండలాల్లో ఘర్షణలు చోటుచేసుకుని, పోలీసు కేసులు నమోదయ్యాయి. ఇలా మిర్యాలగూడ డివిజన్‌లో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న భూమి విషయంలో దాయాదుల మధ్య పెద్ద వివాదం రేగింది. సర్వేయర్ల కొరత నేపథ్యంలో జిల్లాలో ఔట్‌సోర్సింగ్‌లో నియమించుకున్న సిబ్బందితో బాహాటంగా ముడుపులు డిమాండ్ చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డుల అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. ముడుపుల వ్యవహారం తన దృష్టికి రాలేదని, మీసేవలో దరఖాస్తు చేసుకున్నవారికి సీనియార్టీ ప్రకారం సర్వే నిర్వహిస్తామని పేర్కొన్నారు. ముడుపుల విషయంలో ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

తుపాకీతో కాల్చి చంపేస్తా

» దళిత మహిళకు ఎస్ఐ చిత్రహింసలు

» ఓ కేసు విషయంలో పలుమార్లు దాడి

» 3 నెలలుగా ఠాణాకు వచ్చిపోతున్న మహిళ


» బషీరాబాద్ ఎస్ఐ వేధిస్తున్నాడని ఆరోపణ

బషీరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కుమారుడి జాడ చెప్పాలని.. లేకుంటే తుపాకీతో కాల్చిచంపుతానని ఎస్ఐ బెదిరిస్తున్నాడని ఓ దళిత మహిళ వాపోయింది. మూడు నెలలుగా తనను స్టేషన్‌కు పిలిపించి చిత్రహింసలు పెడుతున్నాడని కన్నీటి పర్యంతమైంది. గురువారం పోలీస్ స్టేషన్ ఆవరణలో దీనంగా కూర్చున్న ఆమెను విలేకరులు పలకరించగా.. గోడును వెళ్లబోసుకుంది. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవల్గాకు చెందిన లోహడ నరేశ్(17) కాశీంపూర్ గ్రామానికి మేస్త్రీ పనికోసం వెళ్లి అదే గ్రామానికి చెందిన బాలిక(16)ను ప్రేమించాడు. ఇద్దరూ దళితులే. కొన్ని నెలలు ప్రేమించుకున్న వీరు మే 2న ఇళ్లలోంచి వెళ్లిపోయారు. తన కూతురిని నరేశ్ కిడ్నాప్ చేశాడని బాలిక తల్లిదండ్రులు బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో నరేశ్ తల్లి లోహడ కళావతిని ఎస్ఐ రమేశ్ కుమార్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించాడు. కుమారుడి జాడ చెప్పాలంటూ ఎస్ఐ బూతులు తిట్టాడని కళావతి వాపోయింది. కాల్చి చంపి పేపర్‌లో ఆ వార్త వేయిస్తానని బెదిరించాడని తెలిపింది. నరేశ్ ఆచూకీ తెలిసే వరకు రోజూ స్టేషన్‌కు రావాలని హుకుం జారీ చేశాడని చెప్పింది. దీంతో 3 నెలలుగా ఉదయం వచ్చి రాత్రి వరకూ ఠాణాలోనే కూర్చొని.. ఇంటికి పోతున్నానని వెల్లడించింది. కూలి పనులపై బతికే తాను రోజూ స్టేషన్‌కు వస్తుండటంతో పూట గడవడం కష్టంగా మారిందని వాపోయింది. ఎస్ఐ పలుమార్లు తన చేతులు, కాళ్లపై లాఠీతో కొట్టడంతో వాపులొచ్చాయని కన్నీటి పర్యంతమైంది. ఈ విషయమై విలేకరులు ఎస్ఐ స్పందన కోరగా.. 'ఏమైనా రాసుకోండి' అని సమాధానం ఇచ్చారు. కాగా, దళిత మహిళను వేధిస్తున్న ఎస్ఐపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. లేకుంటే దళిత సంఘాల ఆధ్వర్యంలో తాండూరు డీఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో కూర్చున్న కళావతి





సీతారామ ప్రాజెక్టు పూసుగూడెం పంప్‌హౌజ్ మోటార్ స్విచ్ ఆన్ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ; సీతారామ పూసుగూడెం పంప్‌హౌజ్ నుంచి కాల్వలోకి విడుదలవుతున్న గోదావరి జలాలు

చేసి చూపించాం

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించారు. కృష్ణా, గోదావరి జలాలతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తామని ప్రకటించారు. సీతారామ ప్రాజెక్టుకు ఎన్ని వేల కోట్లయినా ఖర్చుపెట్టి 2026 ఆగస్టు 15 నాటికి పూర్తి ఆయకట్టుకు నీరందిస్తామని చెప్పారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల పేరుతో గత ప్రభుత్వం మోసం చేసిందని, తాము అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని, 4.5 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. బీఆర్ఎస్ పాలన, కాంగ్రెస్ పాలనలో సాగునీటి ప్రాజెక్టులు, వ్యయాలపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని, డిప్యూటీ సీఎం భట్టి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ వస్తారని, బీఆర్ఎస్ నుంచి కేసీఆర్, బిల్లా-రంగాల్లో ఎవరు వస్తారో తేల్చుకోవాలని సవాల్ చేశారు. ఏ చౌరస్తాలోనైనా, ఏ సెంటర్‌లోనైనా చర్చకు సిద్ధమని పేర్కొన్నారు. జూలై 18 నుంచి కేవలం 27 రోజుల్లో రూ.18 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని.. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ 8 నెలల్లోనే నెరవేర్చామని వివరించారు. బీఆర్ఎస్ దివాళా తీసి బస్టాండ్లలో అడుక్కుతినే స్థాయికి వచ్చినా ఇంకా మారలేదని ధ్వజమెత్తారు. ప్రజలనే దోషులుగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అబద్ధాలు, అసత్యాలతో తిరుగుతున్న బిల్లా రంగాలు అవాకులు చవాకులు పేలుతున్నారని, 17 ఎంపీ స్థానాల్లో ఓడిపోయి, ఏడుచోట్ల డిపాజిట్లు రాని బీఆర్ఎస్‌ను బంగాళాఖాతంలో బొందపెడదామని పిలుపునిచ్చారు. సర్వాధికారం చెలాయించినవారు నేడు ఫామ్‌హౌజ్‌ల నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదన్నారు. వారిపై సానుభూతి చూపితే కాల నాగులకు పాలుపోసినట్లే అవుతుందని వ్యాఖ్యానించారు.

కేసీఆర్‌కు దడవం.. మోదీకి బెదరం

"బీజేపీని 8 లోక్‌సభ స్థానాల్లో గెలిపిస్తే కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చింది. ఆ పార్టీని కూడా ప్రజలు బొంద పెట్టడం ఖాయం. కేసీఆర్‌కు దడవం. మోదీకి బెదరం. ఖమ్మం జిల్లాలో రైతులకు బేడీలేసి జైలుకు పంపిన, చంటి బిడ్డల తల్లులపై కర్కశంగా పోలీసులతో దాడులు చేయించిన చరిత్ర బీఆర్ఎస్‌ది. ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను అందించేందుకు రూ.18 వేల కోట్లతో సీతారామ ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తే రూ8 వేల కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరానికి కూడా నీరందించలేకపోయారు. మేం 2026 ఆగస్టు 15 నాటికి పూర్తిచేసి 7 లక్షల ఎకరాలకు నీరందిస్తాం. నెల జీతాలు చెల్లించలేని దుస్థితి నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించాం. 90 రోజుల్లో 30 వేల ఉద్యోగాలు కల్పించాం. డీఎస్సీ ద్వారా 11 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తున్నాం. గ్రూప్-1, 2, 3, ఇతర నియామకాల ద్వారా ఈ ఏడాది 65 వేల ఉద్యోగాలు కల్పించబోతున్నాం" అని రేవంత్ పేర్కొన్నారు.

హరీశ్.. అభినందించకున్నా.. అవమానించొద్దు

బీఆర్ఎస్ వదిలేసిన ప్రాజెక్టులను పూర్తి చేస్తున్న తమను హరీశ్ అభినందించకపోయినా పర్లేదని.. అవమానించేలా మాట్లాడొద్దని సీఎం సూచించారు. ప్రాజెక్టులను 80, 60, 40, 20 శాతం పూర్తయినవిగా గుర్తించి ప్రాధాన్య క్రమంలో పూర్తి చేస్తున్నామని తెలిపారు. తాము ఇక్కడికి నీళ్లు చల్లుకోవడానికి రాలేదని, గోదావరి తల్లే తమను నీటితో తడుపుతోందని అన్నారు. హరీశ్ అవసరమైతే సీతారామ జలాలను చల్లుకోవాలని సూచించారు. రాలేకపోతే రెండు సీసాల్లో కేసీఆర్, హరీశ్‌కు పంపాలని మంత్రి తుమ్మలకు సూచించారు. ఆ నీటిని ఎలా కలుకొపుంటారో వారికి తెలుసునని ఎద్దేవా చేశారు. సీతారామలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 40 శాతం పనులే జరిగాయని, ఎకరానికి కూడా నీరు ఇవ్వలేదన్నారు. రూ.10 వేల కోట్ల పని ఉండగా 90 శాతం పనులు పూర్తయినట్లు ఎలా చెబుతున్నారని హరీశ్‌ను సీఎం ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏనాడూ నీళ్ల కోసం రోడ్డెక్కని మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, హరిప్రియలు ఇప్పుడు ధర్నాలు చేయడం చూస్తుంటే తమ ప్రభుత్వం తప్పకుండా నీళ్లిస్తుందనే నమ్మకం ప్రజల్లో కలుగుతుందన్నారు.

సాగర్ రాకపోయినా ఖమ్మం రైతులకు ఇబ్బంది ఉండదు

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కేసీఆర్ కుటుంబం ఆగం చేసిందని, ప్రాజెక్టుల రీ డిజైన్ పేరుతో కమీషన్లు దండుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ బాగోతం బయట పడుతుందనే సీతారామకు డీపీఆర్ ఇవ్వలేదన్నారు. భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెంలో సీతారామ ఎత్తిపోతల పంప్‌హౌజ్ స్విచాన్ చేసి నీటిని విడుదల చేశారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో పైలాన్‌ను ఆవిష్కరించి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాగార్జున సాగర్ నీరు రాకపోయినా ఖమ్మం జిల్లా ఆయకట్టుకు ఇబ్బంది లేకుండా గోదావరి జలాలను వైరా జలాశయానికి అనుసంధానం చేశామన్నారు. ఎన్కూర్ లింక్ కెనాల్ పనులను డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఉత్తమ్ యుద్ధప్రాతిపదిక పూర్తి చేయించారని ప్రశంసించారు. కేసీఆర్ ప్రాజెక్టులకు రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు పెట్టినా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు మాత్రం నీళ్లు ఇవ్వలేకపోయారన్నారు. నాలుగేళ్లుగా పంపుహౌస్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదన్నారు. కేసీఆర్, హరీశ్ బోగస్ మాటలు చెప్తారు కాబట్టే ఆ పార్టీ నేతలు నీళ్ల కోసం ఆందోళన చేయలేదని ఎద్దేవా చేశారు.



వైరా సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్; సభకు హాజరైన మహిళలు, రైతులు

ఢిల్లీకి సీఎం రేవంత్

- నేడు సోనియా, రాహుల్‌తో పాటు కాంగ్రెస్ అగ్ర నేతలతో భేటీ
- పీసీసీ చీఫ్, మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవులపై చర్చ
- రుణమాఫీపై వరంగల్ కృతజ్ఞత సభకు సోనియాకు ఆహ్వానం

హైదరాబాద్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లారు. శుక్రవారం ఆయన అగ్ర నేతలతో సమావేశం కానున్నారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. సోనియా, రాహుల్‌గాంధీతో సమావేశమై టీపీసీసీ అధ్యక్షుడి నియామకం, మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల భర్తీపై చర్చించనున్నారు. అనంతరం తుది నిర్ణయం తీసుకోనున్నారు. పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీలో టీపీసీసీ కార్యవర్గంపైన చర్చించనున్నారు. టీపీసీసీలో నాలుగు కార్యనిర్వాహక అధ్యక్ష పదవులనూ భర్తీ చేసేందుకు అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. రెడ్డి, మైనార్టీ వర్గాలకు చెరోటి కేటాయించే అవకాశాలున్నాయి. కాగా, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రుణ మాఫీ చేసినందున రైతులతో వరంగల్‌లో ఏర్పాటు చేయనున్న భారీ సభకు సోనియాను సీఎం ఆహ్వానించనున్నట్లు తెలిసింది. 32.50 లక్షల మంది రైతులను రుణ విముక్తులను చేసేందుకు ప్రభుత్వం స్వల్ప వ్యవధిలోనే రూ.31 వేల కోట్ల కేటాయించడాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వరంగల్ సభను తలపెట్టారు. కాగా, టీపీసీసీ చీఫ్ రేసులో బీసీల నుంచి మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, ఎస్టీల నుంచి ఎంపీ బలరాంనాయక్, ఎస్సీల నుంచి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ ఉన్నారు.

మానస పుత్రిక అంటూ సవతి ప్రేమ చూపారు: భట్టి



సీతారామ ప్రాజెక్టును మానసపుత్రికగా చెప్పుకొంటున్న కేటీఆర్, హరీశ్‌రావులు దశాబ్ద కాలంలో చుక్క నీరు కూడా అందించలేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో సీతారామ, కాళేశ్వరం ప్రాజెక్టుల్లో రూ.వేల కోట్ల అవినీతి, అక్రమాలు జరిగాయని, ఉత్తమ్‌తో కలిసి చర్చకు వస్తానని, కేసీఆర్, హరీశ్ సిద్ధంగా ఉన్నారా? అని వైరా సభలో సవాల్ విసిరారు. వైఎస్ శంకుస్థాపనలు చేసిన ఇందిరా, రాజీవ్ సాగర్‌ల డిజైన్లు మార్చి మొత్తం ప్రాజెక్టునే కనుమరుగు చేశారని ఆరోపించారు. రూ.22 వేల కోట్లు దోపిడీ చేసేందుకు.. రైతాంగాన్ని మోసం చేశారని మండిపడ్డారు. ఆరోపించారు.

చరిత్ర ఎరుగని రుణమాఫీ ఇది: తుమ్మల



మంత్రి తుమ్మల మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఒకే పంట కాలంలో నెల వ్యవధిలో ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణ మాఫీ చేసిన చరిత్ర లేదన్నారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా రేవంత్, భట్టి పట్టుబట్టి మాఫీ చేసి చూపించారని కొనియాడారు. రూ.2 లక్షలకు పైగా రుణాలున్న రైతులు అదనంగా ఉన్న డబ్బు చెల్లించిన వెంటనే వారికి రుణమాఫీ జరుగుతుందన్నారు. సీతారామ ద్వారా కృష్ణా జలాతో గోదావరి జలాలను అనుసంధానం చేయడం ఖమ్మం జిల్లా రైతుల అదృష్టమని పేర్కొన్నారు. సీతారామను నాలుగు నెలల్లోనే పూర్తి చేయడం కోసం రూ.600 కోట్లు కేటాయించి జలయజ్ఞమే నిర్వహించామన్నారు.

కష్టనష్టాలు ఎదురైనా హామీల అమలు: పొంగులేటి



కృష్ణా, గోదావరి జలాలను ఖమ్మంకు తీసుకురావాలనే లక్ష్యంతో వైఎస్ఆర్ ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం కుళ్లు, కుతంత్రాలతో వ్యవహరించిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ ఆకాంక్షలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చారన్నారు. రైతును రాజును చేస్తామన్న రాహుల్ గాంధీ వరంగల్ డిక్లరేషన్ హామీని అమలు చేశారని తెలిపారు. అన్ని సమస్యలను అధిగమించి రూ.2లక్షల రుణమాఫీ అమలు చేశామన్నారు.

సీతారామ ప్రారంభోత్సవం నా అదృష్టం: ఉత్తమ్



సీతారామ ద్వారా ఖమ్మంను సస్యశ్యామలం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేసిందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పంప్ హౌజ్ ప్రారంభంలో పాల్గొనడం తన అదృష్టం అభివర్ణించారు. వచ్చే ఏడాదికి ఖమ్మంలో 7 లక్షల ఎరాలకు నీరిస్తామని చెప్పారు. రుణ మాఫీ ఘనత దేశ చరిత్రలో లిచిపోతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్ష మాఫీ ప్రకటించి ఐదేళ్ల సాగదీసి రైతులను మోసం చేసిందని విమర్శించారు.



రాజ్‌భవన్‌లో ఎట్‌హోం కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్, స్పీకర్ ప్రసాద్‌కుమార్, మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు

ఎట్ హోంకు సీఎం రేవంత్

- డుమ్మా కొట్టిన బీఆర్ఎస్ నాయకులు
- గవర్నర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీఎం

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాజ్‌భవన్‌లో ఎట్ హోం కార్యక్రమం నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఇతర కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ జితేందర్, ఇంటిలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి, హైదరాబాద్ సీపీ శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు హాజరయ్యారు. ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి నేరుగా రాజ్‌భవన్‌కు చేరుకున్నారు. ఎట్ హోం కార్యక్రమంలో పాల్గొన్నారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందించారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. బీఆర్ఎస్ నాయకులు గైర్హాజరయ్యారు. కార్యక్రమానికి వర్షం వల్ల అంతరాయం ఏర్పడింది. వర్షంలోనే గవర్నర్ అతిథుల్ని కలిశారు. వర్షం నీరు కార్యక్రమం జరుగుతున్న ప్రాంగణంలోకి వచ్చి చేరడంతో కొందరు అతిథులు కార్యక్రమం ముగియక ముందే అక్కడి నుంచి వెనుదిరిగారు.

జాతీయ జెండా ఆవిష్కరించిన గవర్నర్

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాజ్‌భవన్ దర్బార్ హాల్ వద్ద గురువారం ఉదయం జాతీయ జెండా ఆవిష్కరించారు. రాజ్‌భవన్ అధికారులు, సిబ్బంది, గవర్నర్ ముఖ్య సలహాదారు బుర్రా వెంకటేశం, ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జన్మదిన వేడుకలు రాజ్‌భవన్‌లో గురువారం నిరాడంబరంగా జరుపుకొన్నారు. యాదాద్రి వేద పండితులు ఆయనకు వేద ఆశీర్వచనం చేశారు.

బస్తీలో వాట్సాప్ లొల్లి

సమస్యలపై వాట్సాప్ గ్రూపులో బీజేపీ నాయకురాలి విమర్శలు

- ఆమెపై మేయర్ విజయలక్ష్మి మనుషులు దాడి చేసినట్టు ఆరోపణ
- నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం.. పోలీసులకు ఫిర్యాదు
- మేయర్ మనుషులు బెదిరిస్తున్నారంటూ ఠాణాకు గ్రూపు సభ్యులు

బంజారాహిల్స్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): బస్తీలో సమస్యలను పరిష్కరించుకునేందుకు ఏర్పాటు చేసుకున్న వాట్సాప్ గ్రూప్.. రాజకీయ పార్టీల మధ్య విభేదాలకు, గొడవలకు కారణమవుతోంది. మాటా మాటా పెరిగి చివరకు ఆత్మహత్యాయత్నం దాకా వెళ్లి.. ఆ పంచాయితీ పోలీసుస్టేషన్‌కు చేరింది. నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రాతినిధ్యం వహిస్తున్న బంజారాహిల్స్ డివిజన్‌లో ఎన్‌బీటీ నగర్ బస్తీ ఉంది. మేయర్ నివాసం అక్కడే ఉంది. ఇటీవలికాలంలో బస్తీకి చెందిన సుమారు 800 మంది ఇంటి యజమానులు, అధికారులు ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. అందులో పలు సమస్యల గురించి బస్తీవాసులు గ్రూప్‌లో పోస్టు చేస్తుంటే.. అధికారులు సమాధానం చెబుతున్నారు. నాలుగు రోజుల క్రితం.. బస్తీ సమస్యలను ఎవరూ పట్టించుకోవట్లేదంటూ బీజేపీకి చెందిన పావని అనే నాయకురాలు గ్రూప్‌లో విమర్శలుచేశారు. బస్తీని ఇలాగే వదిలేస్తే మరో బంగ్లాదేశ్‌గా మారుతుందంటూ పోస్టు పెట్టారు. ఆమె అలా విమర్శించడం సరైన పద్ధతి కాదని గ్రూప్ సభ్యులు అభిప్రాయపడ్డారు. అలా అనడం తప్పని పావని అంగీకరించడంతో వివాదం సద్దుమణిగింది. కానీ గురువారం పావని ఇంట్లో ఉండగా మేయర్‌కు చెందిన మనుషులు ఆమె నివాసానికి వెళ్లి వాగ్వాదానికి దిగారని.. ఆమెను కొట్టి రోడ్డు మీదకు తీసుకువచ్చి దుర్భాషలాడారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మనస్తాపానికి గురైన పావని నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రస్తుతం మహావీర్ ఆసుపత్రిలో కోలుకుంటున్న ఆమె.. మేయర్ మనుషులపై బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గ్రూప్ సభ్యుల ఫిర్యాదు..

బస్తీ సమస్యలపై గ్రూప్‌లో చర్చిస్తుండడంపై కక్ష పెట్టుకుని.. మేయర్ మనుషులు తమపై బెదిరింపులకు పాల్పడుతున్నారని గ్రూప్‌కు చెందిన 27 మంది సభ్యులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బస్తీలో ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న ఖాళీ మైదానంలో కొంత మంది అక్రమంగా పార్కింగ్ చేసుకొని గంజాయిలాంటి మత్తు పదార్థాలు వినియోగిస్తుండటంతో బస్తీ వాసులంతా కలిసి అక్కడ 'నో పార్కింగ్' బోర్డు ఏర్పాటు చేశామని ఫిర్యాదులో పేర్కొన్నారు. గురువారం అక్కడ జెండా ఎగురవేసేందుకు వచ్చిన మేయర్, ఆమె మనుషులు.. ఆ బోర్డును కాలితో తన్ని బెదిరింపు ధోరణిలో మాట్లాడారన్నారు. సమస్యలపై నిలదీసినందుకు.. మేయర్ కూడా బెదిరింపు ధోరణిలో వాట్సాప్‌లో మెసేజ్‌లు పెడుతున్నారని ఆరోపించారు. కాగా.. బస్తీ సమస్యలపై తాను వాట్సాప్ గ్రూప్‌లో నిలదీసినందుకు మేయర్ తన ఇంటిని పడగొట్టిస్తానంటూ బెదిరించారని బీఆర్ఎస్ నాయకుడు రాజు ఆరోపించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

వార్ధా నదిపై బ్యారేజీ..?

- అక్కడి నుంచి నేరుగా ఎల్లంపల్లికి నీరు
- తుమ్మిడిహెట్టి దిగువన రబ్బర్ డ్యామ్
- గ్రావిటీతో సుందిళ్లకు ప్రాణహిత నీరు
- అధికారుల పరిశీలనలో కొత్త ప్రాజెక్టులు
- తుమ్మిడిహెట్టి బ్యారేజీపై పునరాలోచన

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు కట్టి.. ఆ నీళ్లను గ్రావిటీతో ఎల్లంపల్లికి తరలిస్తామని చెబుతున్న కాంగ్రెస్ సర్కారు.. దానికి ప్రత్యామ్నాయంగా మరో రెండు ప్రాజెక్టులను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా తుమ్మిడిహెట్టి ఎగువన వార్ధా నదిపై ఒక బ్యారేజీ, దిగువన ప్రాణహితపై ఒక రబ్బర్ డ్యామ్ కడితే ఎలా ఉంటుందని యోచిస్తున్నట్లు సమాచారం. ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ కట్టడానికి మహారాష్ట్ర అంగీకారం తెలిపినా.. పనులు ప్రారంభిస్తే ఆ రాష్ట్రం సహకరించే అవకాశాల్లేవని భావిస్తున్న ప్రభుత్వం.. ఆ బ్యారేజీ నిర్మాణంపై పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. కొత్త ప్రతిపాదనల ప్రకారం.. వార్ధా ప్రాజెక్టులో భాగంగా కట్టే బ్యారేజీ నుంచి నీటిని ఎల్లంపల్లికి మళ్లించనున్నారు. దీనికోసం ఇప్పటికే ప్రాణహిత-చేవెళ్ల కింద 71.5 కి.మీ. దాకా(మైలారం దాకా) కట్టిన కాల్వలను వినియోగించుకోనున్నారు. మైలారం వద్ద పంప్‌హౌస్ నిర్మించి ఎల్లంపల్లికి నీటిని ఎత్తిపోయనున్నారు. తుమ్మిడిహెట్టి దిగువన ప్రాణహితపై కట్టే రబ్బర్ డ్యామ్ నుంచి గ్రావిటీతో నీటిని.. గోదావరిపై ఎల్లంపల్లి దిగువన ఉన్న సుందిళ్ల బ్యారేజీకి మళ్లించనున్నారు. రబ్బర్ డ్యామ్‌కు మహారాష్ట్ర అభ్యంతరాలు తెలిపే అవకాశాలుండవని భావిస్తున్నారు.

గతంలోనే వార్ధాపై కసరత్తు..

ఆసిఫాబాద్ జిల్లా గుండాయిపేట వద్ద రూ.4,874 కోట్లతో వార్ధా నదిపై ప్రాజెక్టు కట్టాలని గత ప్రభుత్వం ప్రతిపాదించింది. డీపీఆర్‌ను సిద్ధం చేసి, అనుమతుల కోసం 2023 మే 11న కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ)లో దాఖలు చేసింది. సీడబ్ల్యూసీలోని కొన్ని విభాగాలు డీపీఆర్ పరిశీలనను పూర్తిచేసినప్పటికీ.. గత ప్రభుత్వం వార్ధాకు పాలనా అనుమతులు ఇవ్వలేదు. దీంతో ప్రాజెక్టుకు టెండర్లు పిలవలేదు. ఇప్పుడు ఆ ప్రాజెక్టును యథాతథంగా కొనసాగించాలని కాంగ్రెస్ ప్రభుత్వం యోచిస్తోంది. వార్ధాపై బ్యారేజీ, ప్రాణహితపై రబ్బర్ డ్యామ్ కట్టే ప్రతిపాదనలకు అధికారులు ఏకకాలంలో తుదిరూపు ఇచ్చి.. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి అందిస్తారని తెలుస్తోంది.

తక్కువ వ్యయంతో.. ఎక్కువ ఆయకట్టు..

ప్రాజెక్టుల నిర్మాణానికి భారీగా నిధులు సమకూర్చే ఆర్థిక పరిస్థితులు రాష్ట్రంలో లేవు. పెద్ద మొత్తంలో అప్పులు ఉండటంతో తక్కువ వ్యయంతో ఎక్కువ ఆయకట్టు సాధించే సూత్రంతోనే రబ్బర్ డ్యామ్ ప్రతిపాదనను తెరపైకి తెచ్చినట్లు సమాచారం. గత ప్రభుత్వం నీటి పారుదల ప్రాజెక్టులపై రూ.1.80 లక్షల కోట్లకు పైగా ఖర్చుచేసినా.. ఆశించిన స్థాయిలో ఆయకట్టుకు నీరందలేదని కాంగ్రెస్ సర్కారు గుర్తించింది. అయితే కీలక ప్రాజెక్టుల హెడ్‌లు కట్టినా.. కాలువల నిర్మాణం చేపట్టలేదు. అందువల్లే సొమ్మంతా హెడ్‌వర్క్‌లకే ఆవిరై పోయింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో లింక్-1లో రూ.27 వేల కోట్లను మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో ఖర్చుచేయగా.. కీలకమైన మేడిగడ్డ కుంగిపోయింది. దీన్ని శాశ్వత ప్రాతిపదికన పునరుద్ధరించడానికి మూడేళ్లకుపైగా పట్టే అవకాశం ఉంది. దాంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు ఇచ్చే ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించే తుమ్మిడిహెట్టికి దిగువన రబ్బర్ డ్యామ్ చేపట్టే ప్రతిపాదనలను అధికారులు పరిశీలిస్తున్నారని సమాచారం.

2 లక్షల వరకు రుణమాఫీ పూర్తి!

- ఆపై రుణాలున్న రైతులకు 4వ విడతలో
- తర్వాతే ఈ 3 స్లాబుల్లో మిగిలినవారికి
- ఇప్పటివరకు మాఫీ చేసిన సొమ్ము రూ. 17,870 కోట్లు

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల వరకు రుణమాఫీ ప్రక్రియను పూర్తిచేసింది. తొలి విడతలో లక్ష వరకు, రెండో విడతలో లక్షన్నర వరకు, మూడో విడతలో రూ. 2 లక్షల వరకున్న బకాయిలను మాఫీచేసింది. అయితే ఈ కేటగిరీల్లో ఇంకా కొందరు రైతులు విఁగిలిపోయారు. రేషన్ కార్డులులేని, సాంకేతిక సమస్యలతో అనర్హుల జాబితాలో చేరిన రైతులకు ఇంకా రుణమాఫీ చేయాల్సి ఉంది. ఈ మూడు కేటగిరీల్లో కలిపి ఇప్పటివరకు 22,22,067 మంది రైతులకు రూ. 17,869.26 కోట్లు మాఫీచేశారు. రెండు లక్షల కంటే ఎక్కువ అప్పు ఉన్న రైతులతోపాటు, మొదటి మూడు స్లాబుల్లో మిగిలిపోయిన రైతులకు నాలుగో విడతలో రుణమాఫీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కాగా.. నెల రోజుల క్రితం ప్రభుత్వం రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించింది. జూలై 15న మార్గదర్శకాలతో కూడిన జీవోను విడుదల చేసింది. జూలై 18న మొదటి విడత, 30న రెండో విడత, గురువారం మూడో విడత రుణమాఫీ చేసింది.

రూ.5,644 కోట్లు విడుదల

మూడో విడత రుణమాఫీలో భాగంగా పంద్రాగస్టు రోజున రూ. 5,644.24 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రెండు లక్షల కేటగిరీలో ఉన్న 4,46,832 మంది రైతులకు గురువారం రుణమాఫీ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఖమ్మం జిల్లా వైరా బహిరంగ సభలో లబ్ధిదారులకు చెక్కులను పంపిణీచేసి మూడో విడత రుణమాఫీని ప్రారంభించారు. గురువారం బ్యాంకులకు సెలవు కావటంతో.. శుక్ర, శనివారాల్లో ఈ డబ్బులు రైతుల ఖాతాల్లో జమకానున్నాయి.

జిల్లాల వారిగా మూడు విడతల్లో చేసిన రుణమాఫీ

జిల్లా పేరు	మాఫీచేసిన లోన్ అకౌంట్లు	మాఫీచేసిన రుణం (రూ.కోట్లలో)	జిల్లా పేరు	మాఫీచేసిన లోన్ అకౌంట్లు	మాఫీచేసిన రుణం (రూ.కోట్లలో)
ఆదిలాబాద్	57832	623.04	కొత్తగూడెం	56969	400.60
నిర్మల్	64994	592.10	నల్లగొండ	1,72,931	1427.21
ఆసిఫాబాద్	48119	432.14	సూర్యాపేట	1,00,286	746.15
మంచిర్యాల	56140	464.61	భువనగిరి	64289	523.44
నిజామాబాద్	86715	647.34	మహబూబ్‌నగర్	77592	598.24
కామారెడ్డి	89361	644.33	నాగర్‌కర్నూల్	1,01,747	845.25
కరీంనగర్	77735	590.55	గద్వాల	49681	427.10
జగిత్యాల	67243	529.82	వనపర్తి	51355	407.71
పెద్దపల్లి	51724	377.53	నారాయణపేట్	58173	503.27
రాజన్న సిరిసిల్ల	43951	347.90	రంగారెడ్డి	90821	682.84
వరంగల్	60692	468.16	వికారాబాద్	85522	719.83
హనుమకొండ	40337	333.31	మేడ్చల్	3141	19.77
జనగామ	50214	438.40	మెదక్	86648	631.13
మహబూబాబాద్	60317	531.69	సంగారెడ్డి	98053	845.65
ములుగు	22621	194.24	సిద్దిపేట	1,00,792	829.82
భూపాలపల్లి	30600	275.99	హైదరాబాద్	7	0.06
ఖమ్మం	1,15,465	770.04	మొత్తం	22,22,067	17,869.26

డ్రగ్స్ దొరికితే.. అడ్మిషన్ రద్దు!

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో డ్రగ్స్‌తో పట్టుబడే విద్యార్థుల అడ్మిషన్లను రద్దు చేయాలని భావిస్తోంది. ఈ అంశంపై మరింత లోతుగా చర్చించేందుకు డీజీపీ జితేందర్, విద్యాశాఖ అధికారులు, వర్సిటీల ఇన్‌చార్జి వీసీలు, యాంటీ-నార్కోటిక్స్ బ్యూరో అధికారులు శనివారం భేటీ కానున్నారు. వర్సిటీలు, కాలేజీలు, ఇతర విద్యాసంస్థల్లో డ్రగ్స్, ర్యాగింగ్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఇప్పుడు ఉన్న చట్టాల ప్రకారం డ్రగ్స్, ర్యాగింగ్‌లను పూర్తి స్థాయిలో నియంత్రించవచ్చా? మరిన్ని కఠినమైన నిబంధనలను తీసుకురావాలా? అనే అంశంపై మేథోమదనం చేయనున్నారు. ప్రస్తుత చట్టాలు, నిబంధనల ప్రకారం ఒక విద్యార్థి వద్ద డ్రగ్స్ లభిస్తే.. కౌన్సెలింగ్ ఇచ్చి, వదిలి వేయాలి. అయితే.. దీని వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని, అడ్మిషన్ రద్దు వంటి కఠిన చర్యలు తీసుకుంటే.. విద్యార్థులు డ్రగ్స్ జోలికి వెళ్లేందుకు సాహసించరని అధికారులు భావిస్తున్నారు. ఆ మేరకు నిబంధనలను సవరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

రైతు ద్రోహమే కాదు... దైవ ద్రోహానికీ పాల్పడ్డ రేవంత్

ఇంతలా దిగజారిన ముఖ్యమంత్రిని చూడలేదు

రైతు రుణమాఫీ మాట తప్పారు : హరీశ్‌రావు



హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): 'అధికారంలో ఉండగా మొదటి దఫాలో రూ.లక్ష దాకా మేము రుణమాఫీ చేస్తే 35 లక్షల మందికి రైతులకు రూ.17 వేల కోట్లు ఖర్చు అయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా రూ.2 లక్షల దాకా రుణమాఫీ చేస్తే 22 లక్షల మంది రైతులే ఉంటారా...? రూ17,869 కోట్లు మాత్రమే అవుతాయా...?, ఈ ఒక్క విషయంతోనే మీ రుణమాఫీ పచ్చి అబద్ధమని తేలిపోయింది' అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. దగా చేశారనన్నది స్పష్టంగా తేలిపోయిన తర్వాత రాజీనామా ఎవరు చేయాలి? ఏటిలో దుంకి ఎవరు చావాలి? అని నేడొక ప్రకటనలో ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి తాను ముఖ్యమంత్రి స్థాయికి తగ్గట్టుగా ప్రవర్తించలేదనే విషయం ప్రతీ సందర్భంలోనూ నిరూపితమైందని, ఉమ్మడి ఏపీతోపాటు తెలంగాణ చరిత్రలో ఇంతగా దిగజారిన దిక్కుమాలిన ముఖ్యమంత్రి ఇంకెవరూ లేరని స్పష్టం చేశారు. దేవుళ్ల మీద ఒట్లు పెట్టుకొని కూడా మాట మీద నిలబడక పోగా, నిస్సిగ్గుగా బీఆర్ఎస్ మీద, నామీద అవాకులు చెవాకులు పేలారని ఆక్షేపించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సోనియా గాంధీ పుట్టిన రోజు కానుకగా డిసెంబరు 9 నాటికి రూ.40వేల కోట్ల రైతు రుణ మాఫీ ఏకకాలంలో చేస్తామని రేవంత్ ప్రకటించారని, దాన్ని నెరవేర్చలేక పార్లమెంట్ ఎన్నికల ముందు మరో నాటకానికి తెరలేపి, ఆగస్టు 15 వరకు రూ.31వేల కోట్లు మాఫీ చేస్తానని ఊదరగొట్టారని గుర్తు చేశారు. అయినా ఎవరూ నమ్మడం లేదని ప్రతీ ఊరి దేవుడి మీద ప్రమాణాలు కూడా చేశారని విమర్శించారు. రైతు ద్రోహానికే కాకుండా దైవద్రోహానికీ పాల్పడ్డారని మండిపడ్డారు. ముఖ్యమంత్రిగా దేవుళ్ల మీద ఒట్టుపెట్టి మాట తప్పి, చేసిన అపచారానికి వెంటనే ప్రాయశ్చిత్తం చేసుకోవాలని సూచించారు. 'కానీ ఆ సంస్కారం నీకు లేదు, నీలో ఉన్నది వికారమే తప్ప, సంస్కారం కాదు' విమర్శించారు. రేవంత్ దైవ ద్రోహానికి గాను తెలంగాణ మీద ఆగ్రహించవద్దని ముక్కోటి దేవుళ్లకు మొక్కుతున్నానని పేర్కొన్నారు. ఏ దేవుళ్ల మీద ఒట్టు పెట్టి మాట తప్పిండో... ఆ దేవుళ్లందరి గుడుల దగ్గరికి త్వరలో తానే వెళ్లి, రేవంత్ రెడ్డి చేసిన తప్పు తెలంగాణ ప్రజలకు ముప్పుగా మారొద్దని ఆ దేవుళ్లను ప్రార్థించి వస్తానని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని రైతుల్ని దగా చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కేవలం రూ.లక్ష రుణమాఫీకే బీఆర్ఎస్ పాలనలో రూ.17 వేల కోట్లు ఖర్చయితే.. ఇప్పుడు రూ.2 లక్షల రుణమాఫీకి రూ.17,900 కోట్లు ఎలా అవుతుందని ప్రశ్నించారు.

రాష్ట్రంలో మూడ్రోజులు వర్షాలు

అక్కడక్కడ భారీ వానలు కురిసే చాన్స్.. మెదక్ జిల్లా గుమ్మడిదలలో 9.1 సెం.మీ.

- హైదరాబాద్‌లో కుండపోత వాన..
- రెండ్రోజుల్లో కృష్ణాకు మళ్లీ వరదలు!
- సాగర్ 2 గేట్ల నుంచి నీటి విడుదల
- తుంగభద్రలో స్టాప్‌లాగ్ ఏర్పాటు పనులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)


హైదరాబాద్ నగరంలో భారీ వర్షానికి రోడ్డుపైనే నీట మునిగిన కారు

రాష్ట్రంలో మూడ్రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. అక్కడక్కడ భారీ వర్షాలు కూడా కురుస్తాయని హెచ్చరించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి, సంగారెడ్డి, మెదక్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, మేడ్చల్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఇక గురువారం ఉమ్మడి మెదక్, రంగారెడ్డితో పాటు హైదరాబాద్‌లో భారీ వర్షాలు పడ్డాయి. ముఖ్యంగా హైదరాబాద్, దాని శివారు ప్రాంతాల్లో రాత్రి గంటన్నర పాటు కుండపోత వర్షం కురిసింది. మెదక్ జిల్లా గుమ్మడిదలలో అత్యధికంగా 9.1 సెం.మీ., హైదరాబాద్‌లోని భన్సీలాలపేటలో 8.7 సెం.మీ., పాటిగడ్డలో 8.5 సెం.మీ., ముషీరాబాద్‌లో 8.3 సెం.మీ. వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి హైదరాబాద్ పరిధిలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉప్పల్, సికింద్రాబాద్, వనస్థలిపురం, కూకట్‌పల్లి, ముషీరాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, గోల్కొండ తదితర ప్రాంతాల్లో రోడ్లపై వరద పోటెత్తింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కృష్ణా, తుంగభద్ర పరీవాహక ప్రాంతాల్లో శుక్రవారం నుంచి వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో రెండ్రోజుల్లో మళ్లీ వరదలు మొదలవుతాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఇక బేసిన్‌లోని ఆల్మట్టి నుంచి నాగార్జునసాగర్ దాకా.. అన్ని ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయిలో నిల్వలున్నాయి. దీంతో నిల్వలను కొనసాగిస్తూనే విద్యుదుత్పత్తి కోసం వచ్చిన కొంత మోతాదులో దిగువకు వదులుతున్నారు. ఆల్మట్టికి 33,123 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 15 వేల క్యూసెక్కులు ఔట్‌ఫ్లో ఉంది. నారాయణపూర్‌కు 15 వేల క్యూసెక్కులు వస్తుండగా, 6 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. జూరాల 30 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 31,304 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. తుంగభద్ర డ్యామ్‌కు 35,425 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, కొట్టుకుపోయిన 19వ గేటుతో పాటు మరికొన్ని గేట్లు, విద్యుదుత్పత్తి ద్వారా.. మొత్తం 1,11,025 క్యూసెక్కులు వదులుతున్నారు. దీంతో శ్రీశైలానికి 1,36262 క్యూసెక్కులు చేరుతుండగా.. 68,453 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్‌కు ఎగువ నుంచి 67,753 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. సాగర్ 2 గేట్లు ఎత్తి నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టు నుంచి మొత్తం 63,129 క్యూసెక్కులు దిగువకు విడుదలవుతోంది.

స్టాప్‌లాగ్ ఏర్పాటు ప్రక్రియ షురూ..

తుంగభద్ర జలాశయంలో కొట్టుకుపోయిన 19వ నంబరు క్రస్టుగేటు స్థానంలో స్టాప్‌లాగ్ బిగించే ప్రక్రియ గురువారం పకడ్బందీగా మొదలైంది. స్టాప్‌లాగ్ తొలిబ్లాక్‌ను గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో భారీ వాహనంపై ఆనకట్ట వద్దకు తరలించారు. క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు, ఐదుగురు ఇంజనీర్ల పర్యవేక్షణలో తమిళనాడుకు చెందిన కార్మికులు బ్లాక్‌ను కిందికి దించారు. గేటు అమరిక కోసం కౌంటర్ వెయిట్ కింది భాగంలో గంట పాటు వెల్డింగ్ చేశారు. 1,635 అడుగుల వద్ద స్టాప్‌లాగ్‌ను 'గైడ్ యాంగిల్'లోకి (గేటును 2 వైపులా పట్టి ఉంచే నిర్మాణం) దించాల్సి ఉంది. 60 అడుగుల వెడల్పు.. 4 అడుగుల ఎత్తు.. 13 టన్నుల బరువైన భారీ ఇనుప నిర్మాణమది! అయితే... కొలతల్లో కాస్త తేడా వచ్చింది. రాతి గేట్‌వాల్ కన్నా ప్రస్తుతం తయారు చేయించిన స్టాప్‌లాగ్ రెండు అంగుళాలు ఎక్కువైంది. దీంతో.. రెండు వైపులా ఒక్కో అంగుళం చొప్పున అరగదీయాల్సి వస్తోంది. రాత్రి 10 గంటల దాకా ఆ పని కొనసాగింది. ఆ తర్వాత పనులను నిలిపివేశారు. శుక్రవారం ఉదయం స్టాప్‌లాగ్ బ్లాక్‌ను అమర్చే ప్రక్రియ తిరిగి ప్రారంభిస్తారు.

స్కిల్ యూనివర్సిటీ చైర్మన్‌గా... ఆనంద్ మహీంద్రా నియామకం

- కో-చైర్మన్‌గా శ్రీనిరాజు
- ఏడాదిపాటు పదవుల్లో...
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్‌గా ప్రముఖ పారిశ్రామికవేత్త, మహీంద్రా గ్రూపు సంస్థల చైర్మన్ ఆనంద్ మహీంద్రాను రాష్ట్రప్రభుత్వం నియమించింది. అలాగే ప్రముఖ విద్యావేత్త శ్రీనివాస సి.రాజు ఈ యూనివర్సిటీకి బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సభ్యుడిగా కో-చైర్మన్ హోదాలో నియమితులయ్యారు. ఈమేరకు తాజాగా ఉత్తర్వులను జారీ చేశారు. వీరు ఏడాది పాటు ఈ పదవుల్లో కొనసాగుతారు. ఆనంద్ మహీంద్రా ఆటోమొబైల్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఎనర్జీ, ఐటీ వంటి రంగాల్లో ప్రఖ్యాతిగాంచిన మహీంద్రా గ్రూపు సంస్థలకు చైర్మన్‌గా ఉన్న విషయం తెలిసిందే. హార్వర్డ్ బిజినెస్ స్కూల్(ఆసియా-పసిఫిక్ అడ్వయిజరీ బోర్డు), హార్వర్డ్ గ్లోబల్ అడ్వయిజరీ కౌన్సిల్ అడ్వయిజరీ కమిటీ, ఆసియా బిజినెస్ కౌన్సిల్ వంటి అనేక ప్రతిష్ఠాత్మక సంస్థల సభ్యుడిగా ఉన్నారు. పద్మభూషణ్‌తో పాటు అనేక అవార్డులు పొందారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ఆనంద్ మహీంద్రాతో ప్రత్యేకంగా సమావేశమై స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు, లక్ష్యాలను వివరించిన విషయం తెలిసిందే. ఈ యూనివర్సిటీకి చైర్మన్‌గా కొనసాగాలని కోరిన విషయం కూడా తెలిసిందే. దీనికి కొనసాగింపుగా తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో ఈ స్కిల్ ఇండియా యూనివర్సిటీని ఏర్పాటు చేస్తూ ఇటీవలే అసెంబ్లీలో బిల్లును ఆమోదించిన విషయం తెలిసిందే. అలాగే.. ఈ యూనివర్సిటీ నిర్మాణానికి కూడా ముఖ్యమంత్రి ఇప్పటికే శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే.

సుంకిశాల ఘటనకు బాధ్యత మాదే!

- ఆయా పనుల పునఃనిర్మాణ వ్యయం భరిస్తాం..
- షోకాజ్ నోటీసులకు నిర్మాణ సంస్థ వివరణ లేఖ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సుంకిశాల ప్రాజెక్టు సైడ్ వాల్ (రక్షణ గోడ) కూలిపోయిన ప్రమాద ఘటనకు పూర్తి బాధ్యత తమదేనని నిర్మాణ సంస్థ వాటర్ బోర్డుకు తెలిపింది. ఈ ఘటనపై ఇంజనీర్ల కమిటీతో విచారణ జరిపిన వాటర్ బోర్డు.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలనుగుణంగా నిర్మాణ సంస్థకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. దీనికి నిర్మాణ సంస్థ మూడు పేజీలతో కూడిన వివరణ లేఖను వాటర్ బోర్డుకు అందజేసింది. ఈ ఘటన పట్ల సంస్థ విచారం వ్యక్తం చేసింది. ప్రమాదం తలెత్తడానికి గల కారణాలు, లోపాలను పూర్తిగా లేఖలో వివరించినట్లు సమాచారం. దేశ, విదేశాల్లో భారీ ప్రాజెక్టులను చేపడుతున్న తమకు ఈ ఘటన మొదటిదని, అన్నీ రకాల భద్రత చర్యలు చేపట్టినప్పటికీ ప్రమాదం జరగడంపై కారణాలను అంతర్గతంగా విచారణ చేసుకున్నట్లుగా లేఖలో ప్రస్తావించినట్లు తెలిసింది. సుంకిశాల ఇన్‌టేక్ వెల్ ప్రాజెక్టు పనుల్లో ఇప్పటి వరకు 60శాతానికి పైగా పూర్తయ్యాయని, పంపింగ్ మెయిన్ పనులు 70శాతం, ఎలక్ట్రో మెకానిక్ పనులు 40శాతం పూర్తయినట్లుగా పేర్కొన్నట్లు సమాచారం. అయితే టన్నెల్ గేట్ ధ్వంసంతో రిజర్వాయర్ వైపు గల సైడ్ వాల్ (రక్షణ గోడ) కూలిపోవడంతో సంపు, పంప్ హౌజ్ సూపర్ స్ట్రక్చర్ నిర్మాణానికి ఇబ్బందికరంగా మారిందని, కానీ పంపింగ్ మెయిన్ పనులు, ఎలక్ట్రో మెకానిక్ పనులను ఆపలేదని, చురుగ్గా సాగుతున్నాయని వివరణలో స్పష్టం చేసినట్లుగా తెలిసింది. అయితే సైడ్ వాల్ కూలిపోవడంతో తలెత్తిన పరిణామాలన్నింటికీ నిర్మాణ సంస్థగా తామే బాధ్యత వహిస్తామని, ఆయా పనుల పునఃనిర్మాణ వ్యయం మొత్తం తామే భరిస్తామని, ప్రమాదం నేపథ్యంతో తాజాగా విధించే గడువుకనుగుణంగా సుంకిశాల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అన్నీ రకాల చర్యలు చేపడతామని లేఖలో నిర్మాణ సంస్థ వివరించినట్లు సమాచారం.

అసదుద్దీన్‌తో అమెరికన్ కాన్సుల్ జనరల్ భేటీ

హైదరాబాద్ ఎంపీ, మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీతో అమెరికన్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ భేటీ అవడంపై నెట్టింట విమర్శల వర్షం కురుస్తోంది. జెన్నిఫర్ అసదుద్దీన్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. వ్యక్తిగత స్థాయిలో జరిగిన ఈ భేటీ గురించి సోమవారం జెన్నిఫర్ తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. భేటీ సందర్భంగా అసదుద్దీన్‌తో దిగిన ఫొటోను కూడా తన పోస్టుకు జత చేశారు. కాగా, ఈ విషయంపై నెటిజన్లు మండిపడుతూ వివిధ రకాల కామెంట్లు చేస్తున్నారు. భారత రాజకీయాల్లో అమెరికా జోక్యానికి జెన్నిఫర్ భేటీ నిదర్శనమని ఒక నెటిజెన్ అన్నారు. గత ఏడాది ఏప్రిల్‌లో రంజాన్ సమయంలో అసదుద్దీన్‌ను కలిసిన విషయాన్ని గుర్తు చేశారు. మరో నెటిజన్ విదేశీయులు, ముఖ్యంగా ఇలాంటి దౌత్యవేత్తలు, సిబ్బందిపై ఎన్ఐఏ దృష్టి సారించాలని సలహా ఇచ్చారు.

నేడు హైదరాబాద్‌లో యూఎస్ ఎడ్యుకేషన్ ఫెయిర్

భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం శుక్రవారం హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించనుంది. "స్టడీ ఇన్ ది యూఎస్" పేరిట జరిగే ఈ కార్యక్రమం హైటెక్ సిటీలోని ఐటీసీ కోహినూర్ హోటల్‌లో సాయంత్రం 4.30 నుంచి 9 గంటల వరకు జరగనుంది. అమెరికాలోని 80 యూనివర్సిటీలు, కళాశాలలు ఈ ఫెయిర్‌లో పాల్గొంటున్నాయి. అమెరికాలో విద్యావకాశాలు, వీసా జారీ నిబంధనలు తదితర అంశాలను ఫెయిర్‌లో నివృత్తి చేసుకోవచ్చని కాన్సుల్ జనరల్ కార్యాలయం తెలిపింది.

273 మందికి ఏఈఈలుగా పదోన్నతి

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్లు(ఏఈ)లుగా ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకొని అర్హత కలిగిన 273 మందికి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు(ఏఈఈ)లుగా పదోన్నతి లభించింది. మల్టీ జోన్-1 పరిధిలో 151 మందికి, మల్టీ జోన్-2లో 122 మందికి పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఈఎన్సీ(అడ్మిన్, జనరల్) జీ.అనిల్‌కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు.

ఔటర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం..

- పెద్దగోల్కొండ వద్ద తూఫాన్‌ను ఢీకొట్టిన కారు
- ముగ్గురి మృతి.. మరో ముగ్గురి పరిస్థితి విషమం

శంషాబాద్ రూరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వెళ్లి వస్తున్న ఆ కుటుంబాన్ని మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో వెంటాడి.. ముగ్గురిని కబలించింది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పెద్దగోల్కొండ ఔటర్ రింగ్‌రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ముందు వెళ్తున్న తూఫాన్ వాహనాన్ని ఓ కారు వేగంగా ఢీకొనడంతో ముగ్గురు మృతి చెందగా.. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఏసీపీ కె.శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల మేరకు.. వనపర్తి జిల్లాలోని ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన 24 మంది తూఫాన్ వాహనంలో గురువారం ఉదయం యాదగిరిగుట్టకు బయలుదేరారు. దైవదర్శనం అనంతరం తిరిగి సొంతూరికి వెళ్తుండగా.. పెద్దగోల్కొండ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద ఓ బాలెనో కారు.. మరో కారును ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపు తప్పి ముందు వెళ్తున్న తూఫాన్‌ను బలంగా ఢీకొంది. దాంతో తూఫాన్ నాలుగైదు పల్టీలు కొట్టడంతో డ్రైవర్ మహ్మద్ తాజ్ (40), వరాలు (43) అక్కడికక్కడే మృతి చెందారు. ఆస్పత్రికి తరలిస్తుండగా 2 నెలల బాబు కూడా ప్రాణాలు విడిచాడు. బాబు తల్లి అర్చన, దీక్షిత, కీర్తి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులు శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదానికి కారణమైన బాలెనో కారు తుక్కుగూడ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్తున్నట్లు శంషాబాద్ పోలీసులు తెలిపారు. అందులో కరీంనగర్‌కు చెందిన ఆరుగురు యువకులున్నారని.. వారిని అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. వీరిలో కొందరు మద్యం సేవించినట్లు అనుమానిస్తున్నారు.

తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీకి తాకట్టు:బీఆర్ఎస్

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణ అస్తిత్వానికి భంగం కలుగుతోందని, స్వార్థ రాజకీయం కోసం రాష్ట్ర ఆత్మగౌరవాన్ని ఆ పార్టీ నేతలు ఢిల్లీకి తాకట్టు పెడుతున్నారని బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. రాష్ట్రానికి ఏమాత్రం సబంధంలేని అభిషేక్ మను సింఘ్వీని రాజ్యసభ అభ్యర్థిగా నిలబెట్టడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్‌లో అనుభవం, అర్హత కలిగిన సీనియర్ నాయకులు ఎంతోమంది ఉన్నా, వేరే రాష్ట్రానికి చెందిన వ్యక్తిని రాజ్యసభ అభ్యర్థిగా ఎంపిక చేయడం విచారకరమన్నారు. అభిషేక్ సింఘ్వీ మొదటి నుంచి తెలంగాణ వ్యతిరేకి అని, హైదరాబాద్ నగరంలేని రాష్ట్రం ఇవ్వాలని ఆయన గతంలో ప్రతిపాదించారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తిని కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేయడం తెలంగాణ ప్రజలను అవమానించడమేనని, సీనియర్ నాయకుడు హనుమంతరావుకు ఇచ్చినా బాగుండేదని అభిప్రాయపడ్డారు.

మూడు అసెంబ్లీ స్థానాలకు త్వరలో ఉపఎన్నిక

- త్వరలో పార్టీ నేతలతో కేసీఆర్ సమావేశాలు: కేటీఆర్
- 'కవిత జైల్లోఉంటే.. అన్నగా ఢిల్లీ వెళ్లి కలవొద్దా?' అని ప్రశ్న

హైదరాబాద్, ఆగస్టు15 (ఆంధ్రజ్యోతి): పార్టీ మారిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై హైకోర్టులో కేసు నడుస్తోందని.. త్వరలో స్టేషన్‌ఘన్‌పూర్ సహా మూడు అసెంబ్లీ స్థానాలకు ఒకేసారి ఉప ఎన్నికలు జరుగుతాయని.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ పరిధిలోని పలువురు కాంగ్రెస్ నేతలకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటుపడటం ఖాయమన్నారు. కాంగ్రెస్‌లో చేరిన మిగతా ఎమ్మెల్యేల విషయంలోనూ సుప్రీంకోర్టుకు వెళ్తామన్నారు. పార్టీ బలోపేతం కోసం ప్రత్యేకంగా దృష్టి సారించామని.. ఈ మేరకు త్వరలోనే పార్టీ నేతలతో కేసీఆర్ సమావేశమవుతారని కేటీఆర్ తెలిపారు. "ఆస్ట్రేలియా పర్యటన అంటూ.. సీఎం సోదరుని కంపెనీతో రూ.వేల కోట్ల ఒప్పందం చేసుకున్నారు. బామ్మర్ది కంపెనీకి రూ.వెయ్యికోట్ల పనులు ఇచ్చారు" అని కేటీఆర్ ఆరోపించారు. "మొన్నటి వరకు కేసీఆర్‌ది కుటుంబపాలన అని విమర్శించారు. ఇప్పుడు రాష్ట్రంలో ఏ పాలన నడుస్తోంది.. రేవంత్‌రెడ్డి అన్నదమ్ముల కుటుంబం కాంగ్రెస్ నేతలకు కనిపించడం లేదా?" అని ప్రశ్నించారు. రుణమాఫీ సభకు కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీని ఆహ్వానించినా.. రుణమాఫీ కాలేదని తెలుసుకొని ఆయన రాలేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తాను తరచూ ఢిల్లీకి వెళ్తే 'బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో విలీనం' అంటూ కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని.. తమకు అంత ఖర్మ పట్టలేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. "కవిత జైలులో ఉంటే అన్నగా నేను ఢిల్లీపోయి కలవొద్దా? దీన్ని కూడా రాజకీయం చేస్తారా?" అని ప్రశ్నించారు. బీజేపీతో అలాంటి చీకటి ఒప్పందం ఉంటే కవిత 150 రోజులుగా జైల్లో ఉంటుందా? అని నిలదీశారు.

ఆర్ఆర్ఆర్‌లో మరో కీలక అడుగు

- ఉత్తరభాగం రోడ్డు నిర్మాణానికి అవసరమైన అటవీ భూములు
- వాటికి బదులు అటవీయేతర భూములిచ్చిన రాష్ట్ర సర్కారు
- మహబూబాబాద్ జిల్లాలో 73.04 హెక్టార్ల కేటాయింపు



హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగం నిర్మాణ పనుల్లో మరో కీలక అడుగు పడింది. ఈ రహదారి నిర్మితమయ్యే మార్గంలో అవసరమవుతున్న అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం 73.04హెక్టార్ల (160.68 ఎకరాలు) అటవీయేతర భూములను మహబూబాబాద్ జిల్లాలో కేటాయించింది. ఈ వివరాలను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) తెలంగాణ విభాగానికి అందించింది. వాటిని ఎన్‌హెచ్ఏఐ.. కేంద్ర ప్రభుత్వంతో పాటు, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు నివేదించింది. దీంతో ఉత్తర భాగం నిర్మాణానికి అటవీ అనుమతులు త్వరితగతిన మంజూరయ్యే అవకాశాలు కనబడుతున్నాయి. ఈ అనుమతుల కోసం ఎన్‌హెచ్ఏఐ ఇటీవల కేంద్ర అటవీ, పర్యావరణ శాఖకు దరఖాస్తు చేసింది. ఈ రహదారి నిర్మాణ మార్గంలో 48,765 చెట్లపై ప్రభావం పడుతోందని ఆ దరఖాస్తులో ఎన్‌హెచ్ఏఐ అధికారులు పేర్కొన్నారు. ఆర్ఆర్ఆర్ విషయంలో కృతనిశ్చయంతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్ఏఐకు పూర్తి సహకారం అందిస్తోంది. యుటిలిటీస్ చార్జీల చెల్లింపు విషయంపైనా చర్చలు జరపడంతో రూ.363 కోట్లను తామే భరిస్తామని కేంద్రమంత్రి ప్రకటించారు. ఇలా ఆర్ఆర్ఆర్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో సమస్యను అధిగమిస్తూ వస్తోంది. ఇప్పుడు అటవీయేతర భూముల కేటాయింపులోనూ వేగంగా చర్యలు తీసుకుంది. సిద్దిపేట జిల్లా ఖైలారం, మెదక్ జిల్లా అల్లీపూర్, నారాయణపూర్, పెద్దచింతకుంట, తిర్మలాపూర్, యాదాద్రి భువనగిరి జిల్లా ఇబ్రహీంపురంలో మొత్తం 71.87 హెక్టార్ల (158.11 ఎకరాలు) అటవీ భూములు అవసరమవుతున్నాయి. ఈ భూముల్లో వృక్షాలను తొలగించాల్సి వస్తుంది కాబట్టి కేంద్రం నిబంధనల ప్రకారం వేరేచోట అడవులు పెంచాలి. దీనికి రాష్ట్ర ప్రభుత్వం అటవీయేతర భూములు కేటాయించింది. ఈ భూముల్లో చెట్ల పెంపకం చేపట్టాల్సి ఉంది. మహబూబాబాద్ జిల్లా అనంతారం, పొగళ్లపల్లి, చింతగూడంలో కలిపి మొత్తం 73.04 హెక్టార్లు (160.68 ఎకరాలు) ఇచ్చింది. వీటి సరిహద్దులు, ఇతర అన్ని అంశాలతో పక్కాగా నివేదిక సమర్పించారు. కాగా, రాష్ట్రానికి కేంద్రం మంజూరు చేసిన ఆర్ఆర్ఆర్‌ను ఉత్తర, దక్షిణ భాగాలుగా నిర్మించనున్నారు. ఉత్తర భాగం సంగారెడ్డిలో మొదలై నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, ప్రజ్ఞాపూర్, యాదాద్రి భువనగిరి మీదుగా చౌటుప్పల్ వరకు 161 కిలోమీటర్ల మేర నిర్మాణం కానుంది. దీనికి 1,940 హెక్టార్ల భూమి అవసరం కాగా.. దాదాపు 90% భూ సేకరణ పూర్తయింది. దీని నిర్మాణానికి రూ.15 వేల కోట్లకు పైగా అవసరం కాగా.. ఇందులో దాదాపు రూ.5,200 కోట్లు భూములకు పరిహారం కింద చెల్లించాల్సి ఉంది.

ఎర్ర చెరువులో అక్రమ కట్టడాల కూల్చివేత

- ఐదంతస్తుల భవనాలు నేలమట్టం!
- చెరువుల్లో ఆక్రమణలపై 'హైడ్రా' కొరడా
- వీటికి నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చిన హెచ్ఎండీఏ


ఎర్ర చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన భవనాలను కూల్చివేస్తున్న దృశ్యాలు

హైదరాబాద్ సిటీ/నిజాంపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట కార్పొరేషన్ పరిధి ఎర్ర చెరువు (ఎఫ్‌టీఎల్) భూమిలో అక్రమంగా నిర్మించిన మూడు భవనాలను 'హైడ్రా' కూల్చివేస్తోంది. ఐదంతస్తుల భవనం ఒకదాన్ని పూర్తిగా నేలమట్టం చేసింది. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు అభ్యంతరం చెబుతున్నా హైడ్రా వెనక్కి తగ్గలేదు. గురువారం తెల్లవారుజామున భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేత పని మొదలైంది. నిబంధనలకు విరుద్ధంగా హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) ఈ భవనాల నిర్మాణానికి అనుమతి ఇచ్చినా హైకోర్టు ఆదేశాలతో పలు విభాగాలు సంయుక్తంగా పరిశీలించి ఇచ్చిన నివేదిక ఆధారంగా వాటిని కూల్చివేయాలని 'హైడ్రా' కమిషనర్ ఏవీ రంగనాథ్ నిర్ణయం తీసుకున్నారు. ప్రగతినగర్ పరిధిలో ఉన్న ఈ చెరువు ఎఫ్‌టీఎల్ (సర్వే నెంబర్ 134)లో 360 చదరపు గజాల చొప్పున ఉన్న ప్లాట్లలో కొందరు స్టిల్ట్ ప్లస్ ఐదు అంతస్తులుగా మూడు భవనాలు నిర్మించారు. రెండు భవనాల్లో ఫ్లోరింగ్, కొంత మేర పెయింటింగ్ పనులూ పూర్తయ్యాయి. మరో భవనంలో బయటివైపు ప్లాస్టరింగ్ చేయాల్సి ఉంది. ఒక్కో భవనం పూర్తిస్థాయిలో కూల్చేందుకు 12 గంటలు పడుతోంది. గురువారం రాత్రి భారీ వర్షంతో పనులకు అంతరాయం కలిగింది. శుక్రవారం మిగతా రెండు భవనాలనూ పూర్తిస్థాయిలో కూల్చివేస్తామని అధికారులు చెబుతున్నారు. ఎర్రచెరువు 3.10ఎకరాల్లో ఉంది. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నా మూడు భవనాల నిర్మాణానికి హెచ్ఎండీఏ అనుమతి ఇచ్చింది. స్థానికుల ఫిర్యాదుతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. భవనాలు నిర్మించిన స్థలం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో లేదని రెవెన్యూ అధికారులు నివేదిక ఇవ్వగా ఫిర్యాదుదారులు హైకోర్టుకు వెళ్లారు. దాంతో సంయుక్త తనిఖీకి కోర్టు ఆదేశించింది.

నేడు హైదరాబాద్‌కు జస్టిస్ పీసీ ఘోష్

హైదరాబాద్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ శుక్రవారం హైదరాబాద్‌కు రానున్నారు. ఈ దఫా రెండు వారాల పాటు ఇక్కడే ఉండి, విచారణను వేగిరం చేయనున్నారు. రాగానే.. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై విచారణ నివేదికను పదే పదే కోరినా ఇవ్వనందుకుగాను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్(వీ అండ్ ఈ) డైరెక్టర్ జనరల్‌తో పాటు సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల వైఫల్యానికి గల కారణాలపై నివేదిక ఇవ్వనందుకు జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్ఏ) చైర్మన్‌కు సమన్లు జారీ చేయాలని ఆయన యోచిస్తున్నట్లు సమాచారం. ఆయా సంస్థలు నివేదికలు అందించాలని ఇప్పటికే పలు దఫాలుగా ఆయన కోరినా ప్రయోజనం లేదు. దాంతో వారిని పిలిపించాలని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. విచారణలో భాగంగా అఫిడవిట్లు దాఖలు చేసిన మాజీ ఐఏఎస్ అధికారులతో పాటు సర్వీసులో ఉన్న సీనియర్ ఐఏఎస్‌లను క్రాస్ ఎగ్జామినేషన్ చేసే ప్రక్రియ ముందుకు కదలనుంది. ఈ క్రమంలో బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలపై కూడా ఈ దఫా గురిపెట్టనున్నారు. మూడు ఆనకట్టల నిర్మాణంలో 50 మందికి పైగా సబ్ కాంట్రాక్టర్లు ఉన్నట్లు ఇది వరకే ఆయన గుర్తించారు. ప్రధాన కాంట్రాక్టర్లకు ఏ మేరకు చెల్లింపులు జరిగాయి..? అందులో సబ్ కాంట్రాక్టర్లకు అందినదెంత..? వంటి వాటిపై దృష్టి సారించనున్నారు. మరోవైపు జస్టిస్ చంద్రఘోష్ పదవీ కాలం ఈనెలాఖరుతో ముగియనుంది. అయితే విచారణ నివేదికను అందించడానికి మరికొంత సమయం పట్టే అవకాశాలున్నాయి. తొలుత వేసిన కమిషన్ గడువు జూన్ 30తో ముగియగా.. రెండు నెలలు పొడిగిస్తూ అవకాశం ఇచ్చారు. తాజాగా మరో రెండు నెలలు కమిషన్‌ను గడువును పొడిగించే అవకాశాలున్నాయి.

ఎట్టకేలకు అందిన వేతనం..

జస్టిస్ పినాకి చంద్రఘోష్ వేతనానికి సంబంధించిన బిల్లులను ఎట్టకేలకు ఆర్థిక శాఖ క్లియర్ చేసింది. దాంతో మే, జూన్, జూలై వేతనాలతో పాటు భత్యాన్ని ఆయన ఖాతాలో జమ చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● శుక్రవారం 16 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.com

టీజీ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్

తెలంగాణ స్టేట్ డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ కార్యాలయం- 'నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే పేద విద్యార్థులకు ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ఈ స్కీమ్‌ను ఉద్దేశించారు. రాత పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు.

అర్హత

విద్యార్థులు ప్రభుత్వ, ఎయిడెడ్, స్థానిక సంస్థల పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతూ ఉండాలి. ఏడో తరగతిలో జనరల్ విద్యార్థులకు 55 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 50 శాతం మార్కులు ఉండాలి. ఎనిమిదో తరగతిలో కూడా ఇలాగే మార్కులు తెచ్చుకోవాలి. కుటుంబ వార్షికాదాయం రూ.3,50,000 మించకూడదు. తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ హై స్కూల్స్, తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్, గవర్నమెంట్ ఆశ్రమ్ హై స్కూల్స్, కస్తూర్బా రెసిడెన్షియల్ స్కూల్స్, రెసిడెన్షియల్ మోడల్ స్కూల్స్ జవహర్ నవోదయ విద్యాలయాలు, కేంద్రీయ విద్యాలయాలు, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్, సైనిక్ స్కూల్స్, ఇతర రెసిడెన్షియల్ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు దరఖాస్తుకు అనర్హులు.



రాత పరీక్ష వివరాలు

ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటిది మెంటల్ ఎబిలిటీ టెస్ట్(ఎంఏటీ), రెండోది స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎస్ఏటీ). ఒక్కో పార్ట్‌లో 90 చొప్పున మొత్తం 180 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఏడు, ఎనిమిది తరగతుల సిలబస్ ఆధారంగా సైన్సెస్, మేథమెటిక్స్, సోషల్ స్టడీస్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 180. పరీక్ష సమయం మూడు గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే జనరల్ కేటగిరీ విద్యార్థులకు 40 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 32 శాతం మార్కులు రావాలి.

స్కాలర్‌షిప్

రాత పరీక్షలో అర్హత పొందిన విద్యార్థులకు తొమ్మిది నుంచి ఇంటర్ పూర్తిచేసేవరకు నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి రూ.12000 ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **పరీక్ష ఫీజు:** జనరల్, బీసీ విద్యార్థులకు రూ.100; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 11
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రింట్ కాపీని పాఠశాలలో సబ్మిట్ చేసేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 13
- **డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్‌కు దరఖాస్తులు చేరాల్సిన తేదీ:** సెప్టెంబరు 18
- **రాత పరీక్ష తేదీ:** నవంబరు 24
- **వెబ్‌సైట్:** http//bse.telangana.gov.in



ఎన్‌సీఈఆర్‌టీ
'ప్రయాస్' పోటీ

న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్&ట్రెయినింగ్(ఎన్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్ సైన్స్ అండ్ మేథమెటిక్స్(డీఈఎస్ఎం)- 'ప్రమోషన్ ఆఫ్ రీసెర్చ్ ఆటిట్యూడ్ ఇన్ యంగ్ అండ్ యాస్పిరింగ్ స్టూడెంట్స్(ప్రయాస్) 2024 స్కీమ్' గైడ్‌లైన్స్ విడుదల చేసింది. విద్యార్థులకు సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, ఆర్ట్స్, మేథమెటిక్స్ విభాగాల్లో ఆసక్తిని కలిగించి పరిశోధనల దిశగా ప్రోత్సాహాన్ని అందించేందుకు ఈ ప్రోగ్రామ్‌ని ఉద్దేశించారు. ఇందులో భాగంగా విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పరీక్షించి వారి సృజనాత్మకతను పెంపొందించేలా పోటీలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు తమ ప్రాంతాల్లోని ప్రధాన సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి శాస్త్రీయంగా పరిశోధనలు చేయాలి. ఇందుకు తమ పాఠశాల ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు తీసుకోవచ్చు.

తమ పరిశోధనల వివరాలతో ప్రాజెక్ట్ ప్రపోజల్‌ను సంస్థ ఈ మెయిల్‌కు పంపాలి. ప్రాజెక్ట్ వర్క్ వ్యవధి ఏడాది. అవసరం మేరకు మరో ఆర్నెల్లు పొడిగించే వీలుంది. నిబంధనల ప్రకారం పూర్తిచేసిన ప్రాజెక్ట్ పరిశోధన పత్రాలను ఎన్‌సీఈఆర్‌టీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు.

అర్హత

తొమ్మిది నుంచి పదకొండో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులు. దరఖాస్తు నాటికి విద్యార్థుల వయసు 14 నుంచి 18 ఏళ్ల మధ్య ఉండాలి. ఒకరు లేదా ఇద్దరు విద్యార్థుల గ్రూప్ తమ టీచర్, హెచ్ఈఐ సహకారంతో రీసెర్చ్ చేయవచ్చు. తొమ్మిది నుంచి పన్నెండో తరగతి వరకు సైన్స్/ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్ బోధించే పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) గైడ్‌గా వ్యవహరించవచ్చు. ఒక పాఠశాల నుంచి ఒక ఎంట్రీ మాత్రమే పంపాలి.

ప్రాజెక్ట్ వివరాలు

దరఖాస్తు ద్వారా వచ్చిన ప్రాజెక్ట్ ప్రపోజల్స్‌ను పరిశీలించి స్క్రీనింగ్ చేస్తారు. రీసెర్చ్ ప్రపోజల్ ఒరిజినాలిటీకి 20 శాతం, సైంటిఫిక్ థాట్‌కు 10 శాతం, సైంటిఫిక్ మెథడాలజీకి 10 శాతం, జనరేషన్ ఆఫ్ సైంటిఫిక్ నాలెడ్జ్‌కి 20 శాతం, ఎన్విరాన్‌మెంటల్ ఎఫిషియెన్సీకి 20 శాతం, ప్రాజెక్ట్ ప్రపోజల్ క్లారిటీ-రైటప్‌నకు 20 శాతం వెయిటేజీ ఇస్తూ ప్రాజెక్ట్ ప్రపోజల్స్‌ను షార్ట్‌లిస్ట్ చేస్తారు. తరవాత సంబంధిత విద్యార్థులు, టీచర్/మెంటార్‌ను ప్రజంటేషన్, ఇంటర్వ్యూలకు పిలుస్తారు. జ్యూరీ ఎదుట అయిదు నుంచి ఏడు నిమిషాలు తమ ప్రాజెక్ట్‌ను పీపీటీలు, చార్ట్‌లు, ఓరల్ డిస్కషన్, అసెస్‌మెంట్ ద్వారా ప్రజంట్ చేయాల్సి ఉంటుంది. ఇంటర్వ్యూలు పూర్తయిన వెంటనే ఎంపిక చేసిన 15 ప్రాజెక్ట్ ప్రపోజల్స్ వివరాలు ప్రకటిస్తారు.

ఎంపిక చేసిన ప్రాజెక్ట్‌లకు సంస్థ రీసెర్చ్ గ్రాంట్ కింద రూ.50,000 అందిస్తుంది. ఇందులో విద్యార్థులకు రూ.10,000(ఒక్కొక్కరికి రూ.5,000); పీజీటీ, హెచ్ఈఐలకు ఒక్కొక్కరికి రూ.20,000 ఇస్తారు. ఈ మొత్తాన్ని స్టేషనరీ, బుక్స్, ట్రావెలింగ్, డేటా కలెక్షన్, కెమికల్ ప్రయోగాలు, ల్యాబొరేటరీ, సైన్స్ కిట్, పరిశోధన సంబంధిత అవసరాలకు మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. వారానికి అయిదు నుంచి ఏడు గంటలు ప్రాజెక్ట్ వర్క్ చేయాలి.

ప్రాజెక్ట్ వర్క్ ప్రారంభమైన నాలుగు నెలల తరవాత టీచర్ సహకారంతో విద్యార్థులు నిర్దేశిత ఫార్మాట్‌లో ప్రోగ్రెస్ రిపోర్ట్ సబ్మిట్ చేయాలి. ఇందులో టేబుల్స్, ఫిగర్స్‌తో కూడిన వివరణ ఉండాలి.

ప్రాజెక్ట్ వర్క్ పూర్తికావడానికి 15 రోజుల ముందు ఫైనల్ టెక్నికల్ రిపోర్ట్ సబ్మిట్ చేయాలి.

ప్రాజెక్ట్ వర్క్‌ల వివరాలు; సంబంధిత ప్రయాస్ విద్యార్థులు, టీచర్లు, హెచ్ఈఐ వివరాలను ప్రయాస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. ప్రయాస్ విద్యార్థుల పరిశోధన పత్రాలను రాష్ట్రీయ బాల వైజ్ఞానిక్ ప్రదర్శన(ఆర్‌బీవీపీ)లో ప్రజంట్ చేస్తారు. వీటిని స్టాండర్డ్ జర్నల్స్‌లో కూడా ప్రచురిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 25
- **దరఖాస్తుల స్క్రీనింగ్:** ఆగస్టు 31
- **ప్రాజెక్ట్ ప్రపోజల్ సెలెక్షన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 5
- **జ్యూరీ ఎంపిక చేసిన ప్రాజెక్ట్‌ల సమాచారం:** సెప్టెంబరు 10న
- **ప్రాజెక్ట్ రీసెర్చ్ వర్క్ ప్రారంభం:** సెప్టెంబరు 15 నుంచి
- **ప్రాజెక్ట్ వర్క్ పూర్తి చేసేందుకు చివరి తేదీ:** 2025 సెప్టెంబరు 14
- **ప్రాజెక్ట్ రిపోర్ట్ సబ్మిషన్:** 2025 సెప్టెంబరు 20
- **ఈ మెయిల్ ఐడీ:** prayaas-ncert@gmail.com
- **వెబ్‌సైట్:** ncert.nic.in

विद्यया ऽमृतमश्नुते
एन सी ई आर टी
NCERT

ఏపీ ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఫీమేల్)/ఏఎన్ఎం ట్రెయినింగ్



అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ కార్యాలయం(సీహెచ్&ఎఫ్‌డబ్ల్యూ)- మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ-ఫీమేల్)/ఏఎన్ఎం కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. కోర్సు వ్యవధి రెండేళ్లు. రాష్ట్రంలోని ప్రభుత్వ/ప్రైవేట్ కళాశాలల్లో మొత్తం 2,330 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లోని సీట్లన్నీ ఉచితమే. ప్రైవేట్ కళాశాలల్లో 60 శాతం సీట్లు ఉచితం కాగా మిగిలిన 40 శాతం సీట్లు మేనేజ్‌మెంట్ కోటాకు చెందుతాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిగా నింపి నిర్దేశిత ధ్రువ పత్రాలు జతచేసి సంబంధిత జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో వ్యక్తిగతంగా గానీ/రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా గానీ సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.50; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది.
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి:** అక్టోబరు 15న
- **తరగతులు ప్రారంభం:** అక్టోబరు 21 నుంచి
- **వెబ్‌సైట్:** http://cfw.ap.nic.in

SCHOLARSHIP ALERT

Rolls-Royce Wings4Her Scholarship for Women Engineering Students

Description: Rolls-Royce india invites applications from girl students studying in the 1st/2nd/3rd year of an engineering degree program at AICTE-recognised institutions. The scholarship aims to support deserving students who demonstrate academic excellence and financial need.

Eligibility: Girl students enrolled in the 1st/2nd/3rd year of an engineering degree program (in fields like aerospace, marine, electronics, computers, etc.) at AICTE-recognised institutions are eligible.

- The applicants must have scored more than 60% in their Class 10 and 12 board exams.
- Annual family income must not exceed INR 4 lakh per annum.
- Open to pan-India students.

Please Note:

- Female scholars who have previously received the 'Rolls-Royce Wings4Her Scholarship for Women Engineering Students' in 2023 and are currently in their 4th year of engineering degree can also apply.
- Preference will be given to individuals belonging to special categories, such as tahose with physical disabilities, single parents, and orphans.

Prizes & Rewards: INR 35,000.

- Exclusive one-to-one and one-to-many mentorship sessions, webinars/workshops from industry experts at Rolls-Royce India

Last Date to Apply: 05-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/UNSC3

Infosys Foundation STEM Stars Scholarship

Description: An initiative by Infosys Foundation to support female students in India who aspire to pursue undergraduate degrees in STEM (Science, Technology, Engineering, Mathematics) subjects.

Eligibility: Female students who are citizens of India and enrolled in the first year of their 4-year undergraduate course in the fields of engineering, medicine (MBBS), and other related STEM subjects at institutes of repute (NIRF accredited) are eligible.

- Applicants must have obtained admission into the identified colleges and must have completed their Class 12.
- The annual family income of the applicants from all sources must be less than or equal to 8 lakh.
- Candidates must not have availed other scholarships for the same expenses

Prizes & Rewards: The selected candidates will receive a scholarship of up to 1 lakh per annum, covering tuition, living expenses, and study materials, for the duration of the course against paid receipts.

Last Date to Apply: 15-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/ISTS2

Corteva Agriscience Scholarship Program

Description: An initiative of Corteva Agriscience India Pvt. Ltd., this program aims to provide financial assistance to meritorious students pursuing postgraduate, doctoral or undergraduate courses in the area of agriculture, as well as students in Classes 11 and 12 with STEM subjects.

Eligibility: Female students in postgraduate (MBA/M.Sc./M.Tech.), doctoral, or undergraduate courses, as well as for those in Classes 11 and 12 with STEM subjects (government/private schools).

- The applicant's annual family income must be 6,00,000 or less.
- Students from across India can apply
- Children of employees of Corteva & Buddy4Study are not eligible.

Prizes & Rewards:

- For PG students: INR 50,000
- For UG students: INR 25,000
- For school students: INR 10,000

Last Date to Apply: 13-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/CASP4

KSB Scholarship and Mentorship

Description: KSB Ltd through Care Charitable Trust invites applications from female students in their first year of a diploma in engineering or any polytechnic course to provide them with financial support for their studies.

Eligibility: Girls studying in the first year of a diploma in engineering or any polytechnic course. Students studying or having domiciles in and around Pune, Nashik, Ahmednagar, Satara, and Coimbatore. Students who have scored more than 60% marks in their previous classes are eligible to apply. Students' family income from all sources should be less than INR 8 lakh per annum. Children of employees of KSB Care Charitable Trust and Buddy4Study are not eligible.

Prizes & Rewards: Scholarship of INR 25,000 and mentorship support

Last Date to Apply: 16-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/KSBMP1

buddy4study.com

లిటిల్స్




నగరం- హాంకాంగ్

- దక్షిణ చైనాలో ఉండే నగరమిది. ప్రపంచంలోనే పాపులర్ సిటీ 'హాంకాంగ్'. యాత్రికులకు స్వర్గధామం. షాపింగ్‌కు ఫేమస్. టూరిస్టుల కోసమే తయారు చేసిన నగరమిది. ఇంగ్లీషు ఎక్కువగా మాట్లాడతారు. చైనా ప్రత్యేక పాలనా ప్రదేశమిది.
- హాంకాంగ్ అంటే చీనీ భాషలో 'ఫ్రాగ్రంట్ హార్బర్' అని అర్థం. ఓడరేవులతో పాటు అందమైన, ఎత్తైన కట్టడాలకు ప్రసిద్ధి ఈ నగరం. వాస్తవానికి ఇది 263 దీవుల సముదాయమిది. ఇక్కడి శుభ్రమైన పరిసరాలు, అందమైన బీచ్‌లు ఆహ్లాదకరం. ఆసియాలోని ఖరీదైన నగరాల్లో ఇదే ప్రథమం. సింగపూర్‌ను మించి యాత్రికుల సందడి హాంకాంగ్‌కు ఉంటుంది.




- ప్రపంచంలోనే అతి పొడవైన ఎస్కలేటర్ ఇక్కడ ఉంది. మిడ్ లెవల్ ఎస్కలేటర్స్ కనీసం అరకిలోమీటర్ ఉంటాయి.
- డబ్బును అధికంగా సంపాదించాలనే కోరిక ఉండే వాళ్లలో హాంకాంగ్ ప్రజలు ఒకరు. 2020 గ్లోబల్ బిలియనీర్ లిస్ట్ చూస్తే అందులో హాంకాంగ్ ర్యాంక్ 7 వ స్థానం.
- 7.5 మిలియన్ల జనాభా ఉండే ఈ నగరంలో 95 శాతం చైనీయులే ఉంటారు. ఇక్కడి ప్రజలు ఎగ్‌టార్ట్, పైనాపిల్ బన్స్ ఇష్టంగా తింటారు. 20 సాకర్ గ్రౌండ్స్ అంత హాంకాంగ్‌లో విమానాశ్రయం ఉంది.
- చైనా, ఇంగ్లీష్ అధికారిక బాషలు. ఈ దేశాన్ని 'వన్ కంట్రీ.. టూ సిస్టమ్స్' అని పిలుస్తారు.
- హాంకాంగ్ ప్రాంతాన్ని గతంలో జపాన్‌తో పాటు పోర్చుగీసు, బ్రిటన్ కూడా పాలించింది. ఇపుడు చైనా అదుపాజ్ఞలో ఉంది. విచిత్రమేంటంటే.. ఇక్కడి పాత బ్రిటీష్ కాలనీల్లో ఉండే వాళ్లు దాదాపు ఇంటికొకరు రోల్స్ రాయ్స్ కారును వాడతారు. అలా ప్రపంచంలోనే అత్యధిక రోల్స్ రాయ్స్ కార్లు ఇక్కడే ఉన్నవి.
- ప్రపంచంలోనే అత్యధిక (సుమారు 9000) స్కై స్క్రాపర్స్ ఇక్కడే ఉన్నాయి.
- 40 శాతం పార్కులు, నేషనల్ రిజర్వ్‌లు ఇక్కడ ఉన్నాయి. చైనాలో ఫోర్ అనే శబ్దానికి అర్థం 'డెత్'. అందుకే నాలుగో ఫ్లోర్ ఉండదు. లిఫ్ట్‌లో నాలుగు అంకె కనిపించదు.

దారి కనుక్కోండి



6 తేడాలు గుర్తించండి



సరైన నీడ కనుక్కోండి



డైలీ సుడోకు - 385

		7		3		1		
	2	3			8		4	5
							6	3
	8							7
			8		1			
5							2	
9	5							
3	4		9			6	1	
		2		6		9		

సుడోకు - 384 సమాధానం

3	7	5	1	4	6	2	9	8
4	8	6	9	3	2	7	5	1
9	1	2	7	8	5	6	4	3
8	2	4	6	7	3	9	1	5
7	6	3	5	9	1	4	8	2
5	9	1	8	2	4	3	6	7
1	5	9	2	6	7	8	3	4
6	4	7	3	1	8	5	2	9
2	3	8	4	5	9	1	7	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.